Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం, ఏప్రిల్ 25, 2026 | సంపుటి - 20 | సంచిక 220 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

### పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

**చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి**

**సిఎం రేవంత్ సంతాపం, మంత్రి పొన్నంల సంతాపం**



2లో

హైదరాబాద్ : ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు. గురువారం ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న విషయం తెలిసిందే.



## బెంగాల్‌లో జంగిల్ రాజ్
# ఖేల్ ఖతం

### భారీ ఓటింగ్ బిజెపి అధికారానికి సూచిక

- టిఎంసి పూర్తి మహిళా వ్యతిరేక పార్టీ
- ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు. తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. 2లో

# తెలంగాణలో మరో కొత్తపార్టీ



### నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత
### కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి
### తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం

హైదరాబాద్ : తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడుపోసుకుంటుంది. శనివారం కవిత కొత్త పార్టీ ప్రకటించబోతున్నారు. పార్టీ పేరు ప్రకటన విడుదల కాబోతున్నది. శనివరాం ఉదయం 10 గంటలకు.. కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. జెండా, ఎజెండా విడుదల చేయబోతున్నారు. తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కామ్రేడ్ పార్టీలకు ధీటుగా పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీకి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ అద్వయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహిరంగ సభలో కవిత తన పార్టీ పేరును ప్రకటించ బోతున్నారు. ఈ సభకు సుమారు 30 వేల మంది జన సమీకరణ చేస్తున్నట్లు జాగృతి శ్రేణులు తెలిపారు. మేడ్చల్ సభలోనే కవిత పార్టీ పేరు జెండా, ఎజెండాను ప్రకటించ నున్నారు.

తరువాయి 2లో

## ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం

### రేవంత్ నిర్లక్ష్యమే శంకర్ గౌడ్‌ను బలితీసుకుంది
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ : వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదు.. అది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసి కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు, తోటి కార్మికుల హక్కుల సాధనకు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు, బీఆర్ఎస్ నేతలు, ఆర్టీసీ కార్మికులు, కార్మిక సంఘాల నేతలను నర్సంపేటలో అరెస్టు చేయడం చాలా దారుణమని అన్నారు. 2లో



2

### హుగ్లీ నదిలో ప్రధాని విహారం

**బెంగాలీల్లో గంగానదికి ప్రత్యేకత ఉంది**

**ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ**

కోల్‌కతా : ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు.

## పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో
# విజయం బీజేపీదే

### మొదటిదశలో 110కి పైగా సీట్లు గెలుస్తాం
### కేంద్రహోంమంత్రి అమిత్ షా ధీమా



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం బీజేపీదే అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మొదటి దశ ఎన్నికల్లో 152 స్థానాలకు గాను బీజేపీ 110కి పైగా సీట్లు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ పర్యటనలో ఉన్న ఆయన కోల్‌కతాలో మీడియా సమావేశం నిర్వహించారు. 2లో

## ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యం

### సమస్యను పరిష్కరించకుండా కమిటీలతో కాలయాపన
### బీజేపీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు మండిపాటు



హైదరాబాద్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు మండిపడ్డారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకుండా తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ సమ్మె సమస్యను పరిష్కరించాల్సింది పోయి కమిటీల పేరుతో కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసింది. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన పోరుబాట చివరకు సమ్మెకు దారితీసి.. 2లో

## కేరళను ఠారెత్తిస్తున్న ఎండలు

### గతంలో ఎప్పుడూ లేనంతగా ఉష్ణోగ్రతలు
### స్వీయ నిర్బంధంతో ఇంట్లోనే ఉండాన్న సిఎం

తిరువనంతపురం : కేరళలో గత రెండు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఆ రాష్ట్రంలో అధిక తేమతో కూడిన తీవ్రమైన వేడి కనీసం ఏప్రిల్ 27 వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ డైరెక్టర్ నీతా కె. గోపాల్ వెల్లడించారు. వడదెబ్బకు ఇప్పటికే ఆ రాష్ట్రంలో ఒకరిద్దరు మరణించారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి పినరయ్ విజయన్ కోవిడ్-19 తరహాలో ఇప్పుడు సెల్ఫ్ లాక్ డౌన్ అంటే స్వీయ నిర్బంధం తరువాయి 2లో



## రాష్ట్రంలో 706 పురాతన
# ఆలయాల పునర్నిర్మాణం



**రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించాం**

**మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి**

నెల్లూరు : రాష్ట్రంలో 706 పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం కృష్ణపట్నంలోని శ్రీ సిద్ధేశ్వర స్వామి ప్రాచీన దేవాలయ పునరుద్ధరణకు మంత్రి శంకుస్థాపన చేశారు. నిపుణుల బృందంతో కలసి ఆలయాన్ని మంత్రి ఆనం, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాబోయే రెండేళ్లలో రూ.750 కోట్లు కేటాయించి 2లో

# గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమా

### కిల్లర్ పార్టీ నేతలు కొత్త ఎత్తుగడలు
### వారి వ్యూహాలకు తగ్గట్లుగా ఉండాల్సిందే
### ఎంతటి దారుణాలకైనా తెగించేస్తున్నారు
### క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో పార్టీ అధినేత చంద్రబాబు

అమరావతి : వైసిపి రాజకీయ కుట్రలతో అప్రమత్తంగా ఉండాలని టిడిపి శ్రేణులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. కిల్లర్ పార్టీతో టీడీపీ నేతలు అందరూ జాగ్రత్తగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కిల్లర్ పార్టీ ఆలోచనా విధానాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి కౌంటర్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో కిల్లర్ పార్టీ దారుణాలకు తెగబడుతోందని.. వారి ఆగడాలు చెల్లనివ్వమని హెచ్చరించారు. జగన్ అండ్ కో రోడ్ల మీదకు వస్తారని, రెచ్చగొడతారని, రప్పా రప్పా అంటారని, ప్రజలను ఇబ్బందులు పెడతారని, చర్యలు తీసుకుంటే రాజకీయ కక్ష అంటారని ఎద్దేవా చేశారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. శిక్షణా తరగతులకు వచ్చిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో కాఫీ కబుర్లు కార్యక్రమం నిర్వహించి.. వారికి పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల వంటి అంశాలపై సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. ప్రతి కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దుతామని... కేడర్ దాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. సమకాలీన రాజకీయాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సీఎం దిశానిర్దేశర చేశారు. తరువాయి 2లో

# ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్(55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. అత్యక్రియలకు ప్రముఖ రాజయకీయ నాయకులు హాజరుకానున్నారు. మరోవైపు.. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని గుర్తు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందవద్దని క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణలో మరో కొత్తపార్టీ

కవిత పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ ప్రజా వికాస సమితి' అంటూ జోరుగా ప్రాచారం సాగుతోంది. ఈమేరకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులతో కవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ జాగృతి పేరుతోనే ఇప్పటికే చేరికలు ప్రారంభమయ్యాయి. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు కార్యకర్తలు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. జాగృతి జనం బాట కార్యక్రమంతో పార్టీకి సంబంధించిన గ్రౌండ్ వర్క్‌ను ఆమె పూర్తి చేశారు. అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీ నీ ,మరోవైపు బిజెపిని టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు కవిత. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు కవిత. కవిత పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనున్నారు. ఇంటిపార్టీతో బంధం తెంచుకున్న ఆమె తెలంగాణ రాజకీయాల్లో కొత్త జెండా పాతబోతున్నారు. తనకున్న పరిచయాలు, వాక్చాతుర్యంతో ఆమె ముందుకు నడవాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలను, ఎస్సీ, బిసి వర్గాలను అక్కున చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యం

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ముగ్గురు ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడడం ఎంతో కలచివేసింది. ముఖ్యంగా ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం చేసిన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటకు చెందిన డ్రైవర్ కోల శంకర్ గౌడ్ చికిత్స పొందుతూ మరణించడం అత్యంత బాధాకరం. కాంగ్రెస్ సర్కారు ఆర్టీసీ కార్మికుల డిమాండ్లతోపాటు వారి సమస్యలు పరిష్కరించక పోవడం వల్లే ఈ దారుణ పరిస్థితి ఎదురైంది. శంకర్ గౌడ్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆయన కుటుంబానికి తగిన పరిహారం చెల్లించాలి. ఆర్టీసీ కార్మికులు ముందుగానే నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం మాత్రం పట్టించుకోకపోవడం అత్యంత దురదృష్టకరం. బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అని రామ్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలంటూ కార్మికులు సమ్మెకు దిగినప్పుడు, భారతీయ జనతా పార్టీ కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేసింది. అదే విధంగా, 2017 నుంచి ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం, రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ ఇవ్వకపోవడం కూడా ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇలాంటి చర్యలు ఇప్పటికే అమలు చేసిన విషయం తెలిసిందే. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి. కార్మికుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి. ఆర్టీసీ కార్మికులకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. వారి హక్కుల కోసం మేము పోరాటం కొనసాగిస్తున్నాం.. కొనసాగిస్తూనే ఉంటాం. ఆర్టీసీ కార్మికుల పక్షాన బీజేపీ ఎల్లప్పుడూ నిలుస్తుంది. తెలంగాణ సమాజం మొత్తం కూడా ఈ పోరాటంలో కార్మికుల పక్షానే నిలుస్తోంది. అయితే, ఈ సందర్భంగా నేను ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నాను.. ఎవరూ కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దు. మీ సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని' ఆ పార్టీ తెలంగాణ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు.

## కేరళను ఠారెత్తిస్తున్న ఎండలు

పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తీవ్రమైన ఎండ తగిలే సమయాల్లో నేరుగా సూర్యరశ్మికి గురికాకుండా ఉండేందుకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్య అనవసర ప్రయాణాలు, బహిరంగ ప్రదేశాలలో పనులు మానుకోవాలని ఆయన సలహా ఇచ్చారు. అలాగే ఈ సమయంలో బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు, క్రీడా కార్యక్రమాలు నిషేధించ నున్నట్లు వెల్లడించారు. వడగాలుల హెచ్చరికల దృష్ట్యా, పాలక్కాడ్, కొల్లాం, త్రిస్సూర్ జిల్లాల్లో పండుగల సమయంలో పగటిపూట జరిగే ఏనుగుల ఊరేగింపులు, బాణాసంచా ప్రదర్శనలను నివారించాలని లేదా వాయిదా వేయాలని ఆయన ఆదేశించారు. అలాగే ప్రయాణికులకు, ప్రజలకు తాగునీటిని అందించడానికి నీటి ట్యాంకులను, నీడ ఉన్న విశ్రాంతి ప్రదేశాలను ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థలు, కుటుంబశ్రీ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అలసట లేదా వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని ఆయన సూచించారు. ఎండదెబ్బకు ఎవరైనా ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తే వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తరలించి వైద్య సహాయం అందించాలని విజయన్ కోరారు..

## వందేమాతరం సామూహిక గీతాలపన

### మోడీని ఆహ్వానించేందుకు బిజెపి ఆఫీస్‌కు వెళ్లా మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్24 : గత కొంతకాలంగా మాజీ మంత్రి మల్లారెడ్డి బీజేపీలో చేరతారంటూ వస్తున్న వార్తలకు కోడలు ప్రీతి రెడ్డి చెక్ పెట్టారు. శుక్రవారం ఉదయం ప్రీతి రెడ్డి బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. అనంతరం ప్రీతి మాట్లాడుతూ.. తాను కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో టచ్‌లో ఉన్నది వాస్తవమే అని అన్నారు. అయితే బీజేపీలో చేరతానంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సామూహిక వందేమాతర గీతాలాపన కోసం మోదీని కలిసి ఆహ్వానించినట్లు చెప్పారు. మోదీ వస్తే పెద్ద ఈవెంట్ అవుతుందన్నారు. అందులో భాగంగానే శుక్రవారం బీజేపీ కార్యాలయంలో చంద్ర శేఖర్ తివారీని కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. 'మా మామ మల్లారెడ్డి బీఆర్ఎస్‌లోనే ఉంటారు' అంటూ ప్రీతి రెడ్డి తేల్చిచెప్పారు. ఇటీవల కుటుంబసభ్యులతో సహా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మల్లారెడ్డి కలిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మల్లారెడ్డి బీజేపీలో చేరబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా బీజేపీ కార్యాలయానికి ప్రీతి రెడ్డి రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ప్రధానిని ఎందుకు కలిశారో చెప్పి.. ఈ ప్రచారానికి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టేశారు.

# బెంగాల్‌లో జగిల్ రాజ్ ఖేల్ ఖతం

రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు.గురువారం నాడు బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వామ్యాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం. బెంగాల్ ఆడబిడ్డలు అత్యాచారానికి గురై న్యాయం కావాలని కోరితే.. ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదని వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన బాధిత యువతి తల్లి రత్న దేవ్‌నాథ్‌ను ప్రధాని మోదీ కలిశారు. ఆమెను బీజేపీ ఈ ఎన్నికల్లో తన పార్టీ తరఫున పానిహటి నుంచి బరిలోకి దింపింది. ఈ అంశంపై మోదీ స్పందించారు. రత్న దేవ్‌నాథ్.. తన కూతురును కష్టపడి డాక్టర్ చేసింది. కానీ, టీఎంసీ ప్రభుత్వం ఆమె కూతురును తీసుకెళ్లింది. మేం ఆమె తల్లిని మా అభ్యర్థిగా నిలబెట్టాం అని మోదీ అన్నారు.

## గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమీ

అధికారం కోల్పోయిన తర్వాత కూడా వైసీపీ చేస్తున్న అరాచకాలను వివరించారు. ప్రస్తుత పరిణామాల్లో క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి వచ్చిందనే విషయాన్ని నిరంతరం గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఇటీవల జరిగిన పెద్ద దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు బరితెగింపు వంటి అంశాలను ప్రస్తావించారు. తన జీవితంలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాను తప్ప... నేరగాళ్లతో ఏనాడూ పోరాడలేదని.. ఇది తనకు కొత్తగా ఉందని తెలిపారు. వైసీపీ సోషల్ సైకోలతో తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. వైసీపీ లాంటి పార్టీని తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని ఎద్దేవా చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని గొడ్డలి పార్టీ ఎమ్మెల్సీ హత్య చేశారని.. కోర్టులో సాక్ష్యం చెప్పినవారిని కూడా బెదిరించారని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ చేసే అరాచకాలను అనునిత్యం ప్రజలకు కేడర్ వివరిస్తూనే ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. అవకాశాలను ఉపయోగించుకుని కార్యకర్తలు నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మంచి చేస్తే ప్రజలు నిరంతరం గుర్తుంచుకుంటారని వ్యాఖ్యానించారు. సుదీర్ఘ కాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఉద్ఘాటించారు. 2019లో వైసీపీ గెలిచాక ఏపీలో అభివృద్ధి జరగలేదని ప్రస్తావించారు. తనను అరెస్టు చేసినా, పార్టీని ఇబ్బంది పెట్టినా కార్యకర్తలను కాపాడుకున్నానని స్పష్టం చేశారు. రాజకీయాలను దాటి సామాన్య ప్రజలను కూడా జగన్ హయాంలో ఇబ్బందులకు గురి చేశారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. 2019–24 మధ్య జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు నిత్యం గుర్తు చేయాలని అన్నారు. మనం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించడంతోపాటు.. కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం పడే కష్టలను ప్రజలకు వివరించాలని సూచించారు. టీడీపీలో కార్యకర్తలే అధినేతలని.. పార్టీ కూడా కార్యకర్తలను అలాగే గౌరవిస్తోందని స్పష్టం చేశారు. అన్యాయం జరిగిందని జగన్ రెడ్డి పరామర్శకు వెళ్తారని... కార్యకర్తలను కార్ల కింద తొక్కించి చంపేస్తారని... కానీ తన కారు కింద పడిపోయిన కార్యకర్తను మాత్రం ఎందుకు పరామర్శించరని ప్రశ్నించారు. కడపలో సొంత పార్టీ కార్యకర్తనే హత్య చేశారని ఆరోపించారు. కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి కలిసి ప్రభుత్వ భూములను దోపిడీ చేశారని ఆగ్రహించారు. పంపకాల్లో విభేదాలు రావడంతో దస్తగిరి అనే వైసీపీ కార్యకర్తను చంపేశారని సీఎం చంద్రబాబు ఆరోపించారు. వాళ్ల అనుచరులను వాళ్లే చంపుకుని నేరం తమపై నెట్టేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికలయ్యేదాకా మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యను వాడుకున్నారని... అధికారంలోకి వచ్చాక న్యాయం చేయాలని జగన్ చెల్లెలు వైఎస్ సునీతారెడ్డి అడిగితే సైలెంట్‌గా ఉండమని ఆమెను కూడా బెదిరించారని ఆగ్రహించారు. ఆస్తి విషయంలో తల్లి, చెల్లిపై ఎవరైనా కోర్టుకు వెళ్తారా..? అని మండిపడ్డారు.

## ఆర్టీసీ కార్మాకులకు రేవంత్ తీరని ద్రోహం

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయడంతోపాటు, శంకర్ గౌడ్ కుటుంబసభ్యులు, ఆర్టీసి కార్మికుల విజ్ఞప్తిమేరకు ఆర్టీసి డిపో వద్ద నివాళులు అర్పించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ సర్కారు రాక్షసత్వం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే శంకర్ గౌడ్ గారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నా, కనీసం సోయి లేని సర్కారు అంతులేని నిర్లక్ష్యం వల్లే ఇవాళ ఉద్యమం నాటి దృశ్యాలు, ఆత్మబలిదానాలు చేసుకునే పరిస్థితులు చూస్తున్నామని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల వేళ సవాలక్ష హామీలిచ్చిన రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఇప్పటికీ నెరవేర్చకపోవడంతోనే ఆర్టీసీ కార్మిక లోకం ఇవాళ తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోందని కేటీఆర్ అన్నారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలను ఇకనైనా మానుకుని ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సంఘటన తెలంగాణ చరిత్రలో ఓ చీకటి రోజుగా మిగిలి ఉంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో ఏకకాలంలో ఇన్ని బాధాకరమైన సంఘటనలు జరిగినా మానవత్వం లేని కాంగ్రెస్ సర్కారులో కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా.. దయచేసి మనోధైర్యాన్ని కోల్పోకండి. మీ పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారు, ఈ అసమర్థ ముఖ్యమంత్రి మెడలు వంచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన హక్కులను సాధించే వరకూ మనమంతా కలిసి సంఘటితంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

## రాష్ట్రంలో 706 పురాతన ఆలయాల పునర్నిర్మాణం

భజన మందిరాల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న 43 ఆలయాలకు కూటమి ప్రభుత్వం రూ.52 కోట్లు వెచ్చించిందని మంత్రి వెల్లడించారు. ఆలయాల పునర్నిర్మాణం అపూర్వమైన ఘట్టమని అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం హిందూ జనోద్ధరణకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆలయాల విశిష్ఠతను కాపాడటంలో కూటమి ప్రభుత్వం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. గత ప్రభుత్వంలో దీపారాధనకు కూడా ఆలయాలు నోచుకోక పోవడం బాధాకరమన్నారు. 10, 11 శతాబ్దాల కిందట గండగోపాలపురంగా పిలువబడ్డ ఈ ప్రాంతంలో సిద్ధేశ్వర ఆలయాన్ని నిర్మించారని తెలిపారు. ఆలయాల పునర్నిర్మాణం త్వరితిగతిన జరగాలని ఆదేశించినట్లు చెప్పారు. ఆలయాల పునర్నిర్మాణం కోసం శ్రమిస్తున్న కేంద్ర పురావస్తు శాఖ అధికారులను కూటమి ప్రభుత్వం అభినందిస్తోందని మంత్రి తెలిపారు. బ్యాంకుల్లో ఉన్న ఆలయాల ఫిక్సిడ్ డిపాజిట్లను ఎట్టి పరిస్థితుల్లో ఖర్చు చేయవద్దని.. ఫిక్సిడ్ డిపాజిట్ల నుంచి వచ్చే ఆదాయాలను మాత్రమే వినియోగించవచ్చని ఆనం సూచించారు. ఆలయ కమిటీలు, బోర్డు మెంబర్ల నియామకంలో గత ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని మండిపడ్డారు. చట్టాలను గౌరవించే నాయకుడు సీఎం చంద్రబాబు అని ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శతాబ్దాల కాలంనాటి సిద్ధేశ్వర ఆలయం పునర్నిర్మాణం జరగడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఆలయాన్ని కూల్చకుండా పునర్నిర్మాణం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆలయాన్ని ప్రాచీన పద్ధతుల్లోనే పునర్నిర్మాణం చేస్తున్నారని వివరించారు. ఆలయానికి కావల్సిన నిధులు సిద్ధంగా ఉన్నాయని... దాతలు కూడా సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.

## శంకర్‌గౌడ్ మృతి అత్యంత బాధాకరం

### శవరాజకీయం చేస్తున్న బండి సంజయ్ మండిపడ్డ అద్దంకి దయాకర్

హైదరాబాద్,ఏప్రిల్24 : ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి అత్యంత బాధాకరమని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ శవ రాజకీయాలు చేస్తున్నారని దయాకర్ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. శంకర్ మృతిని కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయం చేస్తున్న తీరు హేయం, సిగ్గుచేటు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు బీఆర్ఎస్ నాయకులు కార్మికులను రెచ్చగొడుతుంటే.. మరోవైపు బీజేపీ నాయకులు శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నర్సంపేటలో ఉద్రిక్తతలకు కారణం బండి సంజయ్ అని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి అన్న విషయాన్ని మర్చిపోయి బండి సంజయ్ కార్మికులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలా స్పందించిందో అందరికీ తెలుసన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా శంకర్ గౌడ్ కుటుంబాన్ని కలిసి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. శంకర్ గౌడ్ కుటుంబం పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, చనిపోయిన ఆర్టీసీ కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామని సర్కార్ ప్రకటించిందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే... బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వ విప్ మండిపడ్డారు. సీఎం, మంత్రివర్గం అంతా.. ఆర్టీసీ కార్మికులు తొందరపడవద్దని విజ్ఞప్తి చేశారన్నారు. సమస్య పరిష్కారానికి తాము ప్రయత్నిస్తుంటే.. బండి సంజయ్, బీఆర్ఎస్ నేతలు మాత్రం ఓట్లు వెతుక్కుంటున్నారని విమర్శించారు. దయచేసి ఆర్టీసీ కార్మికులు ఇలాంటి క్షుద్ర రాజకీయ పార్టీలను, నాయకులను నమ్మొద్దని.. కచ్చితంగా కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు.

## తక్షణం ఆస్తిపన్ను చెల్లించండి

### ఐదుశాతం రాయితీకి మరో నాలుగు రోజుల గడువు

నల్లగొండ,ఏప్రిల్24 : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీ పొందేందుకు కేవలం 6 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర కోరారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర ప్రజలు తమ ప్రాపర్టీ పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును తక్షణమే చెల్లించి, రాయితీ ప్రయోజనాన్ని పొందాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పన్నులు సమయానికి చెల్లించడం ద్వారా నగర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూరుతాయన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల నిర్వహణ, వర్షపు నీటి కాల్వల శుద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రాథమిక సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి పన్నుల వసూలు కీలకమని తెలిపారు. పౌరులందరూ ప్రాపర్టీ ట్యాక్స్‌తో పాటు వాటర్ ట్యాక్స్ అలాగే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా చెల్లించాల్సిందిగా కోరారు. ప్రజల సహకారం లేకుండా నగర అభివృద్ధి సాధ్యం కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించడం ద్వారా నల్లగొండను మరింత పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. పౌరులందరూ చివరి తేదీకి ముందుగానే తమ పన్నులను చెల్లించి, ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీని వినియోగించుకోవడంతో పాటు, నగరాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాల్సిందిగా కమిషనర్ కోరారు.

## హుగ్లీ నదిలో ప్రధాని విహారం

దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఈ రోజు ఉదయం హుగ్లీ నది తీరంలో కొంత సమయం గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈసందర్భంగా మోదీ కొనియాడారు. ఎన్నికల్లో గెలిపిస్తే.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక విద్యాసాగర సేతు, హౌవ్‌డా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందన్నారు.

## పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో విజయం బీజేపీదే

ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమన్నారు. రెండో దశలోనూ తామే ఎక్కువ సీట్లు నెగ్గుతామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది బీజేపీనే అంటూ ప్రకటించారు. మమతా బెనర్జీ, టీఎంసీ ప్రభుత్వానికి ఘోర పరాజయం తప్పదని హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. అందుకు మొదటి దశలో 92.88 శాతం ఓటింగ్ నమోదు కావడమే నిదర్శనమన్నారు. బెంగాల్ ఓటర్లు అభివృద్ధిని ఎంచుకున్నారని తొలి దశ ఎన్నికలతో స్పష్టమైందని చెప్పుకొచ్చారు. బెంగాల్‌లో మార్పు కోసం ప్రజలు ఉత్సాహంగా ఓట్లు వేశారన్నారు. మహిళల రక్షణ బీజేపీ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అవినీతిపరులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. బెంగాల్‌లో బీజేపీ, పార్టీ అభ్యర్థులు తమ అంచనాలకు తగినట్లుగా పని చేశారని కితాబిచ్చారు. మరోవైపు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించారంటూ ఎన్నికల సంఘం, స్థానిక పోలీసులు, భద్రతా దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. చాలా కాలం తర్వాత ఒక్కరి ప్రాణం కూడా పోకుండా జరిగిన బెంగాల్ ఎన్నికలు ఇవేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. కాగా, ఈనెల 23న పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. తమిళనాడులో 234 స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరగ్గా.. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం తొలి దశలో 152 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. మిగిలిన 142 స్థానాలకు ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెల్లడిస్తారు.

## ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్

### బిజెపిలో చేరుతున్న రాఘవచద్దా తదితరులు

న్యూఢిల్లీ,ఏప్రిల్24 : ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుల్లో ముగ్గురు పార్టీకి గుడ్‌బై చెప్పి.. బీజేపీలో చేరబోతున్నారు. వీరిలో ప్రస్తుతం రాజ్యసభ ఆప్ డిప్యూటీ లీడర్ అశోక్ కుమార్ మిట్టల్ కూడా ఉన్నారు. ఇటీవలే రాఘవ్ చద్దాను రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి తొలగించిన ఆప్.. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. కానీ, ఇప్పుడు ఆయన కూడా పార్టీని వీడి బీజేపీలో చేరబోతున్నారు. ఈ విషయాన్ని ఆప్ రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ బహిష్కృత నేత రాఘవ్ చద్దా వెల్లడించారు. శుక్రవారం రాఘవ్ చద్దా, అశోక్ కుమార్ మిట్టల్, సందీప్ పాఠక్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తాము ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరబోతున్నట్లు వెల్లడించారు. రాజ్యసభలో మూడింట రెండొంతుల ఆప్ సభ్యులు కలిసి బీజేపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. అంటే రాజ్యాంగం ప్రకారం ఈ ముగ్గురూ కలిసి ఆమ్ ఆద్మీ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారు. ఇలా ఒక సభలో ఒక పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల మంది సభ్యులు.. అధికార లేదా వేరే ఏ పార్టీలోనైనా చేరవచ్చు. ఇలా చేరితే, పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించదు. దీంతో ఈ ముగ్గురి రాజ్యసభ సభ్యత్వానికి ఢోకా లేకపోవచ్చు. ఇక, రాఘవ్ చద్దా, అశోక్, సందీప్.. ముగ్గురూ 2022 నుంచి ఆప్ తరఫున రాజ్యసభలో సభ్యులుగా కొనసాగుతున్నారు. తాజా మీడియా సమావేశంలో రాఘవ్ చద్దా మాట్లాడుతూ 'ఆమ్ ఆద్మీ పార్టీ కోసం 15 ఏళ్లపాటు చెమట, రక్తం చిందించాను. ఇప్పుడు ఆ పార్టీ తన సిద్ధాంతాలు, విలువలు, నైతిక అంశాల నుంచి పూర్తిగా పక్కకు తప్పుకొంది. ఆమ్ ఆద్మీ పార్టీ తన స్వార్థ ప్రయోజనాల కోసం తప్ప దేశం కోసం, జాతి ప్రయోజనాల కోసం పని చేయడం లేదు. ఇది చాలా మంది ఎప్పటినుంచో చెబుతున్నారు. ఇప్పుడు నేను కూడా అదే అనుకుంటున్నా. నేను సరైన పార్టీలో లేనని భావిస్తున్నా. సరైన వ్యక్తిని.. తప్పుడు పార్టీలో ఉన్నా. అందుకే ఈ రోజే ఆమ్ ఆద్మీ పార్టీకి దూరంగా ఉంటున్నా. ప్రజల కోసం వెళ్తున్నా' అంటూ ప్రకటించారు. తమతోపాటు స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్‌జిత్ సింగ్ సహ్నే కూడా త్వరలో ఆప్‌ను వీడి బీజేపీలో చేరుతారు అంటూ రాఘవ్ వెల్లడించారు. అలాగే, తాను మోదీ, అమిత్ షా నాయకత్వంలో పని చేయబోతున్నట్లు వెల్లడించారు. తాజా సమాచారం ప్రకారం.. రాఘవ్ చద్దాకు కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## నర్సంపేట వెళ్లకుండా బిఆర్ఎస్ నేతల అడ్డగింత

### మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ తదితరుల అరెస్ట్

జనగామ,ఏప్రిల్24 : ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంతిమ యాత్రలో పాల్గొనడానికి వరంగల్ జిల్లా నర్సంపేట వెళ్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను స్టేషన్ ఘనపూరం మార్గ మధ్యలో అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు మాజీ హోంమంత్రి సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, మాలోతు కవితను జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ గేట్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

# హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

### ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి

### ఏడుగురు ఐపిఎస్‌ల బదిలీలు

హైదరాబాద్,ఏప్రిల్24 : రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్ నియమితులయ్యారు. విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్ బదిలీ అయ్యారు. మల్టిజోన్ 2 ఐజీగా షానవాజ్ ఖాసిం నియిమితులయ్యారు. ఆయన పోలీసు పర్సనల్ ఐజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు.డ్రగ్స్ కంట్రోల్ డీజీగా అవినాష్ మొహంతిని నియమిస్తూ, ఆయనకు ఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపోతే మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా బి.సుమతి, ఐజీ కార్తికేయకు ఎస్ఐబీ ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమాలు అమలు

### 10 థీమ్ లపై శాఖల వారీగా కార్యక్రమాలు

### డ్రగ్స్ అడ్డుకట్టకు పిల్లలు, యువతలో చైతన్యం

హైదరాబాద్ : ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా 10 థీమ్ లతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలను ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి, థీమ్ ల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ఇప్పటివరకు పరిశుభ్రత-ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్యం, ఆరైవ్- అలైవ్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఈ నెల 26 వరకు సంక్షేమం పై కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 27 నుండి మే నెల 2 వ తేదీ వరకు పిల్లల భద్రత లో భాగంగా డ్రగ్స్ కు అడ్డుకట్ట వేయుటకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యార్థులు, యువత, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. మే 4 నుంచి 10 వరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రెవెన్యూ, విద్యుత్, నీటి పారుదల అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అభివృద్ధికి విద్య దిక్సూచిగా నిలుస్తుందనే సంకల్పంతో మే నెల 11 నుంచి 16 వరకు విద్య యొక్క ప్రాధాన్యత, ప్రామాణిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పై విద్యార్థులు, తల్లిదండ్రులను చైతన్య వంతం చేస్తారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషిస్తుంది. అందులో భాగంగా క్రీడలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతుల ను ఎలా సద్వినియోగం చేసుకోవాలో స్పష్టం చేసేందుకు మే 18 నుంచి 23 వరకు క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే మే 25 నుంచి 30 వరకు రాష్ట్రంలో ఒక కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయుటకు చేపట్టిన పథకాలపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూన్ 1 నుంచి 12 వరకు పర్యావరణం థీమ్ పై కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని , అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచుటకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమనీ ను ప్రభుత్వం నిర్వహిస్తున్నది.

# రాజాపూర్‌లో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రానికి కూలర్ ఏర్పాటు



రామగిరి, ఏప్రిల్ 24(ది క్రైమ్ న్యూస్):- రాజాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రానికి గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య కూలర్‌ను అందజేశారు. వేసవి కాలంలో శిక్షణ పొందుతున్న మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి ఈ సహాయం అందించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ద్వారా మహిళలు నైపుణ్యాన్ని పెంపొందించుకుని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు ఇలాంటి శిక్షణ కేంద్రాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

## శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరం

### ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

### కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్య

కరీంనగర్,ఏప్రిల్24 : ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మ హత్య బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... 'ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కార్మికుడి ఆత్మహత్య.. ఇది ప్రభుత్వ హత్య' అంటూ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం బెదిరిస్తోందని ఆరోపించారు. ఇంత పెద్ద సమ్మె జరిగితే.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ సర్కార్ చేసిన తప్పే.. కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వంలో కూడా ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టో 28వ పేజీలో ఆర్టీసీని విలీనం చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. రెండు పీఆర్సీలు చెల్లిస్తామని హామీ ఇచ్చారంటూ కాంగ్రెస్ మేనిఫెస్టోను కేంద్ర మంత్రి చదివి వినిపించారు. ఆర్టీసీ సమస్యలపై బీజేపీ పోరాడితే.. ఓటు కాంగ్రెస్‌కు వేశారని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో కోత విధిస్తే ఎంత వస్తుంది. ఆ డబ్బులు బతానీలు కొనుక్కోవడానికి కూడా సరిపోవు. ఢిల్లీకి పైసల మూటలు పంపడం ఆపితే కార్మికులకు డబ్బులు ఇవ్వొచ్చు' అంటూ సర్కార్‌కు కేంద్ర మంత్రి హితవుపలికారు.

# నర్సంపేటకు శంకర్‌గౌడ్ మృతదేహం

### వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

### బండి సంజయ్‌తో పోలీసలు వాగ్వాదం



వరంగల్,ఏప్రిల్24 : ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ స్వగ్రామం ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో శంకర్ గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తీసుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. విషయం తెలిసిన వెంటనే వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ముత్తోజిపేటకు చేరుకుని కేంద్ర మంత్రితో మాట్లాడారు. నర్సంపేట డిపోకు శంకర్ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో ముత్తోజిపేటలో పరిస్థితి బండి సంజయ్ వర్సెస్ పోలీసులు అన్నట్టుగా మారింది. శంకర్ గౌడ్ అంత్యక్రియలు నిర్వహించాల్సిన కొడుకు హేమంత్‌ను బీజేపీ నేతలు నర్సంపేట డిపోకు తీసుకెళ్లారు. అయితే శంకర్ గౌడ్ డెడ్ బాడీని తిరిగి కూతురు ఇంటికి తరలించారు పోలీసులు. దీంతో ఆర్టీసీ డ్రైవర్ అంత్యక్రియలపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఎట్టిపరిస్థితుల్లో శంకర్ మృతదేహాన్ని డిపోకు తరలించాలని బండి సంజయ్ పట్టుబడుతుండగా.. అనుమతి లేదని పోలీసులు తేల్చి చెబుతున్నారు. దీంతో 365 జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. అంతకుముందు భారీ కాన్వాయ్‌తో బండి సంజయ్, బీజేపీ శ్రేణులు ముత్తోజిపేటకు చేరుకున్నారు. శంకర్ గౌడ్ మృతదేహానికి కేంద్ర మంత్రి నివాళులర్పించారు. బండి సంజయ్ రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లనీయకపోవడం దారుణమని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వమే లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ క్రియేట్ చేస్తోందని ఆరోపించారు. మానవతా విలువలు లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సంప్రదాయాలను విస్మరిస్తోందని అన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ నేతలు ఆర్టీసీ కార్మికుల దగ్గరకు వెళ్లి రాజకీయం చేయలేదా అని ప్రశ్నించారు. శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లనివ్వకపోతే రేపటి వరకూ బాడీ ఇక్కడే ఉంటుందని స్పష్టం చేశారు. కేవలం కుటుంబ సభ్యులకైనా మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లే అవకాశం కల్పించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ముత్తోజిపేట నుంచి కేంద్ర మంత్రి బండి సంజయ్ వెళ్లిపోయారు. బండి సంజయ్‌తో శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు మాట్లాడారు. అంత్యక్రియల విషయంలో కుటుంబసభ్యులకు అభ్యంతరం లేకపోతే తనకూ అభ్యంతరం లేదంటూ ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో శంకర్ గౌడ్ అంత్యక్రియలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# శంకర్ గౌడ్ మృతి చాలా బాధాకరం

### రవికుమార్ యాదవ్



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : శంకర్ గౌడ్ మృతి చాలా బాధాకరమని పేర్కొంటూ, "కార్మికులను బలి తీసుకోవడమేనా ప్రజాపాలన అంటే?" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మారబోయిన రవికుమార్ యాదవ్ ప్రశ్నించారు. అలాగే, ఏ కార్మికుడు క్షణికావేశంలో ఆత్మబలిదానాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేస్తూ, సహనంతో, శాంతియుతంగా పోరాటం కొనసాగిస్తూ సమస్యలను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో నర్సంపేటలో డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి నివాళులర్పిస్తూ మియాపూర్‌లో ఆర్టీసీ కార్మికులు మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మారబోయిన రవికుమార్ యాదవ్ హాజరై శంకర్ గౌడ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ ఆర్టీసీ కార్మికులను మోసం చేశాయని ఆరోపించారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి అమలు చేయలేదని, అలాగే ఎన్నికల ముందు సరూర్‌నగర్‌లో జరిగిన కార్మికుల సభలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణమైన ఉచిత బస్సు పథకాన్ని క్రమశిక్షణతో అమలు చేస్తున్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమని పేర్కొన్నారు. గతంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజుల సమ్మె చేసినప్పుడు బీజేపీ మద్దతుగా నిలిచిందని, ప్రస్తుతం జరుగుతున్న సమ్మెకు కూడా బీజేపీ పూర్తి అండగా ఉంటుందని తెలిపారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆకుల లక్ష్మణ్, గణేష్ ముదిరాజ్, పట్టాభిరామ్, శివ భాష, జితేందర్, శ్రీధర్ గౌడ్, రవి గౌడ్, శ్రీనివాస్ చారి, సీతారామరాజు, భరత్ కుమార్, రాము, మన్యం యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్‌లో అలవాటు గృహదొంగ అరెస్ట్



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : నగరంలో వరుసగా గృహదొంగతనాలకు పాల్పడుతున్న అలవాటు దొంగను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు వాల్లెపు వెంకటేష్ అలియాస్ వెంకట్ (25)ను మయూరినగర్ ప్రాంతంలో పట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, వెంకట్ తన ఆక్టివా బైక్‌పై సంచరిస్తూ అపార్ట్‌మెంట్లు, తలుపులు సరిగా లాక్ చేయని ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేసేవాడు. ఇంటి సభ్యులు బయటకు వెళ్లిన సమయాన్ని గమనించి లోపలికి చొరబడి బంగారం, వెండి, నగదు అపహరించేవాడు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.3.5 లక్షల విలువైన 4 గ్రాముల బంగారు ఆభరణాలు, 600 గ్రాముల వెండి వస్తువులు, ఒక ఆక్టివా మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో వెంకట్ తన నేరాలను ఒప్పుకున్నట్లు తెలిపారు. అతను హ్యాబిచ్యువల్ ఆఫెండర్‌గా గుర్తించబడగా, ఇప్పటికే 45 ఆస్తి సంబంధిత కేసుల్లో జైలు శిక్ష అనుభవించినట్లు వెల్లడైంది. మాధాపూర్, మియాపూర్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, బాచుపల్లి, చందానగర్, ఆర్‌సీ పురం తదితర ప్రాంతాల్లో అతనిపై కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే ఈ ఏడాది మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదు కాగా, తాజాగా అతడిని అరెస్ట్ చేయడం గమనార్హం. మియాపూర్ పోలీసుల వేగవంతమైన చర్యలను కూకట్‌పల్లి జోన్ అధికారులు అభినందించారు. ఈ ఘటనతో స్థానిక అపార్ట్‌మెంట్ నివాసుల్లో భద్రతపై నమ్మకం పెరిగింది. ఇళ్లలో విలువైన వస్తువులను సురక్షితంగా భద్రపరచాలని, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసు

### కెసిఆర్, కెటిఆర్,హరీష్ రావులపై కేసు కొట్టివేత

హైదరాబాద్,ఏప్రిల్24 : హైదరాబాద్‌లో 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసుకు సంబంధించి తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అప్పటి టీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన క్రిమినల్ కేసులను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో వారికి న్యాయపరంగా పెద్ద ఊరట లభించింది. 2011 మార్చిలో హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద మిలీనియం మార్చ్ పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఈ నిరసన కార్యక్రమం సమయంలో కొన్ని మీడియా వాహనాలు, కెమెరాలు, ఓబీ వ్యాన్లు ధ్వంసం అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు సమయంలో ఆ ఉద్యమంలో పాల్గొన్న నేతలపై కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసు రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారి తీసింది. అయితే, వీరు ప్రత్యక్షంగా ఘటనల్లో పాల్గొన్నారని చెప్పేందుకు తగిన ఆధారాలు లేవని వారి తరఫు న్యాయవాదులు వాదించారు. పిటిషనర్లకు ఈ ఘటనలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారు ఆందోళనకు నాయకత్వం వహించినా, ఆస్తి నష్టం జరిగిన ఘటనలకు ప్రత్యక్ష బాధ్యత లేదని న్యాయస్థానానికి తెలిపారు. దీర్ఘకాల విచారణ అనంతరం, ఆయా ఆధారాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. తాజా తీర్పులో, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో వారికి ఎలాంటి క్రిమినల్ బాధ్యత లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో వారికి చట్టపరంగా పెద్ద ఊరట లభించింది.

# వివేకానంద నగర్‌లో రూ.1.16 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని ఈనాడు కాలనీ, రిక్షా పుల్లర్స్ (ఆర్‌పి) కాలనీ, పాపిరెడ్డి నగర్, మెడికల్ సొసైటీ కాలనీలలో రూ.1 కోటి 16 లక్షల 16 వేల అంచనావ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజి నిర్మాణం, మంచి నీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని, జలమండలి అధికారులు, మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాలనీల ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిగణలోకి తీసుకుని ప్రత్యేక చొరవతో ఈ పనులను ప్రారంభించడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా నిత్యం మురుగు నీరు పొంగి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. ఏ చిన్న సమస్య అయిన తమ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఈనాడు కాలనీ, రిక్షా పుల్లర్స్ కాలనీ, పాపిరెడ్డి నగర్, మెడికల్ సొసైటీ కాలనీలలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న డ్రైనేజి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే లక్ష్యంగా ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు. అదే విధంగా ప్రతి కాలనీలో స్వచ్ఛమైన మంచి నీరు అందించేందుకు పైప్‌లైన్ నిర్మాణాన్ని కూడా అమలు చేస్తున్నామని వెల్లడించారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, ఎక్కడా రాజీ పడకుండా వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు అందిస్తూ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ రెడ్డి, జనరల్ మేనేజర్ హరిశంకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరాజు, మేనేజర్ అనిల్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## యువత, పోలీసుల మధ్య కాఫీ విత్ ఏ కాప్ కార్యక్రమం విశ్వాసాన్ని పెంపొందిస్తుంది

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : యువత, పోలీసుల మధ్య కాఫీ విత్ ఏ కాప్ కార్యక్రమం విశ్వాసాన్ని పెంపొందిస్తూ, భద్రతపై సామూహిక బాధ్యతను పెంచే వేదికగా నిలుస్తోందని శుక్రవారం సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్సీ) ఆధ్వర్యంలో "కాఫీ విత్ ఏ కాప్" కార్యక్రమం ప్రారంభమైంది. యువతతో సంభాషణ, అనుసంధానం, సహకారం అనే ప్రధాన లక్ష్యంతో రూపొందించిన ఈ కార్యక్రమం మొదటి సమావేశం ఎంతో ఉత్సాహంగా జరిగింది. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, కార్పొరేట్ ఉద్యోగులు ఇందులో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా డీజీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ డైరెక్టర్ శిఖా గోయల్ హాజరయ్యారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్-2 డీసీపీ శేషాద్రినీ రెడ్డి, ఎస్‌సీఎస్సీ సీఈఓ నవీద్ ఖాన్ తదితర అధికారులు, కార్పొరేట్ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతి నెలా నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా యువతతో పోలీసుల మధ్య నేరుగా సంభాషణకు వేదిక కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టార్టప్ వ్యవస్థాపకులు, విద్యార్థులు, యువ ఉద్యోగులు చురుకుగా పాల్గొని రోడ్డు భద్రత, సైబర్ భద్రత, ఆన్‌లైన్ ప్రవర్తనపై ప్రశ్నలు అడిగారు. మహిళల భద్రతపై మాట్లాడిన శిఖా గోయల్, ఆన్‌లైన్‌లో అపరిచితులతో మాట్లాడడం, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయడం, తెలియని వ్యక్తులకు డబ్బులు పంపడం వంటి చర్యలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఏపీకే ఫైల్ మోసాలు, పెట్టుబడి మోసాలు పెరుగుతున్నాయని, చదువుకున్న వారు కూడా వాటికి బలవుతున్నారని ఆమె హెచ్చరించారు. డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ సైబరాబాద్ పరిధిలో జరుగుతున్న మౌలిక వసతుల పనులు మరో రెండు సంవత్సరాల్లో పూర్తవుతాయని, దీంతో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కూడా తమ సందేహాలను వ్యక్తం చేశారు. విద్యార్థి అద్వైత్ ప్రజా భద్రత, యువత పాత్రపై ప్రశ్నలు అడగగా, సంస్కృతి అనే విద్యార్థిని స్టార్టప్‌లకు సైబర్ రక్షణ ఎలా కల్పించుకోవాలో తెలుసుకోవాలని కోరింది. ఐషా అనే విద్యార్థిని మహిళలు ధైర్యంగా ఎదగడానికి సూచనలు అడిగింది. ఈ ప్రశ్నలకు అధికారులు ప్రాయోగిక సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ భద్రత పరికరాలు, రోడ్డు సూచనలు, సైబర్ క్రైమ్ అవగాహన, మానవ అక్రమ రవాణా నిరోధం వంటి అంశాలపై ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీస్, షీ టీమ్స్, భరోసా సెంటర్, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, సైబర్ క్రైమ్ విభాగం తదితర విభాగాలు ప్రజలకు అవగాహన కల్పించాయి.



# సంపాదకీయం

## ప్రజాప్రతినిధులకు జీతాలు ఎందుకు ?

ఉద్యోగుల బకాయిలు ఆరువేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని కేబినేట్ భేటీలో చర్చకు వచ్చింది. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో, ఇప్పుడు రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇవి అలాగే ఉండిపోయాయి. ఇంకా పెరిగి పోతున్నాయి. అయినా చీమకుట్టినట్లుగా లేదు. ఉచిత పథకాలకు, దుబారా ఖర్చులుకు వెనకాడని ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యలే జీతాల్లో 50శాత ఇప్పుడు వీరికి చెల్లిస్తామని, వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగాచెల్లిస్తామని మంత్రులు చెప్పు కొచ్చారు. అసలు మంత్రులు, ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు? లక్షల్లో వారికి ఎందుకు చెల్లించాలి. ఎందుకు వారికి పెన్షన్లు చెల్లించాలన్నది ఆలోచించాలి. మందు వారి జీతాలను మొత్తంగానే ఆపేయాలి. పెన్షన్లను రద్దు చేయాలి. ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు ఎందుకు? పేరున్న, డబ్బున్న వారు కూడా ఇప్పటికీ పెన్షన్లు పొందుతుననారు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. దీనికితోడు ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది.అధికారంలో ఉండగా తెలంగాణను అప్పుల్లో ముంచిన బిఆర్ఎస్ ఇప్పుడు విపక్షంలో ఉంటూ..మరిన్ని ఉచితపథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. తులం బంగారం ఇచ్చారా.. రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీస్తున్నారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. నిజానికి గురుకులాలను లేదా హాస్టళ్లను ఒక్క గొడుగు కిందకు తీసుకుని రావాల్సి ఉంది. విద్య, వైద్యాలకు ఖర్చు చేయకుండా ఉచిత పథకాలకు చేస్తున్న ఖర్చులను వెంటనే ఆపకపోతే జీతాలు ఇవ్వలేరని తేలుతుంది. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఆర్టీసీ సమ్మెకు డబ్బులే కారణం. డబ్బులు ఇవ్వలేక, వారికి చెల్లింపులు చేయలేక,మహాలక్ష్మి పథకంతో దివాళా తీయిస్తూ, ఇవాళ ఆర్టీసీ సమ్మెలో ఓ కార్మికుడిని బలి తీసుకున్నారు. శంకర్ గౌడ్ మృతి నిజానికి తీవ్ర విషాదం. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇలాగే ఆత్మహత్య ల కు కాంగ్రెస్ కారణమయ్యింది. ముందుగా ఆర్టీసీ సమస్యను తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో బటన్ నొక్కుడు పథకాలతో దివాళా తీయించారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంపముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్దతి ఏ ప్రభుత్వానికీ మంచింది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిందని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించచుకోలేం. విద్య, వైద్యం అందించలేం. ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకరర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డంకిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. జీతాల చెల్లింపు లాంటి రోజువారీ కార్యక్రమాలను ఆపరాదు. అందుకోసం ముందుగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపిల జీతభత్యాలను నిలిపివేసే పథకంతో ప్రారంభిస్తే మంచిది.

# ఫ్యాక్టరీల్లో భగ్గుమంటున్న 'భద్రత'





దేశంలోని అనేక కర్మాగారాల్లో పనికి వెళ్లడం అనేది ఒక యుద్ధానికి వెళ్లినట్టుగా, తమ ప్రాణాలను పణంగా పెట్టి వెళ్లినట్టుగా అనిపిస్తోంది. ఈ పరిస్థితి ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. తయారీ రంగం వృద్ధి చెందుతున్నప్పటికీ, కార్మికుల భద్రత, పని పరిస్థితులు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. అసంఘటిత రంగంలో 90 శాతం పైగా కార్మికులు భద్రతా పరిధిలో లేరని నివేదికలు చెబుతున్నాయి. చాలా మంది కార్మికులు రోజుకు 12 నుంచి 14 గంటలపాటు పనిచేయవలసి వస్తోంది. 70 గంటల పనివారం వంటి ప్రతిపాదనలు ఈ ఒత్తిడిని మరింత పెంచుతున్నాయి. అంచనాల ప్రకారం దేశంలో రోజుకు సుమారు ముగ్గురు ఫ్యాక్టరీ కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. మరో 11మంది తీవ్రగాయాల పాలవుతున్నారు. గత వారంలో మూడు ఫ్యాక్టరీల్లో పేలుళ్లు సంభవించి 60 మంది కన్నా ఎక్కువ మంది చనిపోయారు. ఇటువంటి వార్తలు ఏ సున్నితమైన దేశాన్నయినా, ఆత్మపరిశీలన చేసుకుని తప్పులు సరిదిద్దుకునేలా హెచ్చరిస్తాయి. 1976 జులై 10న సెలెసో సమీపంలోని ఐసిఎంఇఎస్ఎ ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు వల్ల ప్రజలు అత్యంత విషపూరిత డయాక్సిన్‌కు గురయ్యారు. ఈ విపత్తు తర్వాత పారిశ్రామిక ప్రమాదాలను అరికట్టేందుకు పర్యావరణ పరిరక్షణకు కఠినమైన నిబంధనలతో 'సెవెసో డైరెక్టర్'ను 1982లో యూరప్ దేశాల యూనియన్ అమలులోకి తెచ్చింది. ఈ సంఘటన పారిశ్రామిక భద్రతలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలికింది. 2019 2022 మధ్యకాలంలో యూరప్ యూనియన్ దేశాల్లో ఏడాదికి 22 వంతున పారిశ్రామిక ప్రమాదాలు జరిగాయి. కొరియాలో లిథియం బ్యాటరీ మేకర్ ఎయిర్‌సెల్ ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి 23మంది కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. విజయవంత మవుతున్న తెలంగాణ విజన్ ఈ ప్రమాదానికి బాధ్యుడ్ని చేస్తూ ఆ సంస్థ సిఇఒకు నిన్న నాలుగేళ్ల జైలు శిక్ష విధించిన సంఘటన గమనార్హం. కానీ మనదేశంలో ఫ్యాక్టరీ ప్రమాదాల గురించి ఎవరూ అంతగా పట్టించుకోవడం లేదు. ఒకవిధంగా ఈ ప్రమాదాలు సర్వసాధారణమే అన్నట్టు మనం మొద్దుబారిపోయాం. గతవారం వేదాంత బాయిలర్ పేలుడు, ఈ వారం తమిళనాడు, కేరళ బాణాసంచా ఫ్యాక్టరీల్లో పేలుళ్లు జరిగాయి. అయితే అవి బస్సుల దహనాలు, రోడ్డు ప్రమాదాల కన్నా ఎక్కువేం కాదు. బస్సుల ప్రమాదాలు ఏడాదికి వందలాది మందిని బలిగొంటుండగా, రోడ్డు ప్రమాదాలు ఏటా లక్షాఎనభై వేలమంది ప్రాణాలు తీస్తున్నాయి. తమిళనాడు లోని ఓ బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 17మంది మృతి చెందారు. ఈ ప్రమాదం గురించి మరువక ముందే కేరళ లోని త్రిసూర్ జిల్లాలో ఓ బాణాసంచా ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంభవించి 13 మంది కార్మికులు అక్కడికక్కడే మంటల్లో బూడిదయ్యారు. దేశ రాజధాని ఢిల్లీ కూడా కొన్ని పరిశ్రమల ప్రమాదాలకు ప్రత్యక్షసాక్షిగా నిలబడుతోంది. 2019లో ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంభవించి 43 మంది స్లీపింగ్ వర్కర్లను పొట్టనపెట్టుకుంది. అందుకనే ఫ్యాక్టరీల్లో ఫైర్ ఎగ్జిట్స్ ఉండడం లేదు. ఎలక్ట్రికల్ సిస్టమ్స్ ఓవర్‌లోడ్ అవుతుంటాయి. బాయిలర్ల నిర్వహణ చాలా అధ్వానం. ఇవన్నీ మనకు నిత్యం ప్రత్యక్ష సాక్షాలే. భద్రతా ప్రమాణాలు పాటించకుండా ప్రమాదకరమైన రసాయనాలను నిల్వ చేస్తుంటారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటన తీవ్ర పరిణామాలు మనకు తెలిసిందే. 1984 డిసెంబర్ 23 తేదీల్లో భోపాల్ లోని యూనియన్ కార్బయిడ్ పురుగు మందుల కర్మాగారం నుండి మిథైల్ ఐసోసైనెట్ అనే విషవాయువు లీకై వేలాది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. కంటిచూపు కోల్పోవడం, ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో దాదాపు 5 లక్షల మంది బాధితులయ్యారు. ఇది ప్రపంచం లోనే అత్యంత ఘోరమైన పారిశ్రామిక విపత్తుగా పరిగణించబడుతోంది. 2020 లో ప్రతి 973 ఫ్యాక్టరీలకు ఒకే ఒక ఇన్‌స్పెక్టర్ ఉండేవారంటే ఫ్యాక్టరీల తనిఖీ ఎలా జరుగుతుందో దీన్ని బట్టి తెలుస్తుంది. దేశ రాజధాని ఆటో అనుబంధ పరిశ్రమల ప్రమాదాలకు పేరు పొందింది. యుద్ధ చర్యలు కావాలి ఈ పరిశ్రమల్లో వర్కర్లకు ఎప్పుడు కాళ్లు, చేతులు తెగిపోవడం, గాయాలవ్వడం పరిపాటి. అయినా ఈ వివరాలేవీ రికార్డుకెక్కవు. తనిఖీలు జరిగేటప్పుడు ఈ చిన్నపాటి ప్రమాదాలు తక్కువగానే జరిగినట్టు రికార్డులు చూపిస్తుంటారు. 2012 నుంచి 2020 వరకు తనిఖీల్లో చాలా తక్కువ సంఖ్యలో ప్రమాదాలు జరిగినట్టు ఆయా యాజమాన్యాలు అధికారులకు రికార్డులు చూపించడం గమనార్హం. ప్రమాదాల వివరాలను దాచిపెట్టడం లేదా బయటపెట్టడానికి ఒప్పుకోకపోవడం చేసినంత కాలం ఫ్యాక్టరీల్లో కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించదు. 2017లో ఒక అధ్యయనం ప్రకారం దేశంలో వృత్తిప రమైన ప్రమాదాలు ఏటా 48,000 వరకు జరుగుతున్నాయని తేలింది. ప్రభుత్వం మాత్రం ఈ సంఖ్య కేవలం 1109 మాత్రమే అని చూపించింది. ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికుల్లో 90 శాతం మంది అసంఘటిత కార్మికులే ఉన్నారని చెప్పవచ్చు. పని పరిస్థితుల సంగతి ఇక చెప్పలేం. అధికారిక రంగ కార్మికుల విషయంలో కూడా చాలా ప్రమాదాలను పరిశ్రమల యాజమాన్యాలు సరిగ్గా నమోదు చేయడం లేదు సరికదా ఏదైనా ప్రమాదం జరిగితే పోలీసులు, ఆస్పత్రి వర్గాలు రాజీధోరణి అవలంబించడమే ప్రధాన లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంఘటనలు ఉన్నాయి. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఒ) కార్మికుల పాలిట మనదేశం ప్రమాదకరమైన దేశమని ముద్ర వేసింది. ఇకనైనా ఈ అపకీర్తి తుడిచిపెట్టడానికి ఏదో ఒకటి చేయాల్సి ఉంది.

## అత్యాచారం, హత్యాచారం కేసు

### రాహుల్ మీనాకు నాలుగు రోజుల పోలీస్ కస్టడీ

న్యూఢిల్లీ : రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల్లో అత్యాచారం, హత్యాచారం కేసుల్లో అరెస్టు చేసిన నిందితుడు రాహుల్ మీనాకు నాలుగు రోజుల పాటు పోలీస్ కస్టడీ విధించింది న్యాయస్థానం. ఇద్దరిపై అత్యాచారం చేసి అందులో ఒకరిని హత్య చేసిన కేసుల్లో అతన్ని పోలీసులు గురువారం నాడు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అతని స్టేట్మెంట్‌ను రికార్డు చేశారు. ఆ సమయంలో పోలీసులకు చుక్కలు చూపించాడు నిందితుడు రాహుల్. విచారణ సమయంలో నిందితుడు తన స్టేట్మెంట్‌ను పలుమార్లు మార్చి చెప్పినట్లు కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు. అనంతరం నాలుగు రోజుల కస్టడీ కోరుతూ ఢిల్లీ పోలీసులు నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ సందర్భంగా 'నా వల్ల నేరం జరిగింది.. తప్పు జరిగిపోయింది' అంటూ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దీపికా థాకరన్ ఎదుట రాహుల్ మీనా నేరం ఒప్పుకున్నాడు. విచారణ అనంతరం నిందితుడిని నాలుగు రోజుల పాటు పోలీస్ కస్టడీకి న్యాయస్థానం అప్పగించింది. రాజస్థాన్‌లోని అల్వార్‌లో మంగళవారం రాత్రి తన స్నేహితుడి భార్యపై నిందితుడు రాహుల్ మీనా అత్యాచారం చేశాడు. ఆమె భర్త ఇంట్లో లేని సమయంలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఓ వ్యాన్‌ను రూ.6 వేల కిరాయికి మాట్లాడు కుని ఢిల్లీకి బయలుదేరాడు. అక్కడికి చేరిన తర్వాత నగదు చెల్లించకుండానే పారిపోయాడు. గతంలో కైలాష్ హిల్స్ ప్రాంతంలో తాను పని చేసిన ఇంటి వద్దకు చేరుకున్నాడు. యజమాని, అతని భార్య జిమ్‌కి వెళ్లడంతో ఉదయం 6:30 గంటలకు ఇంట్లోకి ప్రవేశించాడు. ఒంటరిగా ఉన్న యజమాని కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మొబైల్ ఛార్జర్ వైర్‌తో ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం విలువైన వస్తువులు దోచుకుని పరారయ్యాడు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గతంలో అక్కడ పని చేసిన సమయంలో నగదు విషయంలో అవకతవకలకు పాల్పడడంతో అతన్ని పని నుంచి తీసేశారు యజమాని. దాన్ని మనసులో పెట్టుకుని ఈ దారుణానికి ఒడికట్టాడు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరిపై అత్యాచారం చేసి అందులో ఒకరిని హత్య చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసుల కస్టడీలో నిందితుడు ఇంకా ఎలాంటి విషయాలు వెల్లడిస్తాడో వేచి చూడాల్సిందే.

## కేదార్‌నాథ్‌కు భారీగా తరలివస్తున్న భక్తులు

డెహ్రాడూన్,ఏప్రిల్24 : చార్‌ధామ్ యాత్రలో భాగంగా కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. గఢ్‌వాల్ హిమాలయాల పర్వత శ్రేణిలోని ఈ ఆలయానికి తొలి రోజే భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. ఒకానొక దశలో భక్తులను కట్టడి చేయడం ఆలయ సిబ్బందికి కష్టతరంగా మారింది. మరో వైపు స్వామి వారి దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఈ సందర్భంగా భక్తులు నిబంధనలు అతిక్రమిస్తూ.. ఒక క్యూ లైన్ నుంచి మరో క్యూ లైన్‌లోకి చొరబడుతున్నారు. దాంతో వారి మధ్య ఘర్షణ, వాగ్వివాదం చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు.

## ఆకర్శణలేని ట్రంప్ గోల్డ్ కార్డు పథకం

### నాలుగు నెలల్లో ఒక్కటి మాత్రమే జారీ

### అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హాళవార్డ్ లుట్నిక్


వాషింగ్టన్,ఏప్రిల్24(ఆర్ఎన్ఎ): అమెరికాలో శాశ్వత నివాసం కోరుకునే విదేశీయుల కోసం గతేడాది డిసెంబర్‌లో ట్రంప్ ప్రభుత్వం గోల్డ్ కార్డు స్కీమ్‌ను ప్రారంభించింది. కొత్త స్కీమ్ అమల్లోకి వచ్చి నాలుగు నెలలు కావొస్తున్నా ఇప్పటివరకూ కేవలం ఒక్కరికే గోల్డ్ కార్డు దక్కింది. ఈ విషయాన్ని అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హాళవార్డ్ లుట్నిక్ పేర్కొన్నారు. అమెరికా కాంగ్రెస్ (చట్టసభలు) కమిటీకి ఈ వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. గోల్డ్ కార్డు కావాలనుకునే విదేశీయులు 1 మిలియన్ డాలర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజు అదనం. అయితే, ఈ స్కీమ్‌కు డిమాండ్ అద్భుతంగా ఉందని మొదట్లో లుట్నిక్ చెప్పుకొచ్చారు. ఏకంగా 1.3 బిలియన్ డాలర్ల విలువైన వాటిని జారీ చేశామని అప్పట్లో అన్నారు. ఇందుకు భిన్నంగా ఆయన కేవలం ఒక్క గోల్డ్ కార్డును మాత్రమే జారీ చేశామని తాజాగా పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. వీసా కోసం జనాలు క్యూకట్టారని కూడా లుట్నిక్ అన్నారు. అధికారులు ఈ మధ్యనే పూర్తి స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేశారని, ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని కూడా చెప్పారు. ట్రంప్ ప్రభుత్వం ఈ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఎంపికైన వారికి కేవలం ఐదేళ్లల్లోనే పౌరసత్వానికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లభిస్తుంది.

## ఆస్పత్రిలో మృతదేహంపై ఆభరాణలు చోరీ

జగిత్యాల,ఏప్రిల్24 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ క్రిటికల్ కేర్ విభాగంలో దారుణం చోటుచేసుకుంది. గురువారం తెల్లవారు జామున అనారోగ్యంతో ఏల్పుల బాలవ్వ(80) అనే వృద్ధురాలు మృతిచెందగా ఆమె చెవులకు ఉన్న ఆభరణాలు మాయమయ్యాయి. కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన ఏల్పుల బాలవ్వ అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం అర్ధరాత్రి చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బాలవ్వ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది.

## ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వాలంతం

యాదాద్రి : విష్ణుమూర్తి యొక్క దశావతారాలలోని 4వ అవతారమే నరసింహస్వామి అవతారం. నృసింహ జయంతి వైశాఖ శుక్ల చతుర్ధతి నాడు జరుపుకొంటారు. నరసింహస్వామి రూపంలో దేహం మానవ రూపం, తల సింహం రూపంలో అవతరించిన దేవుడు.నృసింహస్వామి మాహా శక్తి వంతమైన అవతారంగా చూడాలి. ఇదే రోజున విష్ణుమూర్తి హిరణ్యకశిపుడిని సంహరించి, ధర్మాన్ని నిలబెట్టాడు కాబట్టి నృసింహ జయంతిని వేడుకగా జరుపుకొంటారు. నృసింహ జయంతి వృత్తాంతం ప్రకారం ప్రహ్లాదుడి కోసం ఆయనజన్మించారు. హిందూ పురాణాల ప్రకారం త్రిమూర్తులలో విష్ణువు లోకపాలకుడు. సాధు పరిరక్షణ కొరకు, దుష్టశిక్షణ కొరకు ఆయన ఎన్నో అవతారాలలో యుగయుగాన అవతరిస్తాడు. అలాంటి అవతారాలలో 21 ముఖ్య అవతారాలను ఏకవింశతి అవతారములు అంటారు. వానిలో అతి ముఖ్యమైన 10 అవతారాలను దశావతారాలు అంటారు. ఈ దశావతారాలలో నాలుగవ అవతారము నారసింహావతారము. మహాలక్ష్మిని సంబోధించే 'శ్రీ' పదాన్ని చేర్చి శ్రీనారసింహుడని ఈ అవతార మూర్తిని స్మరిస్తారు. హిరణ్యకశ్యపుడిని అంతమొందించి, ప్రహ్లాదుడినికాపాడే లక్ష్యంతో ఈ అవతారం ఏర్పడింది.



ఆధ్యాత్మికం

# బచ్చల ఎర్రన్నకు కొమురంభీం పోరాటమే స్ఫూర్తి...

● పోడుభూములకు పట్టాలు ఎర్రన్న పోరాట ఫలితమే ● మహనీయుల మార్గం తెలువకుండా చేసిన పాలకులు ● రాజ్యాంగంలోని హక్కులు తెలిసి ఉంటే అభివృద్ధి చెందేవాళ్లం ● బచ్చల ఎర్రన్న కుటుంబానికి అండగా నిలుస్తా ● మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**రామగిరి, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):-** జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఆనాడు అట్టడుగు వర్గాల కోసం పోరాటం చేసిన కొమురంభీం పోరాట స్ఫూర్తితోనే బచ్చల ఎర్రన్న ముందుకుసాగారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మహాముత్తారం మండలం మాదారం గ్రామంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు బచ్చల ఎర్రయ్య కుటుంబాన్ని భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి తో కలిసి ఆయన పరామర్శించి ఎర్రన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బచ్చల ఎర్రన్న 2008నుంచి గిరిజన నాయకుడిగా తనకు పరిచయం ఏర్పడిందని, ఆనాడు ఎర్రన్నతో పాటు పలువురు గిరిజన నేతలతో కలిసి కొమురంభీం విగ్రహం పెట్టడానికి ప్రయత్నం చేస్తే ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆయన గుర్తు చేశారు. కొమురంభీం పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ సాధించుకున్నామని, ఆయన పేరు లేకుండా తెలంగాణ లేదన్నారు. బచ్చల ఎర్రన్న లాంటి వాళ్లు అనేక మంది గిరిజనుల పోరాటంతో పోడు భూముల పట్టాలు సాధించుకున్నామని, ఈ పోడుభూములకు రైతుబంధు కూడా వచ్చినట్లు రైతులు చెప్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరకుంటున్నరంటే ఎర్రన్నలాంటి నాయకులే కారణంమన్నారు. అయితే 55ఏండ్లుగా నాయకులు, ప్రజల మధ్యలో ఉండి ఒక ఇల్లు లేకుండా ఉండటం ఆయన నీతికి నిజాయితీకి నిదర్శనమన్నారు. ఆనాడే మన పెద్దలకు మహనీయులు అర్థం అయి ఉండి రాజ్యాంగం తెలిసి ఉంటే ఈనాడు అకలితో ఉండేవాళ్లం కాదన్నారు. మన కోసం గొప్పగా మార్గం చూపినా ఆ మార్గం మనకు తెలువకుండా అడ్డుకుని ఇక్కడి నాయకులను మనకు దేవుళ్లుగా చూపించిండ్లు కనుకనే ఇవ్వాల్టికి ఎర్రన్నకు ఇల్లు లేదన్నారు. అంబేద్కర్ అర్థమై రాజ్యాంగంలోని హక్కులు తెలిసి ఉండే అభివృద్ధి చెందేవాళ్లమని, ఇలాంటి పరిస్థితులు తెలిసి తాను మహనీయుల గురించి రాజ్యాంగం గురించి చెప్తున్నట్లు వివరించారు. 78సంవత్సరాల స్వాతంత్ర్యం గొప్పగా జరుపుకుకోవాలని ప్రభుత్వాలు పిలుపునిస్తుంటే ఎందుకోసం జరుపుకోవాలన్నది అర్థమై తన గుండెలు కలిచివేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రన్న చేసిన పోరాటం భావితరాలకు ఉండద్దనే విషయం గుర్తించి మనమందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎర్రన్న నీతికి నిజాయితీకి మారుపేరుగా నిలిచేవారని, ఏదైనా తప్పు విషయం ఉండి ఆయనకు నచ్చకపోతే దాటవేసేవారని చెప్తున్నారని ఆయన గుర్తు చేశారు. న్యాయం ధర్మం వైపు నిలబడ్డ ఎర్రన్న కుటుంబం ఇవ్వాల కష్టాల్లో ఉండవచ్చు కానీ నీతినిజాయితీగా ఉన్నవాళ్లను మనం గుర్తించకపోతే సమాజంలో ఉండి వృధా అని అన్నారు. ఆనాడు ఎర్రన్న అనారోగ్యంతో ఉన్నప్పుడు చెప్పుకోలేక పోయాడని, ఈ క్రమంలోనే ఆయనను కాపాడు కోలేకపోయా మన్నారు. ఆరోగ్యం బాగాలేదని తనకు చెప్తే హస్పటల్‌కు వెల్లమని చెప్పానని, కానీ వెళ్లలేదని చివరినిమిషంలో నాయకులు ఒత్తిడి తీసుకు వచ్చారని, ఆనాడు ఎర్రన్నను కలిసి ఆస్పత్రికి తీసుకెళ్లా కానీ పరిస్థితి చేదాటిపోయిందని వైద్యులు చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. ముందే తనను ఒత్తిడి చేసి ఉంటే ఎర్రన్నను బతికించుకునేవాళ్లం కావచ్చునని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికి ఆపద వచ్చిన పక్కవాళ్లు సాయం చేసుకోవాలని, డబ్బు అధికారం ఎప్పుడు శాశ్వతం కాదనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ఎర్రన్న కుటుంబానికి తాను అండగా నిలుస్తానని, వారికి ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. జాతి కోసం పోరాడేవాడే గొప్ప నాయకుడు...జక్కు శ్రీహర్షిణీ రాకేష్, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ భూపాలపల్లి తన జాతి బాగు కోసం పోరాడేవాడే గొప్ప నాయకుడని, అలాంటి కోవకు చెందిన నాయకుడే బచ్చల ఎర్రన్న అని భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్ అన్నారు. ఎర్రన్న సంతాప సభలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌తో కలిసి పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం, పోడు భూములకు పట్టాల కోసం ఎర్రన్న చేసిన పోరాటం మరువలేనిదన్నారు. మహదేవ్‌పూర్ మండల కేంద్రానికి ఐటీడీఏ ఆఫీస్ రావాలన్నదే ఎర్రన్న ఆశయమని, ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎర్రన్న ఆశయం తీర్చేలా పని చేస్తామన్నారు. ఆనాడు ఆరోగ్యంబాగాలేదని తెలిసిన వెంటనే మదన్న వెంట తాను వచ్చానని, తనకు బ్రతకాలని ఉందని ఎర్రన్న కన్నీరు పెట్టుకున్నాడని ఆమె గుర్తు చేశారు. సొంత కుటుంబసభ్యుడిలా మధన్న ఎర్రన్నను హుటాహుటీగా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించి బ్రతికించుకునే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు, ఎర్రన్న లేని లోటు ఆ కుటుంబానికి తీర్చలేకపోయినా ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని ఆమె భరోసా ఇచ్చారు.

# భవిష్యత్తులో గట్టు పంచాయతీలు భూ వివాదాలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారమే ఈ భూ రీ సర్వే

## ● అదనపు కలెక్టర్ శ్రీమతి బి.ఎస్. లత



**ధర్మపురి, ఎప్రిల్ 24, (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలోని రైతులకు భవిష్యత్తులో గట్టు పంచాయతీలు భూ వివాదాలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారశే లభించెందుకే ఈ భూ సర్వే కార్యక్రమం అని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం లోని గాదే పల్లిలో భూముల భూ రీ-సర్వే ప్రక్రియ ప్రారంభం గ్రామ సభలో అదనపు కలెక్టర్ శ్రీమతి బి.ఎస్. లత పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ధర్మపురి మండలం గాదేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో భూముల రీ-సర్వే ప్రక్రియను శుక్రవారం అధికారికంగా ప్రారంభిశీచినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో రైతులను ఉద్దేశించి భూమి రీ-సర్వే ఆవశ్యకతను మరియు దాని ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో భూ సర్వే మరియు సరిహద్దుల చట్టం, 1923 ప్రకారం అత్యాధునిక సాంకేతికతతో భూములను కొలవడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా హద్దుల స్పష్టత, ప్రతి రైతు భూమికి కచ్చితమైన సరిహద్దులు నిర్ణయించడం ద్వారా భవిష్యత్తులో గట్టు పంచాయతీలు, భూ వివాదాలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. రికార్డుల ఆధునికీకరణ నాన్-కాడస్ట్రల్ (గతంలో సర్వే జరగని) భూములను కూడా రికార్డుల్లోకి తీసుకువచ్చి, డిజిటలైజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. సర్వే బృందం పొలాల వద్దకు వచ్చినప్పుడు రైతులు తమ పాత పాస్ పుస్తకాలు, ఇతర ఆధారాలతో అందుబాటులో ఉండి సహకరించాలని ఆమె రైతు లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుల సంగన్పట్ల దినేష్, జగిత్యాల ఆర్.డి.ఓ పి. మధుసూదన్, ఏ.డి (సర్వే ల్యాండ్ రికార్డ్స్) కిషన్ ప్రసాద్, ధర్మపురి తహసీల్దార్ శ్రీనివాస్ ఎరుకొండ, ఏ.ఎం.సి ల వైస్ చైర్మన్ సంగ నర్సింహుల్, గాదేపల్లి సర్పంచ్ ఏ. సురేష్, రీ-సర్వే అధికారులు మండల డెప్యూటీ సర్వేయర్ ఎన్. రమ్య మరియు మండల గిర్దావర్ భాస్కర్ రావు, మెట్‌పల్లి డిప్యూటీ ఇన్-స్పెక్టర్ ఆఫ్ సర్వే పాల్గొన్నారు.

# మరణించిన పలు కుటుంబాలకు పరామర్శ

## - బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేస్తూ వారికి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా కనగర్తి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఆది కేశవరావు తల్లి మరణించగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే మడక గ్రామానికి చెందిన కోట గోపాల్ రెడ్డి తండ్రి కోట సంజీవ రెడ్డి మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. జీలకుంట గ్రామంలో బీజేపీ 176వ బూత్ అధ్యక్షుడు జున్నుతుల శ్రీకాంత్ రెడ్డి తండ్రి జున్నుతుల రవీందర్ రెడ్డి మరణించగా, అక్కడికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా కొమిరె గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు తోట్ల సతీష్ యాదవ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని, వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోమల ఆంజనేయులు, బీజేవైఎం జిల్లా నాయకులు పుల్లూరి పృథ్వీరాజ్, ఆదిసతీష్, కొలనూర్‌మాజీసర్పంచ్ వెంకటస్వామి, అనిల్ రావు, రుపిరెడ్డి ఆదిరెడ్డి, పూల సధయ్య గౌడ్, కారెంగుల నవీన్, వంగల భాస్కర్ రెడ్డి, అగ్గి శ్రీనివాస్ గౌడ్, తూడి రాజేందర్, కిషన్ రావు, శ్రీకాంత్, శ్రీదర్, ప్రశాంత్, హరీష్, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్రె సంజీవ రెడ్డి మాట్లాడుతూ, బాధలో ఉన్న కుటుంబాలకు ఎల్లప్పుడూ భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# స్వయం ఉపాధి రుణాల మంజూరుకై ఇంటర్వ్యూ



**మానకొండూర్, ఎప్రిల్ 24(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక ద్వారా మండలంలోని షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగులకు మంజూరైన స్వయం ఉపాధి యూనిట్లకు రుణాలు మంజూరు చేయుటకై సంభందిత బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎంపిడిఓ వి.వరలక్ష్మి,ఎంపిఓ సత్తీష్ రావు, పశు వైద్యాధికారులు, జిల్లా రవాణా శాఖ అధికారి,ఐకేపి ఏపిఎంలు, వ్యవసాయ అధికారులు ఇంటర్వ్యూలో పాల్గొన్నారు.

# మాచం శ్రీనివాస్ కు బిఆర్ఎస్ తో ఎసొంటి సంబంధం లేదు: ఇట్లు పాకాల మహిపాల్ రెడ్డి

**బెజ్జంకి, ఎప్రిల్24(ది క్రైం న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ కు చెందిన మాచం శ్రీనివాస్ ను బిఆర్ఎస్ నుండి సస్పెండ్ చేసినట్లు పార్టీ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలో ఉంటూనే వెన్నుపోటు చర్యల్లో భాగంగా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ పార్టీకి నష్టం కల్గిస్తున్నందున శ్రీనివాస్ ను పార్టీ నుండి సస్పెండ్ చేసినట్లు మహిపాల్ రెడ్డి తెలిపారు. నేటినుంచి బిఆర్ఎస్ తో మాచం శ్రీనివాస్ కు ఎసొంటి సంబంధం లేదని పెర్కొంటూ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ప్రకటన ద్వారా మహిపాల్ రెడ్డి హెచ్చరించారు.

# యువత గెలుపు స్ఫూర్తితో ముందుకు సాగాలి

## - బీసీ జేఏసీ జిల్లా చైర్ పర్సన్ దాసరి ఉష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** యువత వ్యసనాలకు దూరంగా ఉండి,క్రీడల ద్వారా శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని బీసీ జేఏసీ చైర్ పర్సన్ శ్రీమతి దాసరి ఉష పిలుపునిచ్చారు.గత పది రోజులుగా పెద్దపల్లి నియోజకవర్గవ్యాప్తంగా ఆమె ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్యోతిబా పూలే -అంబేద్కర్ జై యుగం.క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా,శుక్రవారం ఎలిగేడు మండల కేంద్రంలో మ్యాచ్ వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన దాసరి ఉష టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించిన అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి దాసరి ఉష మాట్లాడుతూ మహానీయులైన జ్యోతిబా పూలే,అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో యువత అట్టడుగు స్థాయి నుండి ఎదగాలనే లక్ష్యంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తితో పాలుపంచుకోవడం ముఖ్యమని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామీణ క్రీడాకారుడిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె పేర్కొన్నారు.అనంతరం జరిగిన ఉత్కంఠభరిత పోరులో శివపల్లి టీం విజేతగా నిలవగా,ఎలిగేడు టీం రన్నరప్‌గా నిలిచింది.విజేతలకు రూ.10వేల నగదు మరియు షీల్డ్‌ను,రన్నరప్‌కు రూ.5వేలు మరియు షీల్డ్‌ను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు సర్పంచ్ కప్పల వేణుగోపాల్, ఉప సర్పంచ్ ముంజం నరేష్,నర్సాపూర్ సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్,టీఆర్ఎస్ మండల అధ్యక్షులు బైరెడ్డి రాంరెడ్డి,అసెంబ్లీ కోఆర్డినేటర్లు అబ్దుల్ మాలిక్, బొల్లం భూమేష్, మొలుమూరి శేఖర్, ఆర్గనైజర్లు బి.వినోద్, ఎ.రమేష్, జి.అక్షయ్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో హోంగార్డు సేవలు మరువలేనివి

## - అదనపు డీసీపీ అడ్మిన్ కె. శ్రీనివాస్ - ఉద్యోగ విరమణ పొందుతున్న హోంగార్డ్‌కు ఆత్మీయ వీడ్కోలు




**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** పోలీస్ శాఖలో హోంగార్డు సేవలు మరువలేనివని అదనపు డీసీపీ అడ్మిన్ కె. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రామగుండం కమిషనరేట్‌లోని అదనపు డీసీపీ అడ్మిన్ కార్యాలయంలో, పోలీస్ శాఖలో గత 36 సంవత్సరాలుగా హోంగార్డ్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఎం.డి.షరీఫుద్దీన్‌కు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ అడ్మిన్ కె. శ్రీనివాస్ పూలమాల వేసి, శాలువాతో సత్కరించారు. ఎం.డి.షరీఫుద్దీన్ గత 36 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో హోంగార్డ్‌గా అందించిన సేవలను అదనపు డీసీపీ అడ్మిన్ కె. శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, హోం గార్డ్స్ ఆర్.ఐ పెద్దన్న, ఆర్.ఐ అడ్మిన్ శేఖర్, ఆర్.ఐ మల్లేశం ఎంటిఓ తదితరులు పాల్గొన్నారు.

# పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో కరీంనగర్ జిల్లా రజక సంఘ అధ్యక్షులు రాచకొండ నరేష్ పుట్టినరోజు వేడుకలు



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్24(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా రజక సంఘు అధ్యక్షులు రాచకొండ నరేష్ తన పుట్టినరోజు వేడుకలను నగరంలోని రేకుర్తి విజయపురి కాలనీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని స్వాములందరికీ 'బిక్ష' (అన్నదానం) ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా రాచకొండ నరేష్ మాట్లాడుతూ తాను ఎంతగానో కొలిచే ఆరాధ్య దైవం పంచముఖ ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో, భక్తులు, స్వాముల మధ్య తన జన్మదినాన్ని జరుపుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్వామివారి ఆశీస్సులతో జిల్లాలోని రజక సంఘం అభివృద్ధికి, ప్రజా సేవకు నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.సన్నిహితులు, భక్తులు, కుటుంబ సభ్యులు పాల్గొని నరేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ అన్నదానం నిర్వాహకులు దేవజు అనిల్ గంగిపల్లి నరేష్ , మాజీ కార్పొరేటర్ ఏదుల రాజశేఖర్ , హనుమాన్ స్వాములు ,గంగిపల్లి కనకయ్య,గోగులకొండ తిరుపతి, దేవజు ప్రభాకర్, శేఖర్,మహేష్, చింతల తాళం సతీష్, మహేందర్ 150 స్వాములు భక్తులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక అభినందించిన తుమ్మనపల్లి దంపతులు




**తిమ్మాపూర్, ఎప్రిల్ 24(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామ ముదిరాజ్ సంఘ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకోగా అధ్యక్షుడిగా రేగుల సంపత్, ఉపాధ్యక్షుడిగా గట్టు మహేందర్, కార్యదర్శిగా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.గ్రామంలోని ముదిరాజుల సమస్యలు పరిష్కారమయ్యేలా సంఘ మండల,జిల్లా నాయకులతో కలిసి పోరాడుతానని, మత్స్య సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం అందించే సహాయాన్ని ముదిరాజులకు అందేలా కృషి చేస్తానని రేగుల సంపత్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్యారావు, మాజీ వైస్ ఎంపీపీ తుమ్మనపల్లి శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

# ఎంచుకున్న రాగమేంటి.... తీసుకున్న తాళమేంటి?

- "రైతు మహోత్సవం కాదు -ఎన్నికల సభ!" ● భరోసా నిధుల పేరిట ● రాజకీయ ఆట
- రైతు మాట లేకుండా రైతు సభ... ఇదేం కొత్త రాజకీయ సంస్కృతి?

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** కాటారం వేదికగా నిర్వహించిన 'రైతు మహోత్సవం'... పేరు విన్నప్పుడే రైతన్నలకు మరోసారి ఆశలు పుట్టాయి . రుణమాఫీ, రైతు భరోసా మీద పాలకుల నోట భరోసా మాటలు వస్తాయని ఆశపడ్డారు. సభ ఉద్దేశం కూడా అదే కానీ, జరిగినది చూస్తే ఆశల బదులు ఆవేదన మాత్రమే మిగిలిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భారీ సభ ప్రధాన ఉద్దేశం రైతులకు రెండవ దఫా భరోసా నిధుల విడుదల. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో వ్యవసాయం, రైతుల సమస్యలు, భవిష్యత్ విధానాలు, మద్దతు ధరలు, ఆధునిక పద్ధతులు, పనిముట్లు, టెక్నాలజీ వినియోగం, రైతు ఆదాయం పెంచే మార్గాల వంటి అంశాలు చర్చకు రావాలి. కానీ ఈ సభలో ఆ అంశాలను గాలికొదిలేసి... రాజకీయ విమర్శలే ప్రధానాంశంగా మారాయని అక్కడికి వెళ్లిన ప్రజలు చెబుతున్నారు. రైతుల సమస్యలు కనిపించలేదు- వ్యవసాయ విధానాలు వినిపించలేదు- భవిష్యత్తు ప్రణాళిక చెప్పలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం మొత్తం పరిశీలిస్తే... రైతుల సంక్షేమం కంటే ప్రత్యర్థులపై విమర్శలకే ఎక్కువ, కాదు కాదు మొత్తం ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపించిందని విశ్లేషకులు అంటున్నారు. రైతు సమస్యలు, పంటల ఉత్పత్తి పెంపు, నూతన విధానాలు, సబ్సిడీలు, యంత్రపరికరాల ప్రోత్సాహం వంటి కీలక అంశాలు రైతు మహోత్సవంలో ప్రస్తావనకే రాకపోవడం రైతు లోకానికి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇంతకూ సభ లక్ష్యం ఏమిటి? రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసినసభలో.. రైతు సమస్యలు వినిపించలేదు వ్యవసాయ విధానాలపై చర్చ లేదు, సూచన లేదు, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత లేదు అయితేరాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు, పార్టీ మారిన నాయకులపై మాటల (బూతుల) దాడులుఎన్నికల తరహా మాటలు ఇవి మాత్రమే హైలైట్ కావడం గమనార్హం. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు ఉన్నాయన్న తరహాలో సభ సాగింది అంటున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్వహించిన సభలో ప్రజలకు ఒరిగిన స్పష్టమైన లాభం ఏమిటన్న ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. "మేము ఎందుకు వచ్చామో మాకే అర్థం కాలేదు" అని గ్రామాల నుండి వెళ్లిన ప్రజలే చెప్పడం పరిస్థితి తీవ్రతను చూపుతోంది. ఎన్నికల వాతావరణం ఇంకా కొనసాగుతోందా? 2023 ఎన్నికల ప్రచార సభల మాదిరిగానే ఈ సభ కూడా నడవడం గమనించదగ్గ విషయం. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే రీతిలో దాడి రాజకీయాలు కొనసాగించడం పై ప్రజల్లో సందేహాలతో పాటు అసహనం కూడా వ్యక్తమవుతున్నాయి. "రాజకీయాల్లో గెలుపోటములు సహజం... కానీ 'నిన్ను గెలవనివ్వను' అన్న భాష ఒక ముఖ్యమంత్రి స్థాయికి తగినదేనా?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆ తీర్పు ఇవ్వాల్సింది, ఆ మాట చెప్పాల్సింది మేము కదా అంటున్నారు. రైతు మహోత్సవం పేరుతో ప్రత్యర్థి పార్టీలను టార్గెట్ చేయడం వ్యక్తిగత విమర్శలు చేయడంల పార్టీ మారిన నేతలపై విరుచుకుపడడం ఇవన్నీ చూస్తే... ఈ సభ రైతుల కోసం కాదనే భావన రైతుల్లోనే




వినబడుతున్నది. ఒక అధికార పార్టీ సభ అంటే ప్రజలకు ప్రయోజనం ఉండాలి. ముఖ్యంగా ప్రజా సంక్షేమానికి దారితీయాలి. కొత్త నిర్ణయాలు, ఆలోచనలకు, పథకాలకు రూపకల్పన జరగాలి. ఆ దిశగా వెంటనే జీవోలు విడుదల కావాలి. అధికార యంత్రాంగం పరుగులు పెట్టాలి.కానీ రైతు మహోత్సవం పేరుతో జరిగిన ఈ సభ... రైతుల కన్నా రాజకీయాలకే వేదికగా మారిందనే విమర్శలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. "రైతు పేరు పెట్టి రాజకీయాలు చేయడం... ఇదేనా కొత్త పాలన?" ఇదేనా మార్పు?అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇప్పుడు అధికార పార్టీపైనే ఉంది. ఏది ఏమైనా ఆయారాం గయారామ్ లాగా ఎందుకు వచ్చామో? ఏం విన్నామో? ఏం జరగనున్నదో? ఏం రానున్నదో ఏ మాత్రం తెలియని అమాయక రైతు మాత్రం ఇంటికి తిరిగి వచ్చి మళ్లీ ఆశగా ప్రభుత్వం వైపు చూస్తున్నాడు. రేవంత్ సర్కార్ ఎంచుకున్న రాగానికి తీసుకున్న తాళానికి పొంతన కుదరడం లేదు. రైతు పేరు పెట్టి రాజకీయాలు చేస్తే... ఏదో ఒక రోజు తానే రాజకీయాలకు గట్టి తీర్పు చెబుతానంటున్నడు సగటు రైతు.

# కౌన్సిలింగ్ తర్వాత కూడా గైర్హాజరు కొనసాగితే

- గైర్హాజరు కాకుండా విధులు నిర్వహించండి ● విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు ● రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్

**రామగిరి, ఏప్రిల్ 24(ది క్రైమ్ న్యూస్):-** గైర్హాజరు కౌన్సిలింగ్‌కు హాజరైన ఉద్యోగులు, ఆ తర్వాత కూడా తమ ప్రవర్తన మార్చుకోకుండా విధులకు సక్రమంగా హాజరుకాకపోతే, సంస్థ నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తప్పవని ఉద్యోగులు గైర్హాజరు శాతాన్ని తగ్గించుకొని, విధులు నిర్వహించాలని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు.రామగుండం-త్రీ ఏరియా లోని గనులు, విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు 2025 సంవత్సరం జనవరి నుండి డిసెంబర్ వరకు 150 మస్టర్ల కంటే తక్కువ, ఈ సంవత్సరం జనవరి నుండి మార్చి 31 వరకు 50 పనిదినాలు (మస్టర్లు) కూడా చేయని ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు సిఎస్ సిఓఏ క్లబ్ నందు శు క్రవారం కౌన్సిలింగ్ ను నిర్వహించారు.గైర్హాజరు అవుతున్న 51 మంది ఉద్యోగులను గుర్తించి వారి కుటుంబ సభ్యులతో సహా కౌన్సిలింగ్ కు ఆహ్వానించారు.30 మంది కౌన్సిలింగ్ కు హాజరైనారు. వారికి కమిటీ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు.వీరి గైర్హాజరుకు గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. అనారోగ్య సమస్య లు ఉన్న ఉద్యోగులు కంపెనీ అందించే వైద్య సదుపాయాలను ఉపయోగించుకొని సంపూర్ణ ఆరోగ్యం తో విధుల్లో చేరాలని,ఉద్యోగుల గైర్హాజరు కారణంగా మీ కుటుంబ సమస్యలతోపాటు సంస్థ ఉత్పత్తి లక్ష్యాలు సాదించడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, మీ కుటుంబ సభ్యుల భవిషత్తు కోసం గైర్హాజరు కాకుండా విధులకు హాజరు కావాలని, ఒక కుటుంబం లాగా అందరం కలసి కట్టుగా విధులు నిర్వహిస్తూ, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ తెలిపారు. అంతర్గత నియామకాల ద్వారా ఉద్యోగాలు పొంది పదోన్నతులు సాధిస్తున్న ఉద్యోగులను ఆదర్శంగా తీసుకోవాలని, విధులకు సక్రమంగా హాజరుకావాలని తెలిపారు. గైర్హాజరు కౌన్సిలింగ్ కు హాజరైన ఉద్యోగులు భవిష్యత్తులో తమ ప్రవర్తన మారకపోతే తగిన చర్యలను తీసుకోవాల్సి వస్తుందని సూచించారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్ర రెడ్డి, కోట





రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటు జియం బి.వి.సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ్ వి ఫ్యాటింగ్, జె.రాజశేఖర్, సిహెచ్పీ డిజియం కాశీ విశ్వేశ్వర రావు, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆదినారాయణ, డివై పియం వి.సునీల్ ప్రసాద్, సీనియర్ పిఓలు పి.రాజేశం, రవిచంద్ర, తోపాటు సంక్షేమ అధికారులు , పిట్ సెక్రెటరీలు, అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం సాధ్యం

- కల్వచర్లలో లిటిల్ పెబ్ల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే, వార్షికోత్సవ వేడుకలు
- స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రిన్సిపల్ పద్మావతి-చైతన్య కృష్ణ





**రామగిరి, ఏప్రిల్ 24(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని లిటిల్ పెబ్ల్ ఇంటర్నేషనల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే, వార్షికోత్సవ కార్యక్రమాలు సెంటనరీ కాలనీ కమ్యూనిటీ హాల్ లో ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రిన్సిపల్ పద్మావతి-చైతన్య కృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మండల విద్యా అధికారి ఎంఈఓ కొమరయ్య , మాజీ జెడ్పీటిసి గంట రమణారెడ్డి, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఇజ్జగిరి సాకేత్‌లు హాజరై విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం సాధ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఉచిత వడదెబ్బ నివారణ హోమియోపతి చుక్కల మందు పంపిణి

- సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామగుండం ఎస్ఎంఎస్ ప్లాంట్ లో మెడికల్ క్యాంపు





**రామగిరి, ఏప్రిల్ 24(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణి రామగుండం ఎస్ఎంఎస్ ప్లాంట్ ఉద్యోగులకు వేసవి జాగ్రత్తలు వివరిస్తూ, వడదెబ్బ నివారణకు హోమియోపతి చుక్కల మందును ఉచితంగా పంపిణీ చేశారు.శుక్రవారం ఉదయం ప్లాంట్ ఆవరణలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఉపరితల గనిలో ఎండలో బ్లాస్టింగ్ కోసం డ్రిల్డ్ హోల్స్ లో మందు నింపే పనులు చేసే కార్మికులు తీవ్ర ఎండకు వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ క్యాంపు ఏర్పాటు చేశారు.ప్లాంట్ లో పనిచేసే సుమారు 90 మంది కాంట్రాక్టు, శాశ్వత ఉద్యోగులకు హోమియో చుక్కల మందు వేశారు.ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి చౌడవరపు లింగమూర్తి, గౌరవ సలహాదారు నూక రమేష్, ఎస్ఎంఎస్ ప్లాంట్ మేనేజర్ శరవరన్, కొలిపాక సారయ్య, ప్లాంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ చేసిన పాకాల మహిపాల్ రెడ్డి



**బెజ్జంకి, ఎప్రిల్24(ది క్రైం న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్లో మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ దంపతుల పెళ్ళిరోజు సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి క్రికెట్ క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ చేశారు. క్రీడల్లోనే కాక అన్ని రంగాల్లో రాణించి గ్రామానికి, మండలానికి పేరు తీసుకురావాలని, యువత అభివృద్ధే లక్ష్యంగా క్రీడలను ప్రోత్సహిస్తూ అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు తానెప్పుడూ ముందుంటానని ఏ అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని క్రీడాకారులకు మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. తాజా మాజీ ఎంపీటీసీ ముక్కిస పద్మారెడ్డి క్రీడాకారులకు తనవంతు సహకారంగా బ్యాట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో క్రికెట్ జట్టు సభ్యులు, గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే కవ్వంపల్లి



**తిమ్మాపూర్, ఎప్రిల్ 24(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండిలోని క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎండలు అధికమౌతుండగా నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పైపు లీకేజీలకు నివారణా చర్యలతో నీటి ఎద్దడి కలగకుండా అప్రమత్తంగా ఉండి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.మిషన్ భగీరథ పర్యవేక్షక ఇంజనీర్, ఈఈలు, డీఈలు, ఎంపీడీవోలు తదితర అధికారులు ఎమ్మెల్యేతో సమావేశంలో పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంలో ఆదర్శంగా నిలిచిన కొలనూర్ ఫీల్డ్ అసిస్టెంట్‌కు జిల్లా కలెక్టర్ నగదు పురస్కారం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన ఫేస్ అథెంటికేషన్ యాప్ ద్వారా కూలీల హాజరును నమోదు చేయడంలో స్వప్న విశేష ప్రతిభ పథకం అమల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా, ఓదెల మండలంలోని కొలనూర్ గ్రామం జిల్లాలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. గత వారం రోజులుగా నిరంతరాయంగా రోజుకు గరిష్టంగా 194 మంది కూలీలతో పని చేయిస్తూ జిల్లాలోనే రికార్డు స్థాయిలో కూలీల హాజరును నమోదు చేస్తున్నందుకు గాను, ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ మిడి దొడ్డి స్వప్నను జిల్లా యంత్రాంగం అభినందించింది.ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష స్వప్న కు ర 5,000 రూపాయలు నగదు పురస్కారం (చెక్ రూపంలో) అందించి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించడంలో కొలనూర్ గ్రామం ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. జిల్లాలోని ఇతర పంచాయతీలు కూడా ఇదే స్ఫూర్తితో కూలీలకు గరిష్ట స్థాయిలో పని కల్పించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని,అదనపు జిల్లా కార్యక్రమ సమన్వయకర్త సత్యనారాయణ, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల టోల్ ప్లాజా వద్ద అక్రమ పీడీఎస్ బియ్యం పట్టివేత



**పటాన్చెరు(గుమ్మడిదల), ఏప్రిల్ 24(ది క్రైమ్ న్యూస్):** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. గురువారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు గుమ్మడిదల టోల్ ప్లాజా వద్ద సివిల్ సప్లయ్స్ అధికారులు,డిప్యూటీ తహశీల్దార్, గుమ్మడిదల పోలీసుల సంయుక్త బృందం తనిఖీలు నిర్వహించగా రెండు వాహనాల్లో కలిపి సుమారు 59 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి సూరారంకు చెందిన జక్కలి భరత్, కొత్తపల్లికి చెందిన మామిళ్ల ఆంజనేయులు,ఆగం రాజులను గుర్తించారు. ఈ నేపథ్యంలో సివిల్ సప్లయ్స్ అధికారి ఫిర్యాదు మేరకు గుమ్మడిదల ఎస్ఐ లక్ష్మీకాంత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం రవాణా చేసే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

# ప్రజా ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం

- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు..
- గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మోసపోయి గోసపడ్డ రైతులు
- సన్న రకం పండించిన రైతుకు గతేడాది 88 కోట్ల బోనస్..
- కాళేశ్వరం విషయంలో సిబిఐ విచారణకు బీజేపీ ప్రభుత్వం కాలయాపన చేస్తుంది





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఎన్నో సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి మరియు మండలంలోని తుర్కల మద్దుకుంట, నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దకలవల, పెద్దబొంకూరు, కొత్తపల్లి, మూలసాల, బోజన్నపేట, మారేడుగొండ మరియు గుర్రంపల్లి గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు ప్రారంభించారు. అనంతరం పెద్ద కాల్వల గ్రామంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణ రావు మాట్లాడుతూ రైతాంగానికి అన్ని విధాల అండగా ఉండేందుకు ప్రభుత్వం అనేక పథకాలను చేపట్టి అమలు చేస్తుందన్నారు. సన్న రకం వరి ధాన్యం పండించిన రైతుకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించిన ఘనత తమ ప్రభుత్వాన్ని దేని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ రైతన్నలకు రూ.88 కోట్ల బోనస్ అందించామని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు చెప్పిన ప్రకారం పంట మార్పిడి విధానాన్ని పాటించిన రైతులకు ఈసారి మోతాదును మించి అధికమైన వరి ధాన్యం, మొక్కజొన్న దిగుబడులు అందుతున్నాయని వివరించారు. రైతులు పప్పు దినుసులు, ఆయిల్ ఫామ్ సాగు వైపు దృష్టి సారించాలని కోరారు. గత పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో రైతులు మోసపోయి గోస పడ్డారని పేర్కొన్నారు. రుణ మాఫీ చేస్తామని రైతులను నమ్మించి బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా చేసిన ఘనత టిఆర్ఎస్ పాలకులదే అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుందామని వస్తే కోతల పేరిట టిఆర్ఎస్ నేతలు కోట్లాది రూపాయల రైతుల శ్రమను దోచుకున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ నేతల అధికారం పోయిందన్న అక్కసుతో మాజీ సీఎం కేసీఆర్ సహా ఆ పార్టీ నాయకులు మరియు వారి అనుచర గణం అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో జరిగిన లోటుపాట్లను కప్పిపుచ్చేందుకు టిఆర్ఎస్ నాయకులు పడరాని పాట్లు పడుతున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు అక్రమాలపై సిబిఐ విచారణకు అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేస్తే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బిఆర్ఎస్ నాయకులను కాపాడేందుకు విచారణ విషయంలో కాలయాపన చేస్తుందని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పాలకులు టిఆర్ఎస్ నేతల తప్పిదాలను కాపాడుతున్నారని, ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారన్నారు. మహిళా బిల్లు ముసుగులో నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ఆమోదింప చేసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోడీ చేసిన కుయుక్తులు సాగలేదన్నారు. విద్యావంతులైన నిరుద్యోగ యువతకు సైతం ఉద్యోగుల కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పుతో బిఆర్ఎస్ నాయకులు జబ్బలు చేర్చుకుంటున్నారని కోర్టు తీర్పులో కమిటీ వేయడంలో ప్రభుత్వం తప్పు లేదని కమిటీ రిపోర్టు వాస్తవాలు, అవాస్తవాలు గ్రహించామని కేసీఆర్, హరీష్ రావు లను ఇప్పుడే అరెస్టు చేయకండి అని తీర్పు ఇచ్చిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బాగంగా మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలు కడితే వాటిలో బుంగలు పడ్డవి నిజం కాదా అని ఎమ్మెల్యే విజయరమణ రావు గారు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కృంగిన విషయంలో అక్కడికి ఆ కాలంలో ఎవ్వరిని అనుమతించకుండా ప్యారా మిలటరీ దళాలను పెట్టింది నిజం కాద అని విమర్శించారు. కాళేశ్వరం నుండి ఒక్క చుక్క నీరు కూడా ఉపయోగించలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరూపించిందని గతంలో కాంగ్రెస్ సర్కార్ నిర్మించిన ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచే సాగునీరు అందిందని గుర్తు చేశారు. బిఆర్ఎస్ మరియు బీజేపీ పార్టీలు రెండు ఒకటేనని వారిరువురు పరస్పరం రాజకీయంగా సహాయం చేసుకుంటారని అన్నారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ అధికారి కాళేశ్వరాన్ని సందర్శిస్తే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ గారు వారు ఎందుకు సందర్శించారని అనడం విడ్డూరంగా ఉందని తెలిపారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు ఇష్టానుసారంగా మాలాడుతున్నారని వారికి చిత్తశుద్ధి లేదని వారి మాటలు వింటుంటేనే బిఆర్ఎస్ మరియు బీజేపీ పార్టీలు రెండు ఒకటేనని తెలుస్తుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయింది నిజం కాదా దీనికి కిషన్ రెడ్డి, బండి సంజయ్ మరియు బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల బీజేపీ పార్టీ వారికి ఎలాంటి చిత్తశుద్ధి లేదని కేవలం సెంటిమెంటు రగిలిస్తూ బీజేపీ కేంద్రంలో అధికారం చేపడుతుందని రాష్ట్రంలో కేసీఆర్ కూడా తెలంగాణ సెంటిమెంట్ తో పది సంవత్సరాలు పరిపాలన చేశారని విమర్శించారు. ఎలాంటి సెంటిమెంటు ఎన్ని రోజులు ఉండవని కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం పక్కా అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య,వ్యవసాయ మార్కెట్ చైర్మన్, కూర మల్లారెడ్డి, కట్కూరి సుధాకర్ రెడ్డి, అర్కటు సంతోష్, నర్సింహా రెడ్డి, బండారు రామూర్తి, ముత్యాల నరేష్,డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.





# గ్రామీణ స్వయంపాలనకు పునాది పంచాయతీరాజ్ వ్యవస్థ

- ఏం.పీ.ఓ సమ్మిరెడ్డి,సర్పంచ్ పల్లె.ప్రతిమ-పీవీరావు





**రామగిరి, ఏప్రిల్ 24(ది క్రైమ్ న్యూస్):-** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామీణ స్వయంపాలనకు పునాది అయిన పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రాముఖ్యతను మనం మరోసారి స్మరించుకోవాలని రామగిరి ఎంపీఓ మూల సమ్మిరెడ్డి, సర్పంచ్ పల్లె. ప్రతిమ- పీవీరావు అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం గ్రామ సభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో పంచాయతీలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులందరూ గ్రామ అభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని, శుభ్రమైన గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో స్థానిక సంస్థలతో పాటు ప్రజల సహకారం అత్యంత అవసరమన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామాలలో శుభ్రత కార్యక్రమాలు, మొక్కల నాటడం, అవగాహన సదస్సులు నిర్వహించబడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామ సభలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాద్రపు.ప్రవల్లిక ప్రశాంత్, సెక్రటరీ గంగుల సంతోష్, వార్డ్ సభ్యులు పబ్బా స్రవంతి వెంకటేష్, కెక్కర్ల ఉష అశోక్, జక్కుల పద్మ చందన్, కలవేన రవి, ఖండే లక్ష్మీ గట్టయ్య, ఖండే.సాహితీ పోచం, బత్తిని ప్రశాంత్, అల్లి రమేష్, పున్నశీ మణి తేజ, జుట్టు యశోద సత్యనారాయణ, బత్తుల రాజమణి రమేష్ ,ఏం.ఎల్.హెచ్.పీ కర్రావుల నవ్య, ఏ.ఎన్.ఎమ్ మన్నాల రాణి, కారోబర్ కొండపర్తి శ్రీనివాస్, ఆశావర్కర్లు మేడ స్వరూప,గడ్డం సునీత పాల్గొన్నారు.

# విలీనం అంటే జీతాలే కాదు - హక్కులు కూడా

- ఆర్టీసీని అప్పుల ఊబి నుండి రక్షించాలి
- ఆర్ టి సి కార్మికుల విలీన చట్టం 2023 పూర్తిస్థాయిలో అమలు చేయాలి
- తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కమిటీ

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం, వారి న్యాయమైన హక్కుల సాధన కోసం కొనసాగుతున్న పోరాటానికి తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నదని టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమరయ్య అన్నారు. ఈ సందర్భంగా గుమ్మడి కొమురయ్య మాట్లాడుతూ విలీనం అనేది కేవలం జీతాల పెంపుకే పరిమితం కాకుండా, ఉద్యోగుల పూర్తి హక్కులు, భద్రత, గౌరవం కల్పించడమే లక్ష్యం కావాలని అన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్టీసీ విలీన చట్టం 2023ను పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు, ఆర్టీసీ సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే కొత్త సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని, ఉద్యోగులందరినీ పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ హోదా కల్పించాలని,గత పదేళ్లలో ఖాళీ అయిన సుమారు 20,000 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం మాట్లాడుతూ పని ఒత్తిడి తగ్గించి, ఉద్యోగుల భద్రతను పెంచాలని,పెండింగ్‌లో ఉన్న 2021--2025 వేతన సవరణలను వెంటనే ప్రకటించాలని,సరైన ఫిట్మెంట్‌తో కొత్త వేతనాలు అమలు చేయాలని అన్నారు. ఆర్టీసీ ఆర్థిక పరిరక్షణపై మహాలక్ష్మి పథకం, విద్యార్థుల రాయితీలకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. ?3,500 కోట్ల పిఎఫ్ బకాయిలపై స్పష్టత ఇవ్వడంతో పాటు, యాజమాన్యం వాడుకున్న ?1,200 కోట్ల పిఎఫ్, సిసిఎస్ నిధులను కార్మికుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని, సంస్థపై ఉన్న సుమారు ?9,500 కోట్ల పాత అప్పులను ప్రభుత్వం స్వీకరించి ఆర్టీసీని ఆర్థికంగా విముక్తి చేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ కార్మికుడు శంకర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని 50 లక్షల ఎక్స్ గ్రేషియోతో ఇవ్వడం తో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి ప్రజలు, ప్రజా స్వామిక వాదులు, మేధావులు ప్రజాసంఘాలు, ప్రజా ప్రతినిధులు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.



# జనగణనపై శిక్షణా కార్యక్రమం....




**తిమ్మాపూర్, ఎప్రిల్ 24(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండిలోని మిషన్ భగీరథ గెస్ట్ హౌస్ లో జనగణన -2027లో భాగంగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు జనగణనపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన పరిదిలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో జనగణనను పూర్తి చేయాలని తహశీల్దార్ సూచించారు. తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్హోత్రా, అధికారులు, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సెపక్ తక్రాలో జాతీయస్థాయికి పోచంపల్లి ఆదర్శ విద్యార్థిని



**మానకొండూరు, ఎప్రిల్24(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పోచంపల్లి ఆదర్శ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని దూడూరి ప్రహర్షిక సెపక్ తక్రా పోటీల్లో జాతీయ స్థాయిలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. గతేడాది డిసెంబర్లో మహబూబాబాద్ జిల్లాలో జరిగిన ఎస్జీఎఫ్ అండర్ 14 బాలికల రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీల్లో ప్రతిభ కనబరిచి అదే జిల్లాలో నేటి నుండి 28తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలో తెలంగాణ జట్టు నుండి విద్యార్థిని ప్రహర్షిక పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మశ్రీ, సీనియర్ టీచర్ డాక్టర్ సుమన్ కుమార్, అధ్యాపక బృందం, ఫిజికల్ డైరెక్టర్ ఉయ్యాల విష్ణువర్ధన్ విద్యార్థిని ప్రహర్షికను అభినందించారు.

# కల్వచర్లలో ఘనంగా సత్యసాయి ఆరాదనోత్సవాలు

- 101 నిమిషాల భజన, నారాయణ సేవ, అమృత కలశాల పంపిణీ



**రామగిరి, ఏప్రిల్ 24(ది క్రైమ్ న్యూస్):-** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మహాసమాధి చెందిన ఏప్రిల్ 24 ను పురస్కరించుకుని కల్వచర్ల శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శ్రీ సత్యసాయి ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కన్వీనర్ నూక రమేష్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బస్టాండు వద్ద గల సాయినిలయంలో 101 నిమిషాల పాటు స్వామినామ కీర్తన భజన కార్యక్రమం ఆధ్యాత్మికంగా జరిగింది. అనంతరం ఉమామహేశ్వర ఆలయంలో హనుమాన్ దీక్షాపరులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం ఓంకారంతో సుప్రభాతం, నగర సంకీర్తన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణ సేవలో భాగంగా ఇద్దరు నిరుపేద మహిళలకు నిత్యావసర వస్తువులతో కూడిన అమృత కలశాలను అందజేశారు. అలాగే వారసంతలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం కూడా చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో లద్నాపూర్ సర్పంచ్ వనం రామచందర్ రావు, భజనపరులు బండారి సదానందం, వేగోలపు కృష్ణస్వామి, పడాల శ్రీనివాస్ గౌడ్, గంట మాధుసూదన్ రెడ్డి, బండి రాజయ్య, చంద్రయ్య నేత, మునిగాల శ్రీనివాస్ రెడ్డి, రేండ్ల రమేష్, తాటి రవీందర్, సత్యసాయి సేవాదళ్ సభ్యులు చౌడవరపు లింగమూర్తి దంపతులు, శరవణన్- కవిత దంపతులు, కాంటేవాడ బుగ్గాజి, శివసాయి, కాసర్ల రాజమహేందర్ రెడ్డి, కొలిపాక సారయ్య, కొండ సమ్మయ్య, సెంటినరీ కాలనీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి, రావికంటి లక్ష్మీనారాయణ, పుల్లూరి అన్వేష్, నూక వాణి, బాలసాని సతీష్, కల్వచర్ల శివరామకృష్ణ భజన మండలి, సత్యసాయి సేవాదళ్ సభ్యులు, సాయి భక్తులు పాల్గొన్నారు. బాబా బోధించిన ప్రేమ, సేవ, సత్యం సందేశాలను ఆచరిస్తూ ఆరాధన దినోత్సవాన్ని నిర్వహించినట్లు కన్వీనర్ నూక రమేష్ తెలిపారు.

# బాడీ మసాజ్ ఎందుకు, ఎవరికి అవసరం..? తప్పక తెలుసుకోవాలి.

వయసు యాభై దాటితే మీ దినచర్యలో బాడీ మసాజ్ కూడ చేర్చుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. 45 నుంచి 50 దాటితే శరీరం లోపల ఉండే భాగాల ఎదుగుదల ఆగిపోయి అరుగుదల క్రమంగా మొదలవుతుంది. ఫలితంగా పని సామర్థ్యం తగ్గి కాళ్ళ నొప్పులు, కీళ్ళ నొప్పులు, మోకాళ్ళ నొప్పులు, మెడ నొప్పులు, బ్యాక్ పెయిన్ వంటి రుగ్మతలు వేధిస్తుంటాయి. వీటికి చెక్ పెట్టాలంటే రెగ్యులర్ బాడీ మసాజ్ చాలా అవసరం. ఇందుకోసం మన ఇంట్లోనే రోజూ ఉదయం స్నానం చేయడానికి ఓ అరగంట ముందు 10-15 నిమిషాల పాటు మనకు మనంగా బాడీ మసాజ్ చేసుకుంటే సరిపోతుంది. బాడీ పెయిన్స్ మరీ ఎక్కువగా ఉంటే ఫిజియోథెరపీ వంటివి తప్పవు. బాడీ మసాజ్‌తో ఒళ్లు నొప్పులు రాకుండా ఉంటాయి. ముందే ఒంటి నొప్పులతో ఇబ్బంది పడుతున్నట్టయితే అవి తగ్గిపోతాయంటున్నారు. ఇంట్లోనే బాడీ మసాజ్ ఎలా చేసుకోవాలి.. ఆరోగ్య ప్రయోజనాలేంటో కూడా తెలుసుకుందాం..మసాజ్ కోసం కావాల్సిన ఆయిల్ తీసుకుని మన చేతి వేళ్ళతోనే రాపిడి ప్రెషర్ తో ఒళ్ళంతా పట్టించాలి. ఓ పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. రోజూ క్రమం తప్పకుండా ఇలా చేస్తూ ఉంటే ఒళ్లు నొప్పులు మన దరి చేరవంటున్నారు. బాడీ పెయిన్స్ విషయంలో ముందే జాగ్రత్త పడటం చాలా అవసరం అంటున్నారు నిపుణులు. లేదంటే ఆ తర్వాత వైద్యం కోసం, ఫిజియోథెరపీ మెడిసిన్లు అంటూ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇలాంటి జాయింట్ పెయిన్స్, బాడీ పెయిన్స్ మరింత తీవ్రమైతే వేలకు వేలు పెట్టి ఖరీదైన సర్జరీలు, టెన్షన్లు తప్పవని నిపుణులు సూచిస్తున్నారు. ఒళ్లు నొప్పుల సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు అనేక మంది ఉన్నారు. ప్రతిరోజూ మార్నింగ్ వాక్ తరువాత రెగ్యులర్‌గా బాడీ మసాజ్ చేసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిదంటున్నారు. బాడీ మసాజ్ వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఒకటి, రెండు కాదు.. ఏకంగా 25 రకాల లాభాలు ఉన్నాయని వైద్యులు, నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా బాడీ మసాజ్ వలన రక్తప్రసరణ బాగా మెరుగవుతుంది. లో బ్లడ్ ప్రెషర్ ను నియంత్రిస్తుంది. ఒత్తిడిని బాగా తగ్గిస్తుంది. మజిల్స్ టెన్షన్ ని తగ్గిస్తాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బాడీ పెయిన్స్ రాకుండా ఉంటాయి. ఆల్రెడీ బాడీ పెయిన్స్ ఉంటే తగ్గుతాయి.

# ఆర్టీసీ కార్మికుల డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి

## ● ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి బాధాకరం: నగర మేయర్ కొలగని శ్రీనివాస్

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 24(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరీంనగర్ లో శుక్రవారం రోజున ఆర్టీసీ జేఏసి కార్మికుల కు మద్దతు , సంఘీభావం ప్రకటించి, ఆర్టీసీ డిపో వద్ద కార్మికులతో కలిసి ఆంధోళన కార్యక్రమంలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు బస్టాండ్ నుండి కార్మికులతో కలిసి అమరవీరుల స్థూపం వరకు మేయర్ కొలగని శ్రీనివాస్ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మేయర్ విచారం వ్యక్తం చేశారు.శంకర్ గౌడ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసిని ప్రభుత్వం లో విలీనం చేస్తూ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి కార్మికుల బకాయి ఉన్న వేతన సవరణలను వెంటనే అమలు చేయాలని చేయాలన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను పట్టించుకొక పోవడం వల్లే ఆత్మహత్యలు చేస్కోవల్సిన పరిస్తితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు చేస్తున్న న్యాయపోరాటానికి బీజేపి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రబుత్వ మొండి వైఖరి వల్లే నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందడం జరిగిందని... దీనికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించి డిమాండ్ల నెరవేర్చాలన్నారు. ఆర్టీసీ కార్మికుల పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. ఆర్టీసీని బలోపేతం చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు కొత్త బస్సులను కోనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ అద్దెబస్సులను నడుపుతూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందన వెంటనే నడిపిస్తున్న అద్దె బస్సులను తగ్గించాలన్నారు. 30 శాతం ఫిట్ మెంట్ తగ్గకుండా 2021 వేతన సవరణలను వెంటనే చేపట్టి ఆర్టీసీ జేఏసి కార్మికులు తీస్కున్న సమ్మెను విరమింప చేయాలన్నారుఆర్టీసీ జేఏసి ప్రభుత్వం ముందు ఉంచిన 32 న్యాయమైన డిమాండ్ల పై కార్మిక సంఘాలతో సానుకూలంగా చర్చలు జరిపి వాటిని నెరవేర్చే దిశగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆర్టీసి సంస్థలో నూతన రిక్రూట్ మెంట్ చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసే వారికి మద్దతు తెలిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీస్కోవాలన్నారు. గుర్తింపు పొందిన కార్మిక సంఘాల యూనియన్లను వెంటనే ప్రారంబించాలన్నారు. యూనియన్ల ద్వారానే వారి సమస్యలు పరిష్కారం అవుతాయి కాబట్టి యూనియన్లతో ప్రభుత్వం చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ మొండి వైఖరిని వీడి సమ్మెలో ఉన్న 39 వేల మంది కార్మికులతో తక్షణమే చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం సానుకూలంగా చర్చలు జరపకుండా సమస్యలను పరిష్కరించ కుండా కార్మికులను బెదింపులకు గురి చేయడం ముర్ఖత్వమని మండి పడ్డారు. ఇప్పటికైన చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన సమ్మెను విరమింపజేసేలా చర్యలు తీస్కోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు చంద్ర, దేవసాని సరస్వతి, మాసం గణేష్, తోట అనిల్, ఆర్టీసీ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.





# రేపటి తరానికి అవసరమైన పరిజ్ఞానాన్ని విద్యార్థులు సంపాదించుకోవాలి

## ● కాకతీయ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే సాంస్కృతిక ఉత్సవం ● ముఖ్య అతిథిగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్






**రామగిరి, ఏప్రిల్ 24(ది క్రైమ్ న్యూస్):-** విద్యార్థులు చిన్ననాటి నుంచే సక్రమమైన మార్గంలో మంచి విద్యను అభ్యసిస్తే, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు అధిరోహించగలరని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ అన్నారు. రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మి గార్డెన్‌లో నిర్వహించిన "కాకతీయ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే సాంస్కృతిక ఉత్సవం" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేపటి తరానికి అవసరమైన పరిజ్ఞానాన్ని విద్యార్థులు సంపాదించుకొని, అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో ఉన్నత చదువులు అభ్యసించి, తల్లిదండ్రులకు, తమ ప్రాంతానికి, చదివిన పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కండే పోషం, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గుట్టలాంటి పొట్టకు ఛూమంత్రం..





గసగసాలులో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మసాలా దినుసు గసగసాలు యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉన్నాయి. వీటిని రాగి, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, ఫైబర్, మాంగనీస్ గొప్ప మూలంగా పరిగణిస్తారు. గసగసాలు అనేక వ్యాధుల నుండి రక్షించడంలో సాయపడతాయి. నాడీ వ్యాధులు, మధుమేహం, గుండె జబ్బులు వంటి వివిధ రకాల ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలోగసగసాలుఉపయోగపడతాయి.ఇంకాఎసిడిటీ, మలబద్ధకం సమస్య నుంచి కూడా ఉపశమనం కలిగిస్తాయి. గసగసాలు.. బరువు తగ్గించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటాయి. పొట్ట, నడుము చుట్టూ కొవ్వు పెరగడం వల్ల మీరు ఇబ్బంది పడుతుంటే గసగసాలు తీసుకోవడం చాలా మంచిది.. ఎందుకంటే ఇందులోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్‌లు బరువు తగ్గడానికి సహకరిస్తాయి. గసగసాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. రోజువారీ ఆహారంలో గసగసాలు చేర్చుకుంటే.. కొన్ని రోజుల్లోనే మార్పు వస్తుంది. ఇంకా గసగసాల సిరప్‌ను మార్కెట్ నుంచి కొనుగోలు చేసి, దానిని షర్బత్‌గా చేసుకుని తాగవచ్చు.ఇదితీసుకోవడం వల్లఎక్కువసేపు ఆకలిగా అనిపించకుండా చేస్తుంది. దీంతో బరువు క్రమంగా తగ్గుతుంది.గసగసాలు, పాలు కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. దీని వినియోగం వల్ల కండరాలు, ఎముకలు బలపడతాయి. ఒక గ్లాసు పాలలో 1టేబుల్ స్పూన్ గసగసాలు వేసిమరిగించి గోరువెచ్చగా ఉన్నప్పుడు త్రాగాలి.

# ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొత్తిమీర నీళ్లు తాగితే ఏమవుతుందో తెలుసా..?



కొత్తిమీర నీరు ఎసిడిటీ, పిత్తాను తగ్గించడంలో చాలా మేలు చేస్తుంది. కొత్తిమీరలోని గుణాలు పొట్టకు మేలు చేస్తాయి. కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపులో యాసిడ్ స్థాయి తగ్గుతుంది. ఎసిడిటీ వల్ల వచ్చే మంట, నొప్పి తగ్గుతుంది. కొత్తిమీరలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది అసిడిటీ వల్ల వచ్చే సమస్యలను తగ్గిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపు సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కొత్తిమీర నీరు మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. కొత్తిమీరలో అధిక పీచు ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొత్తిమీర గింజలలో ఉండే థైమోల్ అనే పదార్థం మలబద్ధకం నుండి ఉపశమనం కలిగించే జీర్ణ రసాల స్రావాన్ని పెంచుతుంది. అలాగే, కొత్తిమీర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. ఇది మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. బరువు నియంత్రణ, బరువు తగ్గడంలో కొత్తిమీర నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కొత్తిమీరలో ఉండే ఫైబర్ కడుపు నిండుగా ఉంచుతుంది. ఆకలి దప్పులను తగ్గిస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు నియంత్రణలో సహాయపడుతుంది. కొత్తిమీరలో ఉన్న పాలీఫెనాల్ యాంటీ ఆక్సిడెంట్లు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. థైరాయిడ్ సమస్యలకు సహజ నివారణగా పనిచేస్తుంది. కొత్తిమీర ఆకులు, కాండం యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి సరైన థైరాయిడ్ పనితీరుకు సహాయపడతాయి. మీరు దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తాగితే అద్భుత ఫలితం ఉంటుంది. కొత్తిమీరలో గ్లైసెమిక్ 33 మాత్రమే ఉంది. ఇది చాలా తక్కువ. అటువంటి పరిస్థితిలో, ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా చెప్పవచ్చు. పచ్చి కొత్తిమీర శరీరంలో చక్కెర స్థాయిని తగ్గించి, ఇన్సులిన్ మొత్తాన్ని పెంచుతుంది. అలాగే, రక్తంలో చక్కెర తక్కువగా ఉంటే కొత్తిమీర నీటిని తాగకూడదు. అది రక్తంలో చక్కెరను తగ్గిస్తుంది.

# వేసవి సెలవుల్లో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కోర్సుల శిక్షణ రోహేలాస్ టెక్ ఆహ్వానం


**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 24(ది క్రైమ్ న్యూస్):** ఈ వేసవి సెలవులను సెల్ ఫోన్లు, టీవీలు, ట్యాబ్‌లకే పరిమితం కాకుండా, విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలను నేర్చుకోవాలని రోహేలాస్ టెక్ ప్రతినిధులు కోరారు. రోల్ టెక్ ఐటీ సొల్యూషన్స్ వారు తమ 'ట్రైనీ టెక్కి' విభాగం ద్వారా 6వ తరగతి నుండి 12వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మూడు సాఫ్ట్‌వేర్ కోర్సులను ప్రారంభించారు. కోర్సుల వివరాలు డిజిటల్ మార్కెటింగ్ పైథాన్ కోడింగ్ (బిగినర్స్ కోసం) ఏఐ టూల్స్,ఈ 45 రోజుల శిక్షణా కాలంలో విద్యార్థులకు సింగపూర్, పూణే, హైదరాబాద్ వంటి నగరాలకు చెందిన అనుభవజ్ఞులైన నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. కరీంనగర్ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని స్థానికంగానే 'రోహేలాస్ టెక్' ద్వారా అందించడం గర్వకారణమని వారు తెలిపారు. సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. మరిన్ని వివరాల కోసం వెంటనే రోహేలాస్ టెక్ కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా కోరారు.



## షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచే దివ్యాస్త్రాలు..

# ఈ 5 జాగ్రత్తలు తప్పనిసరి!






డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు ఏడాది పొడవునా బ్లడ్ షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచుకోవడం సవాలుతో కూడుకున్న విషయం. ముఖ్యంగా వేసవిలో షుగర్ లెవెల్స్‌ను తగ్గించుకోవడం అంత సులువు కాదు. అందుకే డయాబెటిక్ రోగులందరికీ వేసవి కష్టకాలంతో సమానం. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వేసవిలో మీ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చంటున్నారు నిపుణులు. వోక్‌హార్డ్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ మీరా.. డయాబెటిక్ రోగులను వేసవి ఎలా ప్రభావితం చేస్తుందో వివరించారు. సాధారణంగా అధిక వేడి వల్ల అలసట, డీహైడ్రేషన్ వంటి కారణాల వల్ల రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడం కష్టతరం అవుతుంది. అందుకే మధుమేహం ఉన్నవారు వేసవిలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే మధుమేహం ఉన్నవారు తమ శరీరంలోని నీటిని త్వరగా కోల్పోతారు. దీంతో సులభంగా నిర్జలీకరణానికి గురవుతారు. పైగా తక్కువ నీరు తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. దీంతో రక్తనాళాలు, నరాల దెబ్బతినడం వంటి కొన్ని మధుమేహం సమస్యలు స్వేద గ్రంధులపై ప్రభావం చూపుతాయి. పైగా శరీర ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. ఇది హీట్ ఎగ్జాషన్, హీట్ స్ట్రోక్‌కు కారణమవుతుంది. ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతాయి. అందుకే వేసవిలో షుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకోవాలి. వేసవిలో మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ కింది జాగ్రత్తలు తీసుకుంటే హాయిగా ఉండొచ్చు. ఔ వేసవిలో మధుమేహాన్ని నియంత్రించడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలు వీలైనంత హైడ్రేటెడ్‌గా ఉండాలి వేసవి కాలంలో అధిక వేడికారణంగా చెమట ద్వారా ఎక్కువ నీటిని కోల్పోతారు. ఇది నిర్జలీకరణానికి దారితీస్తుంది. నిర్జలీకరణం రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడానికి దారితీస్తుంది. అందుకే ఈ కాలంలో నీరు ఎక్కువగా తాగాలి. తద్వారా డీహైడ్రేషన్‌ను నివారించవచ్చు. కానీ చక్కెర కలిపిన తీపి పానీయాలకు దూరంగా ఉండాలి. ఆల్కహాల్ కెఫిన్ వద్దు ఆల్కహాల్, కెఫిన్ ఆధారిత పానీయాలు నిర్జలీకరణానికి దారితీస్తాయి. ఎందుకంటే ఇవి అధిక మూత్రవిసర్జనకు కారణం అవుతాయి. ఈ పానీయాలు శరీరంలో నీటిని కోల్పోవడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడానికి దారితీస్తాయి. కాబట్టి అలాంటి డ్రింక్స్ తీసుకోవడం తగ్గించాలి. రక్తంలో చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలి వేసవిలో రక్తంలో చక్కెర స్థాయిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. వేడి వాతావరణంలో హృదయ స్పందన రేటు పెరిగి, అధిక చెమటలు పట్టవచ్చు. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుంది. అందుకే ఈ కాలంలో ఇన్సులిన్ మోతాదును మార్చుకోవాలి. ఇన్సులిన్ మోతాదును మార్చాలనుకుంటే వైద్యుడిని సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. శారీరకంగా చురుకుగా ఉండాలి శారీరకంగా చురుకుగా ఉండటం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు. ఈ కాలంలో యాక్టివ్‌గా ఉండటానికి ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయాలి. ఇలాంటి చిన్నపాటి వ్యాయామాలు చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలో హెచ్చుతగ్గులు వస్తాయి. అందుకే వ్యాయామాలు చేసే ముందు, పూర్తి చేసిన తర్వాత దాన్ని పరీక్షించుకోవాలి. ఎండలో బయటకు వెళ్లకపోవడం బెటర్ రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడానికి వేసవి ఎండల నుంచి మిమ్మల్ని మీరు వీలైనంత ఎక్కువగా రక్షించుకోవాలి. వడదెబ్బ శరీరాన్ని ఒత్తిడికి గురి చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ఒకవేళ తప్పనిసరైతే చర్మానికి సన్ స్క్రీన్ రాసుకోవడంతోపాటు వడదెబ్బను నివారించడానికి టోపీ, సన్ గ్లాసెస్, గొడుగుతో బయటకు వెళ్లాలి. అలాగే, శరీరంలోని బహిర్గత భాగాలను కవర్ చేసేలా చూసుకోవాలి.

# అంగన్వాడీలకు ఔట్డేటెడ్ ఫోన్లు ....

# సెల్ ఫోన్స్ ఇవ్వాలని బీజేపీ డిమాండ్..

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాలం లో 4+ మొబైల్ ఫోన్లు...తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడీ 38 వేల కి పైగా ఉన్నా టీచర్లు కి ఉచితంగా ఫోన్లు ఇచ్చారు,, కేంద్ర ప్రభుత్వం మిషన్ సక్షం పోషన్ అభియాన్ కింద, ఇందులో 60% కేంద్ర ఫండ్స్ ఉన్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో అంగన్వాడీ కేంద్రాలకు ౦బఎంశీఅస్త్ర కి చెందిన ఓల్డ్ ఔట్ డేటెడ్.. ఫోన్ల ను ఇవ్వడం. అనుమానాలకి తావు ఇస్తుంది.. ప్రస్తుతం నెట్వర్క్ లో ఉన్న.. కూడా ఇంకా పల్లెటూళ్ళో లేదు కాబట్టి ఫోన్లు ఇచ్చాం అని ప్రభుత్వం చెప్తుంది.. ఇది కేవలం ఇందులో అవినీతి నీ తప్పించు కోవడం కోసం అబద్ధాలు చెప్తుంది ప్రభుత్వం. 54 కోట్ల టెండర్ లో కచ్చితంగా అవినీతి జరిగిందని దీని పై విచారణ చేపట్టాలని,మేము డిమాండ్ చేస్తున్నాం.. ఎందుకంటే ఇందులో కేంద్ర ప్రభుత్వం నిధులు ఉన్నాయి.. వీటిని ఎలా పక్క దోవ పట్టించారో.. ఎంత ఫ్రాడ్ ఉందో తెలంగాణ ప్రజలు కి తెలియాలి.. పక్క రాష్ట్రాల్లోఅప్డేట్ వర్షన్,,5+ ఫోన్లు అంగన్వాడీ లకు ఇస్తుంటే.. దాదాపు అదే ప్రైస్ కి ఇక్కడ 4+ ఫోన్లు ఎలా ఇచ్చారో తెలియాలి.. అంగన్వాడీ టీచర్ లు.. ప్రభుత్వ దూూా లు గా ఉంటారు. అలా వారు ఇంటి ఇంటి కి వెళ్ళి కుటుంబ సభ్యులు వివరాలు,, ఓటరు నమోదు వివరాలు వాళ్ళే తీసుకొని.. వెంటనే మొబైల్ లో అప్లోడ్ చేసే అవకాశం ఉంటది.. మరి.. ఫోన్ల వల్ల.. ప్రోగ్రాం అప్లోడ్.. మరింత గా స్లో అయి.. ఫోన్లు హాంగ్ అయ్యే పరిస్థితి ఉంటది.. ప్రభుత్వం ఎన్నో రకాల పనులు కి అంగన్వాడీ టీచర్లు ను వాడుకుంటుంది.. అలాంటి వారికి ఇంకా స్మార్ట్ ఫోన్లు నీ ఇచ్చి. వారిని మోసం చేయడమే అవుతుంది... ఫోన్ల జూతీఅఎవ తో ప్రభుత్వం చెప్పిన లెక్క కి చాలా వ్యత్యాసం ఉందని.. అలాగే 54 కోట్ల రూపాయలు.. కాంట్రాక్ట్.. ఎలా ఇచ్చారో ప్రజలకి తెలుపాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉందని,8000/రూపాయల విలువ చేసే ఫోన్ల ను.. ఎలా 14000రూపాయలు పెట్టీ కొన్నారు. దీని పై. విచారణ చేపట్టాలని ప్రభుత్వం న్నీ.. బీజేపీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం...

# ఆర్టీసీ సమ్మెకు రాష్ట్ర రజక సంఘం పూర్తి మద్దతు

**కరీంనగర్ టౌన్, ఎప్రిల్ 24(ది క్రైం న్యూస్):** ఆర్టీసీ కార్మికుల సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలంటూ రాష్ట్ర రజక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ మూడు డిమాండ్లను పరిష్కరించాలని కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఇప్పటికి స్పందించక పోవడం సరైనది కాదని హితవు పలికారు. కార్మికుడు శంకర్ గౌడ్‌ది ఆత్మహత్యగా కాకుండా ప్రభుత్వ హత్యగా పరిగణిస్తున్నామని, ప్రైవేటు వాహనదారులు ఇష్టం వచ్చినట్లు దోచుకుంటుండగా ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు పిఆర్సిని ప్రకటించి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్, జిల్లా అధ్యక్షులు రాచకొండ నరేష్ ఒక ప్రకటన ద్వారా కోరారు.

# ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చిన సన్ రైజర్స్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సగం దశను పూర్తి చేసుకుంది. రెండో దశ మ్యాచ్‌లు ఆరంభం కానున్నాయి. దాంతో లీగ్ మరింత రసవత్తరంగా మారనుంది. వారం వారం గడిచే కొద్ది ప్లే ఆఫ్స్ సమీకరణాలు ఆసక్తికరంగా మారడం ఖాయం. ప్రస్తుతానికి ప్లే ఆఫ్స్ రేసు అయితే ఆసక్తికరంగా మారింది. పంజాబ్ కింగ్స్ ఆడిన 6 మ్యాచ్‌ల్లో 5 విజయాలు.. ఒక రద్దుతో 11 పాయింట్లతో లీగ్ టేబుల్లో టాప్ ప్లేస్‌లో ఉంది. ఇక రాజస్థాన్ రాయల్స్ 7 మ్యాచ్‌ల్లో 5 విజయాలు.. రెండు ఓటములతో 10 పాయింట్లతో రెండో స్థానంలో.. ఆర్సీబీ 6 మ్యాచ్‌ల్లో 4 విజయాలు.. రెండు ఓటములతో 8 పాయింట్లతో మూడో స్థానంలో.. సన్ రైజర్స్ హైదరాబాద్ 7 మ్యాచ్‌ల్లో 4 విజయాలు.. 3 ఓటములతో 8 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాయి. అయితే ఈ నాలుగు జట్లే ప్లే ఆఫ్స్‌కు చేరతాయనే గ్యారెంటీ లేదు. ప్రస్తుతానికి 10 జట్లకు కూడా ప్లే ఆఫ్స్ అవకాశాలు ఉన్నాయి. అయితే కేకేఆర్, లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ జట్లు ప్లే ఆఫ్స్ చేరాలంటే మిగిలిన 7 మ్యాచ్‌ల్లో కనీసం 6 గెలవాలి. ప్రస్తుతానికి ఈ మూడు జట్లు ప్లే ఆఫ్స్ చేరడం చాలా కష్టం. ఇక పంజాబ్ కింగ్స్ మిగిలి ఉన్న 8 మ్యాచ్‌ల్లో 3 మ్యాచ్‌ల్లో గెలిచినా ప్లే ఆఫ్స్ చేరుతుంది.ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ విషయానికి వస్తే ప్లే ఆఫ్స్ ఊరిస్తోంది. ఆరంభంలో ఓటములతో సీజన్‌ను ఆరంభించినా.. హ్యాట్రిక్ విజయాలతో ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది.సన్ రైజర్స్ హైదరాబాద్ ప్రస్తుతానికి 7 మ్యాచ్‌ల్లో 4 విజయాలు.. 3 పరాజయాలతో 8 పాయింట్లతో లీగ్ టేబుల్లో 4వ స్థానంలో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్‌లతో ప్లే ఆఫ్స్‌కు గట్టి పోటీ ఉంది. పంజాబ్ కింగ్స్, రాజస్తాన్ రాయల్స్, ఆర్సీబీ జట్లు టాప్3లో వెళ్లినా.. నాలుగో స్థానం కోసం సన్ రైజర్స్, చెన్నై, గుజరాత్, ఢిల్లీ జట్ల మధ్య గట్టి పోటీ అయితే ఉంది. ఇతర జట్లపై ఆధారపడకుండా నేరుగా ప్లే ఆఫ్స్ చేరాలంటే సన్ రైజర్స్ హైదరాబాద్ కనీసం 16 పాయింట్లు సాధించాల్సి ఉంటుంది. అంటే మరో 8 పాయింట్లు కావాలి. అంటే నాలుగు విజయాలు. మిగిలి ఉన్న 7 మ్యాచ్‌ల్లో కనీసం 4 మ్యాచ్‌ల్లో నెగ్గితేనే ప్లే ఆఫ్స్‌కు చేరుతుంది. 5 లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌ల్లో గెలిస్తే టాప్ 2లో నిలుస్తుంది.అలా కాకుండా 7 మ్యాచ్‌ల్లో మూడింటిలో నెగ్గితే మాత్రం అప్పుడు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. 14 పాయింట్లతో ప్లే ఆఫ్స్ చేరాలంటే టాప్ 2లో నిలిచిన జట్లు డామినేషన్ చూపించాలి. అదే సమయంలో సన్ రైజర్స్ హైదరాబాద్ నెట్ రన్ రేట్ కూడా బాగుండాలి. కానీ, ఇది చాలా కష్టం. సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ చేరాలంటే 4 మ్యాచ్‌ల్లో తప్పక గెలవాలి. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ తన తదుపరి మ్యాచ్‌ల్లో రాజస్థాన్ రాయల్స్ (ఏప్రిల్ 26న), ముంబై ఇండియన్స్ (ఏప్రిల్ 29న), కేకేఆర్ (మే 3న), పంజాబ్ కింగ్స్ (మే 6న), గుజరాత్ టైటాన్స్ (మే 12న), చెన్నై సూపర్ కింగ్స్ (మే 18న), ఆర్సీబీ (మే 22న) ఆడనుంది. కేకేఆర్, పంజాబ్ కింగ్స్, ఆర్సీబీలతో జరిగే మ్యాచ్‌లను ఉప్పల్ వేదికగా ఆడనుంది.

## తల్లి మరణించిన బాధలోనూ మ్యాచ్ ఆడిన ముకేశ్ చౌదరి

ముంబయి ఇండియన్స్?పై చెన్నై సూపర్ కింగ్స్ భారీ విజయం సాధించింది. వాంఖడే వేదికగా జరిగిన ఈ మ్యాచ్?లో 103 పరుగుల తేడాతో సీఎస్కే నెగ్గింది. అయితే ఈ మ్యాచ్?లో సెంచరీ బాదిన సంజు శాంసన్?తోపాటు బౌలర్ ముకేశ్ చౌదరి డెడికేషన్? పట్ల ప్రశంసలు కురుస్తున్నాయి. తన తల్లి మరణించిన రెండు రోజులకే బరిలోకి దిగడంపై ముకేశ్?ను విశ్లేషకులు మెచ్చుకుంటున్నారు. దీంతో మ్యాచ్?లో ముకేశ్ స్పెషల్ అట్రాక్షన్?గా మారాడు. ఈ మంగళవారం ముకేశ్ చౌదరి తల్లి దీర్ఘకాలిక అనారోగ్యంతో కన్నుమూశారు. ఆ సమయంలో అతడు హైదరాబాద్?లో సన్?రైజర్స్?తో మ్యాచ్? ఆడుతున్నాడు. ఈ వార్త అందగానే ముకేశ్ మ్యాచ్ అనంతరం హుటాహుటిన తన సొంత గ్రామం రాజస్థాన్‌లోని భిల్వారాకు వెళ్లాడు. అక్కడ బుధవారం తల్లి అంత్యక్రియల కార్యక్రమాలు పూర్తి చేసుకొని అదే రోజు ముంబయితో మ్యాచ్?కు ముందు చెన్నై జట్టుతో కలిశాడు. తల్లి మరణించిన బాధలోనూ జట్టు అవసరాల కోసం వెంటనే బరిలోకి దిగడం అందర్నీ కలచివేసింది. ముకేశ్?కు ముంబయితో మ్యాచ్?లో తుదిజట్టులో చోటు దక్కింది. ఇక దుఃఖంలో ఉన్న ముకేశ్ చౌదరి ఆ ప్రభావాన్ని తన ఆటపై పడనివ్వలేదు. తొలుత బ్యాటింగ్?లో 7 పరుగులు చేశాడు. అనంతరం బౌలింగ్?లో సత్తా చాటాడు. తన తొలి ఓవర్ ఐదో బంతికే ప్రమాదకరమైన క్వింటన్ డికాక్ వికెట్ పడగొట్టాడు. ఈ వికెట్? తీసినప్పుడు ముకేశ్ ఎలాంటి సంబరాలు చేసుకోలేదు. ఆ సమయంలో అతడు కాస్త ఎమోషనల్ అయ్యాడు. నిశ్శబ్దంగా మైదానంలోనే నిలబడ్డాడు. ఆకాశం వైపునకు వేలు చూపిస్తూ 'అమ్మా, ఇది నీ కోసమే' అన్నట్లుగా ఈ వికెట్?ను తన తల్లికి అంకితం ఇచ్చాడు. మ్యాచ్? అనంతరం చెన్నై కెప్టెన్ రుతురాజ్ వ్యాఖ్యలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ విజయం ముకేశ్?కు అంకితం ఇస్తున్నట్లు చెప్పాడు. అటు సీఎస్కే ప్లేయర్లు కూడా ముకేశ్ తల్లికి నివాళిగా ఈ మ్యాచ్?లో నల్ల ఆర్మ్ బ్యాండ్?లు ధరించి బరిలోకి దిగారు. మాజీ క్రికెటర్ అశ్విన్ దీనిపై స్పందించాడు. తల్లి లేని లోటు ఎప్పటికీ మనకు తెలుస్తుందని, తల్లిదండ్రుల ప్రేమను ఈ ప్రపంచంలో మరెవరూ భర్తీ చేయలేరని అన్నాడు. తన ఓ పాడ్?కాస్ట్?లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. 'ముకేశ్? తన తల్లిని కోల్పోయాడు. ఆ దుఃఖం నుంచి కోలుకోవడానికి అతనికి కొంత సమయం కావాలి. అయితే ఇలాంటివి జరిగిన తర్వాత కొన్ని రోజులు ఇంట్లోనే ఉండాలని కొందరు అంటారు. మరికొందరు బయటకు వెళ్లి ఆడాలని చెబుతారు. జనాలు ఎప్పుడూ ఏదో ఒకటి అంటూనే ఉంటారు' 'మన సమాజం ఏ స్థాయికి దిగజారిందో నాకు అర్థం కావడం లేదు. అయితే ఇవన్నీ ఉన్నప్పటికీ, అతను మ్యాచ్ ఆడాలని నిర్ణయించుకున్నాడు. ఈ పరిస్థితుల్లో అతడు మ్యాచ్? ఆడాలనే తన తండ్రి, బంధువులు కోరుకుని ఉంటారని నేను కచ్చితంగా చెప్పగలను. ఎందుకంటే అవకాశాలు మళ్లీ ఎప్పుడు వస్తాయో ఎవరికీ తెలియదు. ఈ రోజు అతను ఆడిన తీరు, బౌలింగ్ చేసిన విధానం, అతడు చూపించిన స్ఫూర్తిని ప్రశంసిస్తున్నా. నాలుగు ఓవర్లలో 30 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు' 'అయితే నిజంగా ముకేశ్ ఈ మ్యాచ్?లో మరిన్ని వికెట్లు తీయాలని నేను దేవుడిని ప్రార్థించాను. మనం ఏ వయసులో ఉన్నా అమ్మ అమ్మనే. ఆమె లేని లోటు ఎప్పటికీ మనకు తెలుస్తుంది. తల్లిదండ్రుల ప్రేమను ఈ ప్రపంచంలో మరెవరూ భర్తీ చేయలేరు' అని అశ్విని అన్నాడు.



## కమలం గూటికి మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్!

ఆమ్ ఆద్మీ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలు సామూహికంగా పార్టీని వీడుతుండటం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, రాఘవ్ చద్దాతో సహా మొత్తం ఏడుగురు ఎంపీలు బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ పరిణామంతో దేశ రాజధాని రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.ఆమ్ ఆద్మీ పార్టీకి రాజ్యసభలో ఉన్న 10 మంది ఎంపీలలో ఏడుగురు ఇప్పుడు బీజేపీ తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధమయ్యారు. రాఘవ్ చద్దా నేతృత్వంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్ ఇప్పటికే బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య నేతలను కలిసి సభ్యత్వం తీసుకోగా.. హర్భజన్ సింగ్ సహా మిగిలిన నలుగురు ఎంపీలు త్వరలోనే కాషాయ కండువా కప్పుకోనున్నారు.గత కొంతకాలంగా ఆమ్ ఆద్మీ పార్టీ అగ్ర నాయకత్వంతో రాఘవ్ చద్దాకు విభేదాలు నడుస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆప్ ఎంపీలైన సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, రాజేంద్ర గుప్తా, స్వాతి మలివాల్, విక్రమ్‌జీత్ సాహ్నీ అందరూ తమ దారిని మార్చుకున్నట్లు స్పష్టం చేశారు. పార్టీలో అంతర్గత పరిస్థితులు సరిగ్గా లేకపోవడమే ఈ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది.భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ 2022 మార్చిలో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. అప్పట్లో పంజాబ్ నుంచి ఆ పార్టీ హర్భజన్ సింగ్‌ను రాజ్యసభకు పంపింది. అయితే గత



కొంతకాలంగా హర్భజన్ సింగ్ రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ.. ప్రస్తుతం ఐపీఎల్ 2026లో వ్యాఖ్యాతగా బిజీగా ఉన్నారు. పార్టీ మార్పుపై ఆయన సోషల్ మీడియాలో ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ.. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్పందిస్తూ.. భజ్జీ తన ఫోన్ కాల్స్‌కు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ బలం గణనీయంగా పడిపోనుంది. 10 మంది సభ్యుల నుంచి కేవలం ముగ్గురు సభ్యులకు ఆ పార్టీ పరిమితం కానుంది. మరోవైపు దేశవ్యాప్తంగా విస్తరించాలని చూస్తున్న ఆప్‌కు ఇది కోలుకోలేని దెబ్బ అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడుగురు ఎంపీల రాకతో ఎగువ సభలో బీజేపీ బలం మరింత పెరగనుంది.

## కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులోకి..

సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు శుభవార్త. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్‌తో కీలక పోరుకు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులోకి రావడం నిజంగా గుడ్ న్యూసే. రేపు(ఏప్రిల్ 25) రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరగబోయే మ్యాచ్ లో తాను బరిలోకి దిగుతున్నానని స్వయంగా ప్యాట్ కమిన్స్ ప్రకటించడం గమనార్హం. ఈ మేరకు కమిన్ ఇన్ స్టాలో పోస్ట్ పెట్టాడు.కమిన్స్ తన ఇన్ స్టాలో పూర్తిస్థాయిలో బౌలింగ్ చేస్తూ కనిపించిన చిత్రాలను పంచుకుంటూ, "చాలా కాలం తర్వాత వస్తున్నాను, రేపు మళ్లీ మైదానంలోకి దిగడానికి ఆతృతగా ఉన్నాను," అని రాశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ కూడా 'వస్తున్నాడు' అంటూ ఎక్స్ వేదికగా కమిన్స్ ఫోటోను షేర్ చేసింది. ఈ సీజన్‌లో తొలి ఏడు మ్యాచ్‌లకు దూరమయ్యాక అతని ఈ ఉత్సాహం స్పష్టమైంది. అతని జట్టు సహచరుడు ట్రావిస్ హెడ్ "ఈ ఏఐ చిత్రాలు రోజురోజుకూ మెరుగుపడుతున్నాయి" అని సరదాగా వ్యాఖ్యానించాడు.కమిన్స్ లేకపోవడంతో ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్‌కు ఐపీఎల్ కెప్టెన్‌గా నాయకత్వం వహించాడు. కాగా, గతేడాది జులై నుంచి వెన్ను గాయంతో బాధపడుతున్న ఈ ఆస్ట్రేలియా ఆటగాడు టీ20 ప్రపంచ కప్‌కు దూరమయ్యాడు. ఆ తర్వాత డిసెంబర్‌లో ఒకే యాషెస్ టెస్టులో మాత్రమే కనిపించాడు. ప్యాట్ కమిన్స్ పేస్ బౌలింగ్, నాయకత్వ సామర్థ్యాలకు ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా, ఈ సుదీర్ఘ విరామం జాతీయ జట్టుకూ, ఫ్రాంచైజీకి ఆందోళన కలిగించింది. మార్చి 27న జట్టుతో చేరినప్పటికీ.. ఏప్రిల్ 4న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్ తర్వాత చివరి వైద్య పరీక్షల కోసం స్వదేశం వెళ్ళాడు.




ఆస్ట్రేలియాలో ఫిట్‌నెస్ పరీక్షను పూర్తి చేసుకుని, ఇప్పుడు సన్‌రైజర్స్ తరపున తిరిగి రంగప్రవేశం చేస్తున్నాడు.సన్‌రైజర్స్ ప్రారంభంలో మొదటి 4 మ్యాచ్‌లలో మూడు ఓడిపోయి.. అనంతరం వరుసగా 3 విజయాలతో పుంజుకున్నారు. అంటే 7 మ్యాచ్ లలో 4 గెలిచి 8 పాయింట్లు, ౦0.820 నెట్ రన్ రేట్‌తో పాయింట్ల పట్టికలో టాప్ ఫోర్‌లోకి దూసుకెళ్లారు.ఢిల్లీ క్యాపిటల్స్‌పై సాధించిన 47 పరుగుల తేడాతో విజయం తర్వాత సన్‌రైజర్స్ ఈ మ్యాచ్‌లోకి వస్తోంది. ఆ మ్యాచ్‌లో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో అభిషేక్ శర్మ అజేయంగా 135 పరుగులు చేసి అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఈ విజయ ఉత్సాహంలో వారు రియాన్ పరాగ్ నాయకత్వంలోని రాజస్థాన్ రాయల్స్‌ను ఎదుర్కోనున్నారు.

# స్పోర్ట్స్




## అభిమానులతో సచిన్ బర్త్ డే సెలబ్రేషన్స్

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ శుక్రవారం (ఏప్రిల్ 24) 53వ పుట్టినరోజు జరుపుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ముంబయిలోని ఆయన నివాసం వద్దకు పెద్ద ఎత్తున అభిమానులు చేరుకున్నారు. సచిన్?కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అభిమానుల సమక్షంలో సచిన్ సచిన్ కేక్ కట్ చేశాడు. ఈ వేడుకలో ఆయన సతీమణి అంజలి కూడా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో సచిన్ వీరాభిమాని సుదీర్ కూడా హాజరయ్యారు. మరోవైపు, సోషల్ మీడియాలో సచిన్‌కు బర్త్ విషెస్ వెల్లువెత్తాయి. ప్రముఖులు, సెలబ్రిటీలు, ప్రస్తుత, మాజీ క్రికెటర్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.సచిన్ కుమారుడు అర్జున్ తెందుల్కర్ తన తండ్రికి శుభాకాంక్షలు చెప్పాడు. అయితే ప్రస్తుతం అర్జున్ ఐపీఎల్ ఆడుతున్నాడు. అతడు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టుతో ఉన్నాడు. దీంతో తండ్రిని స్వయంగా కలువలేకపోయాడు. అందుకే ఆన్‌లైన్‌లోనే తండ్రికి శు భాకాంక్షలు చెప్పాడు. ఈ వీడియోను లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తమ ఎక్స్ అకౌంట్‌లో షేర్ చేసింది.

## ముంబై ఇండియన్స్ ఓటమికి 3 ప్రధాన కారణాలు..

ఐపీఎల్ 2026లో లీగ్ స్టేజీ 33వ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 103 పరుగుల భారీ తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. ముంబైలోని వాంఖడేలో జరిగిన మ్యాచులో మొదట బ్యాటింగ్‌కు దిగిన సీఎస్కే 207 పరుగులు చేసింది. ఈ వేదికలో ఈ టార్గెట్ ఛేదించడం అంత కష్టమేమీ కాకపోయినప్పటికీ, ముంబై ఇండియన్స్ కేవలం 104 పరుగులకే ఆలౌట్ అయింది. ఐపీఎల్ చరిత్రలో పరుగుల పరంగా ముంబైకి ఇది అతిపెద్ద ఓటమి కాగా, మరోవైపు చెన్నైకి అతిపెద్ద విజయం కావడం విశేషం. జస్‌ప్రీత్ బుమ్రా తొలి పవర్ ప్లేలో వికెట్లు తీయలేకపోయాడు. ఆ తర్వాత కెప్టెన్ హార్దిక్ పాండ్యా బౌలింగ్‌కు వచ్చినప్పటికీ భారీగా పరుగులు ఇచ్చుకున్నాడు. హార్దిక్ పాండ్యా తన 2 ఓవర్లలో 38 పరుగులు ఇచ్చాడు. గత మ్యాచులలో సైతం హార్దిక్ అన్ని విభాగాల్లో నిరాశపరుస్తున్నాడు. వాంఖడే పిచ్ బ్యాటర్లకు అనుకూలం. దీనిని సంజు శాంసన్ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని అద్భుత సెంచరీ బాదాడు. సంజూ శాంసన్‌ను అవుట్ చేయడానికి ముంబై బౌలర్ల వద్ద ఎటువంటి వ్యూహం కనిపించలేదు. స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ ప్రభావం చూపలేకపోయాడు. శాంట్నర్ 4 ఓవర్లలో 11 ఎకానమీతో 44 పరుగులు ఇచ్చాడు.ముంబై ఇండియన్స్ ఘోర పరాజయానికి హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ వైఫల్యం కూడా ఒక కారణం. ప్రధాన బౌలర్ల కంటే ముందే తనకు తాను ప్రాధాన్యత ఇచ్చుకోవడం ముంబై కొంపముంచింది. గత మ్యాచ్‌లలో కూడా అతడి బౌలింగ్ వల్ల ఎలాంటి ప్రయోజనం కలగలేదు. తాను ఒక బ్యాటింగ్ ఆల్ రౌండర్ అని, తన ప్రాధాన్యత బ్యాటింగ్ మీద ఉండాలని హార్దిక్ అర్థం చేసుకోలేకపోతున్నాడు. పాండ్యా బౌలింగ్‌లో 38 పరుగులు ఇవ్వగా, బ్యాటింగ్‌లో కేవలం 1 పరుగు మాత్రమే చేశాడు. ముంబై జట్టులో ఇద్దరు ప్రధాన బ్యాటర్లు డకౌట్ కావడం దెబ్బతీసింది. వాంఖడేలో రెండో ఇన్నింగ్స్ సమయంలో మంచు ప్రభావం చూపింది. అటువంటి పరిస్థితుల్లో 208 పరుగుల లక్ష్యం ముంబైకి పెద్ద విషయం కాదు. కానీ ముంబై జట్టు 104 పరుగులకే ఆలౌట్ అయింది. డానిష్ మలేవర్ తన ఓవర్ తొలి బంతికే అకీల్ హొస్సేన్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. తర్వాతి ఓవర్లో క్వింటన్ డికాక్ ముఖేష్ చౌదరి బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. తల్లి చనిపోయినా ఆట పట్ల నిబద్ధతను చాటుతూ ముఖేష్ చౌదరి ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నాడు. 11 పరుగుల వద్ద ముంబైకి మరో దెబ్బ తగిలింది. మరో బ్యాటర్ నమన్ ధీర్ కూడా అకీల్ హొస్సేన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. 200కు పైగా టార్గెట్ ఛేదించే క్రమంలో మంచి ఆరంభం కావాలి. కానీ ముంబై జట్టులో అలా జరగకపోవడం ఓటమికి ప్రధాన కారణమైంది. సూర్యకుమార్ యాదవ్ (36), తిలక్ వర్మ (37) నాలుగో వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరు ఔటయ్యాక ముంబై జట్టు పేకమేడలా కూలిపోయింది. 84 పరుగుల వద్ద నాలుగో వికెట్ పడగా, 104 పరుగుల వద్ద 10వ వికెట్ కోల్పోయింది ముంబై. అంటే కేవలం 20 పరుగుల వ్యవధిలో పటిష్ట ముంబై జట్టు 7 వికెట్లు కోల్పోయింది. హార్దిక్ పాండ్యా (1), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (0), శార్దూల్ ఠాకూర్ (6) విఫలమయ్యారు. సీఎస్కే బౌలర్లు అకీల్ హొస్సేన్ 4 ఓవర్లలో 17 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీయగా, నూర్ అహ్మద్ 2 వికెట్లు సాధించాడు. వాంఖడే చరిత్రలో తొలిసారిగా ఒకే మ్యాచ్‌లో స్పిన్నర్లు 9 వికెట్లు తీశారు.

విశ్వేజి



## ప్రతీ దానికి టెన్షన్ పడుతున్నారా? అయితే ఈ జబ్బులు గ్యారెంటీ

టెన్షన్.. ఇప్పుడు చాలామంది జీవితాల్లో దీనిని తగ్గించడం కష్టంగా మారిపోయింది. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, విపరీతమైన పని ఒత్తిడి వెరసి టెన్షన్ అందరి జీవితాల్లోనూ భాగంగా మారింది. ఇక బాగా టెన్షన్ పడితే అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎంత పని ఒత్తిడి ఉన్నప్పటికీ టెన్షన్‌ను తగ్గించుకోవాలని ప్రశాంతంగా బ్రతకడం అలవాటు చేసుకోవాలని చెబుతున్నారు. టెన్షన్‌తో హైబీపీ టెన్షన్ తో చేయాల్సిన పనులు సరిగ్గా చేయకపోగా, అనవసరమైన రిస్కులు పడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. బాగా టెన్షన్ పడితే హైబీపీ వచ్చే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. హైబీపీ మన శరీరంలోని ధమనుల గోడల పైన ఒత్తిడిని పెంచి మనకు గుండెపోటు, మరియు మూత్రపిండాల వ్యాధులు రావడానికి కారణమవుతుందని అందుకే టెన్షన్‌ను తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. టెన్షన్ తో గుండెజబ్బులు, మధుమేహం టెన్షన్ ఎక్కువగా ఉన్నవారిలో గుండె పనితీరు దెబ్బతింటుంది. ఇది గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. బాగా టెన్షన్ పడే వారిలో డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. విపరీతమైన ఒత్తిడి ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గించి, రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచుతుంది. దీనివల్ల మధుమేహం బారిన పడే అవకాశం ఉంది. టెన్షన్ తో జీర్ణ సమస్యలు, నిద్రలేమి టెన్షన్ జీర్ణ వ్యవస్థను దెబ్బతీస్తుంది. దీంతో అజీర్ణం, మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. విపరీతమైన టెన్షన్ తలనొప్పికి కూడా కారణమవుతుంది. టెన్షన్ కారణంగా నిద్ర స్థాయి కూడా తగ్గుతుంది. నిద్రలేమి సమస్య పెరుగుతుంది. ఫలితంగా శారీరక, మానసిక ఆరోగ్యం పైన ప్రతికూల ప్రభావం పడుతుంది. రోగ నిరోధక శక్తి పెంచుకోవాలంటే ఇవి తినండి! టెన్షన్ తో మానసిక, శారీరక సమస్యలు ఇక ఎక్కువ కాలం పాటు టెన్షన్ పడుతూ ఉండడం ఒక రకమైన ఆందోళనకు, డిప్రెషన్ కు కారణమవుతుంది. మానసిక రుగ్మతలకు కారణంగా మారుతుంది. ఎన్నో అనర్థాలు కలిగించే టెన్షన్ ను పక్కన పెట్టి ప్రశాంతంగా జీవించడం ఉత్తమం. ప్రశాంతంగా ఉన్న వారికి ఎటువంటి రోగాలు వచ్చే అవకాశం లేదు. అందుకే టెన్షన్ తగ్గించుకోవటానికి యోగా, మెడిటేషన్ వంటివి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

### మామిడిపండు తిన్న తర్వాత ఇవి తినొద్దు,

# ఈ పనులు అసలే చెయ్యొద్దు!



సమ్మర్ సీజన్లో అందరికీ ఇష్టమయ్యే పండ్ల రారాజు మామిడిపండు ఇప్పటికే మార్కెట్లోకి వచ్చింది. మామిడి పండ్లను చూస్తే ఎవరికైనా నోరూరుతుంది. మామిడి పండ్లు తినాలని అనుకోని వారు ఎవరు ఉండరు. మామిడిపండు రుచికి మాత్రమే కాదు, బోలెడన్ని పోషకాలతో మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయి. మామిడి పండ్లలో విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ ఏ, ఫైబర్, ఆంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. మామిడి పండ్లు తింటున్నారా? అంతేకాదు మన జీర్ణక్రియను మెరుగుపరిచే, పేగు ఆరోగ్యాన్ని ప్రోత్సహించే ఎంజైములు కూడా మామిడి పండ్లలో పుష్కలంగా ఉంటాయి. ఇక అటువంటి మామిడి పండ్లను తింటున్న వారు మామిడి పండ్లు తిన్న తర్వాత కొన్ని ఆహార పదార్థాలను తినకుండా ఉంటేనే మంచిది. ఒకవేళ పొరపాటున తింటే అనవసరమైన అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. మామిడి పండ్లు తిన్నాక ఇవి అసలే తినొద్దు మామిడిపండు తిన్న తర్వాత కొన్ని రకాల ఆహార పదార్థాలను తినకూడదు. మామిడి పండ్లతో పాల పదార్థాలను తీసుకోకుండా ఉంటేనే మంచిది. పాలు, పెరుగు, మజ్జిగ, శీతల పానీయాలు, మామిడి స్మూతీలు వంటివి తీసుకోకూడదు. మామిడి పండ్లను తిన్న తర్వాత వీటిని తీసుకుంటే జీర్ణక్రియకు ఆటంకం కలుగుతుంది. ఇవి జీర్ణక్రియను నిదానింపజేసి జీర్ణ సంబంధిత సమస్యలకు కారణమవుతాయి. ఇక మామిడి పండ్లను తినేవారు మామిడి పండ్లతో చీజ్ తినడం మంచిది కాదు. మామిడి పండు తిన్న తర్వాత ఇవి చేస్తే అనారోగ్య సమస్యలు మామిడిపండు తిన్న తర్వాత బాగా వేడిగా ఉండే ఆహారాన్ని కానీ మసాలాతో చేసిన ఆహారాన్ని కానీ తినకూడదు. మామిడిపండు తిన్న తర్వాత మళ్లీ ఇతర పండ్లను తినడం వల్ల జీర్ణ సమస్యలు గ్యాస్ లేదా అజీర్ణ సమస్యలు వస్తాయి. ఇక మామిడిపండు తిన్న తర్వాత వెంటనే నిద్రపోతే కూడా జీర్ణక్రియలో ఇబ్బందులు వస్తాయి. తిన్న తర్వాత నిద్రకు ముందు ఒక అరగంట సమయమైనా గ్యాప్ ఉండాలి. రోగ నిరోధక శక్తి పెంచుకోవాలంటే ఇవి తినండి! మామిడి పండు తిన్నాక అనారోగ్య బారిన పడకుండా ఇవి చెయ్యండి ఇక మామిడిపండు తిన్న తర్వాత 30 నిమిషాల నుండి ఒక గంట వరకు కొన్ని పనులు చేయకుండా ఉంటేనే మంచిది. మామిడి పండు తిన్న తర్వాత బరువులు ఎత్తడం, శారీరక వ్యాయామాలు చేయడం వంటిది మంచిది కాదు. ఇక మామిడి పండు తినాలి అనుకునేవారు చేయకూడని పనులు, మామిడి పండు తిన్న తర్వాత తినకూడని పదార్థాలను ఖచ్చితంగా తెలుసుకుంటే అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

# తీపి తిన్నా నో టెన్షన్..ఈ 7 డ్రై ఫ్రూట్స్ తింటే షుగర్ పెరగదు!



ప్రస్తుతం భారతదేశంలో చాలామందిని వేధిస్తున్న అతిపెద్ద సమస్య డయాబెటిస్. దీనిని షుగర్ వ్యాధి అని, మధుమేహం అని కూడా అంటారు. ప్రస్తుతం మనదేశంలో దాదాపు 9 కోట్లమంది షుగర్ పేషెంట్లు ఉన్నారు. అందుకే మనదేశాన్ని వరల్డ్ డయాబెటిస్ క్యాపిటల్ అని కూడా పిలుస్తుంటారు. అయితే మీరు కూడా డయాబెటిస్ లేదా ప్రీ-డయాబెటిస్‌తో బాధపడుతున్నారా? రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడం మీకు పెద్ద సవాలుగా ఉందా? తీపి పదార్థాలు అంటేనే భయపడుతున్నారా? అయితే మీకో గుడ్ న్యూస్. కొన్ని డ్రై ఫ్రూట్స్ రక్తంలో షుగర్ లెవల్స్ ని స్థిరీకరించడంలో సహాయపడతాయి. చాలా డ్రై ఫ్రూట్స్‌లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. వీటిని తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా, స్థిరంగా పెరుగుతాయి. సరైన మోతాదులో తీసుకుంటే, ఆరోగ్యకరమైన ఆహారంతో కలిపి తింటే ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను మెరుగుపరచడంలో సహాయపడతాయి. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ తెలిపిన ప్రకారం.. గింజలు, విత్తనాలు వంటి ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను మీ డైట్ లో చేర్చుకోవడం వల్ల గ్లైసెమిక్ నియంత్రణలో గణనీయమైన మెరుగుదల ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా అదుపులో ఉంచడానికి సహాయపడే ఆ అద్భుతమైన డ్రై ఫ్రూట్స్ ఏవో ఇక్కడ చూడండి. రక్తంలో షుగర్ లెవల్స్ ని తగ్గించే డ్రై ఫ్రూట్స్ పిస్తా వాస్తవానికి పిస్తాపప్పులను రెగ్యులర్ గా తినడం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ తగ్గుతాయని అనేక పరిశోధనల్లో తేలింది. సమతుల్య ఆహారంలో పిస్తాపప్పులను చేర్చుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ తగ్గుతుందని, ఇన్సులిన్ స్థాయిలు మెరుగుపడతాయని ఓ అధ్యయనంలో తేలింది. వాల్ నట్స్ ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే వాల్ నట్స్.. ఇన్సులిన్ నిరోధకతకు ప్రధాన కారణమైన వాపును తగ్గిస్తాయి. వీటి కూడా తక్కువగా ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలోనూ ఇవి ముందుంటాయి, ఇది షుగర్ వ్యాధి ఉన్నవారికి చాలా ముఖ్యం. మహిళలకు గుండెపోటు వచ్చే ప్రమాదం ఏ వయస్సులో ఎక్కువ ఉంటుందో తెలుసా? ఎండుద్రాక్ష ఎండుద్రాక్షలో సహజ చక్కెరలు ఎక్కువగా ఉన్నప్పటికీ వాటిలో ఫైబర్, ఫైటోకెమికల్స్ ఉంటాయి. ఇవి గ్లూకోజ్ జీవక్రియకు సపోర్ట్ చేస్తాయి. పరిశోధనల ప్రకారం ఎండుద్రాక్షలను మితంగా తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు గణనీయంగా పెరగవు. బాదం బాదంలో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, ఫైబర్ మాత్రం పుష్కలంగా ఉంటాయి. పలు అధ్యయనాల ప్రకారం బాదంపప్పు.. భోజనం తర్వాత రక్తంలో చక్కెర పెరగకుండా అడ్డుకుంటుంది. అంతేకాకుండా బాదంని దీర్ఘకాలికంగా తీసుకుంటే ఇన్సులిన్ సెన్సిటివిటీ కూడా మెరుగుపడుతుందని అధ్యయనాల్లో తేలింది. షుగర్ వ్యాధి ఉన్నవారికి చాలా ముఖ్యం. జీడిపప్పు ఇతర గింజలతో పోలిస్తే జీడిపప్పులో కొంచెం ఎక్కువ కార్బోహైడ్రేట్లు ఉన్నప్పటికీ..వీటిలో ఉండే మెగ్నీషియం, మోనోశాచురేటెడ్ కొవ్వులు మితంగా తీసుకుంటే రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడతాయి. కాబట్టి జీడిపప్పుని కొద్దిగానే తినాలి. ఎవరినైనా టచ్ చేస్తే 'టక్కు' మని షాక్ కొడుతుందా? అసలు రహస్యం ఇదే ఖర్జూరం సాధారణంగా ఖర్జూరాలు తీపిగా ఉంటాయి కానీ వాటి మీడియంగా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉంటుంది. ఒకసారికి 1-2 ఖర్జూరాలు వంటి చిన్న మొత్తంలో తింటే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా శక్తిని, పోషకాలను అందిస్తాయి. వీటిని గింజలతో కలిపి తీసుకోవడం వల్ల మరింత ప్రయోజనం ఉంటుంది. అంజీర్ ఎండిన అంజీర్ పండ్లు ఫైబర్ గొప్ప మూలం. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. వీటిలో యాంటీఆక్సిడెంట్లు, ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచే సహజ సమ్మేళనాలు కూడా ఉంటాయి. వీటిని కూడా తక్కువగానే తినాలి. డయాబెటిస్ ఉన్నవారు రోజుకు 1-2 ముక్కలు తీసుకోవడం సురక్షితం అని నిపుణులు చెబుతున్నారు.

మార్కెట్


## గోల్డ్ రివర్స్‌గేర్.. దిగివస్తున్న బంగారం ధరలు

న్యూఢిల్లీ : బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. ఒకవైపు వాణిజ్య యుద్ధం మరింత తీవ్రతరమవుతుండటంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను వెనక్కితీసుకుంటుండటంతో ఈక్విటీలతోపాటు అతి విలువైన లోహాలు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంట్లోభాగంగా దేశ రాజధాని న్యూఢిల్లీలో పదిగ్రాముల బంగారం ధర రూ.1,050 తగ్గింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.91,250కి దిగొచ్చింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర అంతే తగ్గి రూ.89,750కి దిగొచ్చింది. పసిడితోపాటు వెండి ధరలు కూడా తగ్గాయి. కిలో వెండి రూ.500 తగ్గి రూ.93,200కి దిగొచ్చింది. కానీ, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 61.98 డాలర్లు ఎగబాకి 3,044.14 డాలర్లకు ఎగబాకగా, వెండి 2 శాతం అధికమై 30.41 డాలర్లకు చేరుకున్నది. అమెరికా-చైనా దేశాల మధ్య సుంకాల యుద్ధం మరింత ముదురుతుండటంతో పెట్టుబడిదారులు వేచి చూసేధోరణి అవలంభిస్తున్నారని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. మరోవైపు, యూఎస్ ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ విడుదల చేయబోయే మినిట్స్, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై విశ్లేషకులు దృష్టి సారించారని చెప్పారు.



### గృహ, వాహన రుణాలు చౌక..

# అన్నిరకాల లోన్లపై తగ్గనున్న ఈఎంఐ భారం!




### మరింత దిగొచ్చిన కీలక వడ్డీరేట్లు

**రెపోరేటు పావుశాతం తగ్గి 6 శాతానికి**

**వృద్ధిరేటు అంచనా డౌన్.. ఈసారి 6.5%**

ముంబై : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వరుసగా రెండో ద్రవ్యసమీక్షలోనూ కీలక వడ్డీరేట్లను తగ్గించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను చేపట్టిన తొలి ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోరేటును మరో పావుశాతం (25 బేసిస్ పాయింట్లు) కోత పెట్టినట్టు బుధవారం ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. దీంతో 6.25 శాతం నుంచి 6 శాతానికి వచ్చింది. ఇప్పటికే ఈ ఏడాది ఫిబ్రవరి ద్రవ్యసమీక్షలో దాదాపు ఐదేండ్ల తర్వాత రెపోరేటును తొలిసారి పావుశాతం (6.5 శాతం నుంచి 6.25 శాతానికి) తగ్గించిన విషయం తెలిసిందే. 2020 మే తర్వాత ఈ ఫిబ్రవరిలోనే తగ్గించారు. ఈ క్రమంలో తాజా తగ్గింపు అరశాతానికి చేర్చగా.. గృహ, వాహన, వ్యక్తిగత రుణగ్రహీతలకు మరింత లబ్ధి చేకూర్చినైట్టెంది. ఈఎంఐల భారం ఇంకొంత దిగనున్నది మరి.

మున్ముందు మరిన్ని కోతలు

ఆర్బీఐ తమ ద్రవ్యవిధాన వైఖరిని 'న్యూట్రల్' నుంచి 'ఎకామ్డేటివ్'కు మార్చుకున్నది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు స్థిరంగా లేదా తగ్గడమో జరుగనున్నాయి. సోమవారం నుంచి బుధవారం వరకు 3 రోజులపాటు ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా నేతృత్వంలో జరిగిన ద్రవ్యసమీక్షలో ఎంపీసీలోని మొత్తం ఆరుగురు సభ్యులూ రెపోరేటు తగ్గింపునకే ఓటేశారు. ఫలితంగా రెపోరేటుకు అనుసంధానమైన అన్ని ఈబీఎల్ఆర్ దిగిరానున్నాయి. రుణాల ఈఎంఐల భారం కూడా తగ్గనున్నదని బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి. పీ2ఎం పేమెంట్స్‌కు జోష్.. పర్సన్-టు-మర్చంట్ పేమెంట్స్ (పీ2ఎం) కోసం యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)లో లావాదేవీల పరిమితిని పెంచేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు ఆర్బీఐ అనుమతిచ్చింది. ప్రస్తుతం పీ2ఎంతోపాటు పర్సన్-టు-పర్సన్ (పీ2పీ) పేమెంట్స్‌కు యూపీఐ ద్వారా లక్ష రూపాయల లావాదేవీకే అనుమతి ఉన్నది. అయితే కొన్ని సందర్భాల్లో పీ2ఎం పేమెంట్స్‌ను రూ.2 లక్షలు, రూ.5 లక్షలదాకా చేసుకోవచ్చు.

4 శాతంగా ద్రవ్యోల్బణం

ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) ద్రవ్యోల్బణం 4 శాతానికి దిగిరావచ్చన్న ఆశాభావాన్ని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వ్యక్తం చేశారు. మునుపు దీన్ని 4.2 శాతంగా అంచనా వేసిన విషయం తెలిసిందే. దేశంలో వ్యవసాయోత్పత్తి బాగుందని, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయన్న ఆయన పరిస్థితులు ఇలాగే ఉంటే అన్నింటి ధరలు కూడా తగ్గుతాయన్న విశ్వాసాన్ని కనబర్చారు. కూరగాయల ధరలు దిద్దుబాటుకు లోనవుతుండటంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 21 నెలల కనిష్టాన్ని తాకుతూ 3.8 శాతానికి చేరిన సంగతి విదితమే. ఫలితంగా ఆహార ద్రవ్యోల్బణం గణాంకాలు సైతం కిందకొస్తున్నాయి.

వృద్ధి అంచనాకు కత్తెర

దేశ జీడీపీ వృద్ధిరేటుకు ఆర్బీఐ కోత పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) 6.5 శాతానికే పరిమితం కావచ్చని అంచనా వేసింది. మునుపు ఇది 6.7 శాతం గా ఉండటం విశేషం. అంతర్జాతీయ వాణిజ్యంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు, విధానాల్లో అనిశ్చితి వల్లే ఆర్థిక వృద్ధి 0.2 శాతం మేర తగ్గవచ్చని అంచనా వేసినట్టు మల్హోత్రా తెలిపారు. వ్యవసాయ రంగం ఆశాజనకంగా కనిపిస్తున్నదని, తయారీ రంగం కోలుకుంటున్న సంకేతాలున్నాయని, సేవా రంగం స్థితిస్థాపకతను ప్రదర్శిస్తున్నదని చెప్తూనే.. టారిఫ్ వార్ దెబ్బకు భారతీయ వాణిజ్య ఎగుమతులు పడిపోవచ్చన్న ఆందోళనను వెలిబుచ్చారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇబ్బందికరమేనని హెచ్చరించడం గమనార్హం. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంగా దేశ ఆర్థిక వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చన్న మల్హోత్రా.. తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 6.5 శాతం, రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో 6.7 శాతం, మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో 6.6 శాతం, నాల్గో త్రైమాసికం (జనవరి-మార్చి)లో 6.3 శాతంగా అంచనా వేశారు.

# ఆంధ్రప్రదేశ్

## అమరావతిపై అక్కసు వెళ్లగక్కేవారితో ఏం పని

### జగన్ పార్టీని పట్టించుకోవాల్సిన పనిలేదు

### మంత్రి గుమ్మడి సంధ్యారాణి విమర్శలు

అమరావతి,ఏప్రిల్24 : అమ్మ, అమరావతి, ఆంధ్రప్రదేశ్ అంటే ఇష్టం లేని వారిని ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సమాధానం చెప్పాల్సిన అవసరమూ ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఈ మేరకు మాజీ సీఎం జగన్ రెడ్డిపై మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ రాజకీయం చేయాలనుకుంటే.. ముందు ఇంటిని చక్కబెట్టుకోవాలని హితవుపలికారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసీపీ నేతలకు అసూయ ఎక్కువై, కడుపుమంటతో మొసలి కన్నీరు కారుస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసింది.. చేసేది తామే అని మంత్రి స్పష్టం చేశారు. ఒక్క అవకాశం ఇస్తే ఉత్తరాంధ్రను, విశాఖను కబ్జా చేసి, ఎవరూ బతకలేకుండా ఆస్తులు లాక్కున్నారని ఆరోపించారు. విశాఖ వాసుల మంచితనాన్ని దౌర్జన్యంగా దోచుకున్నారని అన్నారు. రుషికొండను బోడికొండను చేయటంతో పాటు స్టీల్ ప్లాంట్‌ను మూసివేయించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారాలు, వ్యవహారాలను సర్వనాశనం చేసిన వారు ఇప్పుడు ఉత్తరాంధ్ర మంచి చెడుల గురించి మాట్లాడటానికి సిగ్గుపడాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక స్టీల్ ప్లాంట్‌ను తిరిగి ఓపెన్ చేయించామని మంత్రి సంధ్యారాణి అన్నారు. సీఎం చంద్రబాబు, లోకేశ్ కృషితో ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ సంస్థ ఏపీకి వచ్చిందన్నారు. అర్సెల్లార్ మిట్టల్‌తో పాటు ఎన్నో ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉత్తరాంధ్రకు క్యూ కడుతున్నాయని తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్ల పండుగను కూటమి ప్రభుత్వం ఉందనే ధైర్యంతో సగర్వంగా జరుపుకుంటోందన్నారు. వైసీపీ హయాంలో పార్టీ మీటింగ్‌లు పెడతారని వీసీలు కూడా భయపడిపోయారని సంధ్యారాణి పేర్కొన్నారు.

## విద్యుత్ శాఖను విధ్వంసం చేసిన వైసిపి

### తొమ్మిదిసార్లు ఛార్జీలు పెంచి భారం మోపారు

### 18మందికి మంత్రి కారుణ్య నియామకాలు అందచేత

తిరుపతి,ఏప్రిల్24 : లాభాల్లోని విద్యుత్ శాఖను వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసం చేశారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు.. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలను పెంచి.. ప్రజలతో కట్టించిన వైసీపీకి విద్యుత్ కొనుగోళ్లపై మాట్లాడే నైతిక హక్కు లేదని రవికుమార్ విమర్శించారు. ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో 18 మందికి కారుణ్య నియామక పత్రాలను సీఎండీ శివశంకర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇప్పటివరకు విద్యుత్ శాఖలో 500కుపైగా కారు ణ్య నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతోనే ఈ నియామకాలు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పా రు. త్వరలోనే ఏఈ స్థాయిలో శాఖాపరమైన నియామకాలు చేపడతామని స్పష్టం చేశారు. పరిశ్రమల రాకతో విద్యుత్ డిమాండు కూడా గణనీయంగా పెరిగిందన్నారు. డిమాండుకు తగినట్టుగా విద్యుత్ శాఖ కూడా రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి నమోదు చేస్తోందని వివరించారు. డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్ ఖాన్, కె.రామ మోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఎన్.శోభా వాలెంటీనా, కె.ఆదిశేషయ్య, ఎస్.రమణ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.జనార్దన్ నాయుడు, జాయింట్ సెక్రటరీ ఎం.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత

### శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లకుండా అడ్డంకులు

### పోలీసుల తీరుపై మండిపడ్డ ఆర్టీసీ కార్మికులు

### డిపోకు తీసుకెళితే నష్టమేంటని బండి సంజయ్ ప్రశ్న

వరంగల్,ఏప్రిల్24 : వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లేందుకు కార్మికులు యత్నించారు. నర్సంపేట డిపో వద్ద మృతదేహానికి నివాళులర్పిస్తామని చెప్పారు. అందుకు పోలీసులు అంగీకరించలేదు. మృతదేహాన్ని తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. శంకర్‌గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో శంకర్ గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోనకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి యత్నించారు. దీంతో పోలీసులను వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తుండగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సహా బీఆర్ఎస్ నాయకులు, కార్మికులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట డిపోకు తీసుకెళ్లకుంటే శంకర్ గౌడ్ ఆత్మ శాంతించదని అన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకి శంకర్‌గౌడ్ మృతదేహాన్ని తరలించేదాకా కదిలేది లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. శంకర్‌గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తీసుకెళితే అభ్యంతరం ఏంటని పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు అనవసరంగా అడ్డుకుని ఎందుకు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ డిపోకు తరలించాలని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ఆయనను కడసారిగా చూసి నివాళి అర్పిస్తే నష్టమేంటన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కి వరంగల్ పోలీస్ కమిషనర్ ఫోన్ చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలను వివరించారు. అయితే శంకర్‌గౌడ్ కుటుంబ సభ్యులు, ఆర్టీసీ కార్మికుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలన్న కేంద్ర మంత్రి సూచించారు. 22 ఏళ్లపాటు నర్సంపేట ఆర్టీసీ డిపోలో శంకర్‌గౌడ్ సేవలందించారని, అక్కడికి తీసుకెళితేనే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుందని ఆర్టీసీ కార్మికులు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## శంకర్ గౌడ్ మృతి విషాదకరం

### మాజీమంత్రి హరీష్ రావు ఆవేదన

హైదరాబాద్ : ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. శంకర్ గౌడ్ ఆత్మ బలిదానం తీవ్రంగా కలిచివేసిందంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మాజీ మంత్రి పోస్ట్ చేశారు. శంకర్ గౌడ్ మృతికి సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత అని అన్నారు. శంకర్ గౌడ్ అమరుడైన రోజును 'అపాయింటెడ్ డే'గా ప్రకటించాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. 'ఆర్టీసీ కార్మిక సోదరుడు శంకర్ గౌడ్ ఆత్మబలిదానం మా హృదయాలను తీవ్రంగా కలిచివేసింది. సంస్థను కాపాడేందుకు, కార్మికుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్‌కు మా ఘన నివాళులు. హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలి తప్ప, ఇలాంటి ఆత్మబలిదానాలకు ఎవరూ ఒడిగట్టవద్దని హృదయపూర్వకంగా మనవి చేస్తున్నాం. శంకర్ గౌడ్ మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే బాధ్యత. ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చింది. అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని, ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పడం వల్లనే ఈ దుస్థితి.

# మహిళా బిల్లుపై అసెంబ్లీలో చర్చ

### వ్యతిరేకించిన పార్టీల తీరును ఎండగతాం

### ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్



అమరావతి : చట్టసభల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుపై ఇండియా కూటమి వైఖరిని ప్రజలకు ముఖ్యంగా మహిళలకు వివరించాలని ఎన్డీయే కూటమిలోని పార్టీల నేతలకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలో ఎన్డీయే నేతలు, ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీతోపాటు ఇతర భాగస్వామ్య పక్షాల వైఖరిని ప్రజలకు వివరించాలని సీఎం చంద్రబాబును పీవీఎన్ మాధవ్ కోరారు. అందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. రాబోయే 10 రోజుల్లో ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ సమావేశాల వేదికగా 'ఈ అంశం' పై చర్చిద్దామన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ మినహా అన్ని పక్షాలు సమర్థించాయని ఆయన గుర్తు చేశారు. మహిళ రిజర్వేషన్ బిల్లును మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని వివరించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోదీ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒక కమిటీని నియమించినట్లు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జనసేన పార్టీ నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కమిటీలో ఉంటారని పేర్కొన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ఇప్పటికే నిడదవోలులో నిరసన ర్యాలీ నిర్వహించిన విషయాన్ని పీవీఎన్ మాధవ్ ప్రస్తావించారు. ప్రతి ఎమ్మెల్యే.. తన అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రెస్ మీట్ పెట్టి ఈ అంశాన్ని వివరించాలని నేతలకు సూచించారు. అదే విధంగా త్వరలో ఆ అంశాన్ని ప్రజలకు వివరించేందుకు మూడు ప్రాంతాలు.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో బహిరంగ సభలు ఏర్పాటు చేయాలని ఈ టెలి కాన్ఫరెన్స్‌లో కూటమి నేతలు నిర్ణయించారు.

## ఏపిలో ఠారెత్తిస్తున్న ఎండలు

### భానుడి భగభగలతో జనం బెంబేలు

### మరితం ఉష్ణోగ్రతలు పెరుగుతాయన్న ప్రఖర్ జైన్

విజయవాడ,ఏప్రిల్2 : ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. భానుడు భగభగలాడు తున్నాడు. ఏపీవ్యాప్తంగా ఎండల తీవ్రత రికార్డు స్థాయిలో నమోదవుతోంది. ఎండ తీవ్రతకు తోడు ఉక్కపోతతో జనం అల్లాడిపోతుండగా, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తాజాగా మరో హెచ్చరిక జారీ చేశారు. రాబోయే 24 గంటల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో గాలిలో వేడి పెరిగి తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటేశాయి. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో అత్యధికంగా 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు. కర్నూలు జిల్లాలో 43.7 డిగ్రీల నమోదైందని చెప్పారు. రాష్ట్రంలోని సుమారు 207 మండలాల్లో ఉష్ణోగ్రతలు 41కంటే ఎక్కువగా నమోదయ్యాయని వెల్లడించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని, లోతట్టు జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఈ ఏడాది ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు ఇచ్చే హెచ్చరికలను గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రఖర్ జైన్ ఈ జాగ్రత్తలు పాటించాలని కోరారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం ఉత్తమమని తెలిపారు. దాహం వేయకపోయినా తరచుగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాని సూచించారు.లేత రంగు గల నూలు దుస్తులు ధరించాలని అన్నారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ లేదా తలకు రుమాలు కట్టుకోవాలని చెప్పారు. వడదెబ్బ తగిలినట్లు అనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. పిల్లలు, వృద్ధులపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటంతో వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

## హ్యూమన్ ట్రాఫికింగ్‌పై ప్రజల్లో అవగాహన

### సోషలో మీడియా ద్వారా యువత టార్గెట్

### మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ

విజయవాడ,ఏప్రిల్24 : ఆంధ్రప్రదేశ్‌లో మనుషుల అక్రమ రవాణా పై అవగాహన పెంచేందుకు ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ కీలక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో శైలజ నేతృత్వంలో రైల్వే పోలీసులతో కలిసి విజయవాడలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫికింగ్‌పై ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు, గుర్తింపు విధానాలపై కూడా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే డివిజనల్ అధికారులతో కలిసి పనిచేస్తున్నామని, ముఖ్యంగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాయపాటి శైలజ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తమిళనాడుకు చెందిన పీఎం నాయక్ హాజరయ్యారని పేర్కొన్నారు. ట్రాఫికింగ్ అంటే.. ఒకే రకమైన నేరం కాదని, ఇది అనేక రూపాల్లో జరుగుతుందని రాయపాటి శైలజ వ్యాఖ్యానించారు. విద్యార్థులను విదేశాలకు పంపిస్తామని చెప్పి మోసం చేస్తున్నారని తెలిపారు. పలు మార్గాల్లో ట్రాఫికింగ్ జరుగుతుంతోందని వెల్లడించారు. ముఖ్యంగా, బాధితులను గుర్తించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ట్రాఫికింగ్ మాఫియా తమ విధానాలను మార్చుకుంటున్నాయని, సోషల్ మీడియా ద్వారా కూడా యువతను టార్గెట్ చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా బీటెక్ చదువుతున్న విద్యార్థులను విదేశాలకు తీసుకెళ్లి, వారిని సైబర్ నేరాల్లో పాల్గొనేలా చేస్తున్నారన్నారు. ఇది సాధారణంగా కనిపించని కొత్త రకం ట్రాఫికింగ్ అని, దీనిపై ప్రత్యేక అవగాహన అవసరమని తెలిపారు. ట్రాఫికింగ్ బాధితులను గుర్తించడం మాత్రమే కాకుండా, వారిని సైకలాజికల్‌గా ఎలా డీల్ చేయాలో కూడా ఈ కార్యక్రమంలో వివరించామని రాయపాటి శైలజ పేర్కొన్నారు. బాధితులు మానసికంగా చాలా ఒత్తిడిలో ఉంటారని, అందుకే వారికి సహాయం చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా విశాఖపట్నంలో రోబోటిక్ సిస్టమ్ ద్వారా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది భవిష్యత్తులో ట్రాఫికింగ్‌ను అరికట్టడంలో కీలక పాత్ర పోషించవచ్చని అభిప్రాయపడ్డారు. కేవలం పోలీసులు మాత్రమే కాదు, ప్రతి ఒక్కరూ కూడా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని.. సోషల్ మీడియాలో అపరిచితులతో సంబంధాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇలా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉంటే ట్రాఫికింగ్‌ను తగ్గించవచ్చని చెప్పారు. గతంతో పోలిస్తే ట్రాఫికింగ్ కేసులు కొంతవరకు తగ్గాయని వివరించారు. అయితే, కొత్త పద్ధతులు వెలుగులోకి వస్తున్నందున నిరంతర అవగాహన అవసరమని రాయపాటి శైలజ స్పష్టం చేశారు.

## రాజమండ్రి కోర్టు వద్ద ఉత్కంఠ

### ఎమ్మెల్సీ అనంతబాబు అరెస్ట్

### కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలింపు

రాజమండ్రి,ఏప్రిల్24 : డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును రాజమహేంద్రవరం కోర్టు ప్రాంగణంలో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఆయనను అరెస్టు చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ కేసు మొదటి నుంచీ వివాదాస్పదంగానే కొనసాగుతోంది. తాజాగా బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణకు అనంతబాబు, ఆయన భార్య లక్ష్మీదుర్గ కోర్టుకు హాజరయ్యారు. ముఖ్యంగా కోర్టు నుంచి బయటకు వచ్చిన వెంటనే పోలీసులు అనంతబాబును అదుపులోకి తీసుకోవడం తీవ్ర చర్చకు దారి తీసింది. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఇప్పటికే అనంతబాబు బెయిల్‌పై ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఇటీవల ఆయన సాక్షులను బెదిరిస్తున్నారని ఆరోపణలు రావడంతో కోర్టులో బెయిల్ రద్దు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఆయనను అరెస్ట్ చేసే సమయంలో కోర్టు సముదాయం చుట్టూ పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అరెస్టు అనంతరం అనంతబాబును కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఆయనపై తదుపరి విచారణ కొనసాగనుంది. ఈరోజు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో అనంతబాబును స్టేషన్‌కు తీసుకెళ్లనున్నారు. అక్కడ ఆయనను విచారించి తదుపరి న్యాయ ప్రక్రియలు చేపట్టనున్నారు. ఈ కేసులో సాక్షులు భయపడేలా చేయడం లేదా కేసు నుంచి వెనక్కు తగ్గించేలా ఒత్తిడి తేవడం వంటి చర్యలు న్యాయపరంగా తీవ్రంగా ఉన్నాయి. అందుకే ఈ ఆరోపణలు నిజమని తేలితే, అనంతబాబుపై కేసు మరింత బలపడే అవకాశం ఉంది. ప్రస్తుతం అనంతబాబు అరెస్టుతో కేసు మరో మలుపు తిరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. బెయిల్ రద్దు పిటిషన్‌పై కోర్టు తీసుకునే నిర్ణయం, సాక్షుల వాంగ్మూలాలు, పోలీసుల దర్యాప్తు కలిసి ఈ కేసు తుది తీర్పును నిర్ణయించనున్నాయి. ఈ కేసు ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో, కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనే విషయం ఉత్కంఠగా మారింది.

## బాలికపై లైంగికదాడి కేసు

### భీమవరం డిఎస్పీపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి,ఏప్రిల్24 : భీమవరం డీఎస్పీపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భీమవరానికి చెందిన ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఫిర్యాదును వెనక్కు తీసుకోవాలని పోలీసులు బెదిరిస్తున్నారని న్యాయస్థానాన్ని బాలిక తల్లి ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ కేసును ఉపసంహరించుకోవాలని బాధితురాలిని పోలీసులు బెదిరించడం ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది.

## ఆపరేషన్ లోటస్‌ను మళ్లీ మొదలు

### ఎంపిలను బిజెపిలో చేర్చుకోవడంపై ఆప్ విమర్శలు

న్యూఢిల్లీ,ఏప్రిల్24 : కమలం పార్టీ ఆపరేషన్ లోటస్‌ను మళ్లీ మొదలుపెట్టిందని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ మండిపడ్డారు. ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చడ్డా ఆ పార్టీకి రాజీనామా చేసి, భాజపాలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంపై దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. భాజపా తన చర్యలతో మరోసారి పంజాబీలను గట్టి దెబ్బ కొట్టిందని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. కమలం పార్టీ ఆపరేషన్ లోటస్‌ను మళ్లీ మొదలుపెట్టిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. తమ ఏడుగురు ఎంపీలను ప్రలోభపెట్టడానికి భాజపా ఈడీ, సీబీఐలను వాడుకుందని ఆరోపించారు. ఈ రోజు ఏడుగురు ఆప్ ఎంపీలు భాజపాలో చేరారు. తమను మోసం చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరు. రాఘవ్ చడ్డాను పార్టీ ఎమ్మెల్యే, ఎంపీని చేసింది. పంజాబ్ ప్రజలు సందీప్ పాఠక్‌ను ప్రేమతో రాజ్యసభకు పంపారు. రాజేంద్ర గుప్తా, విక్రమ్ సాహ్నీ, అశోక్ మిట్టల్, స్వాతి మాలీవాల్.. వీరందరికీ పార్టీ, పంజాబ్ ప్రజలు దిగువస్థాయి నుంచి ఉన్నత స్థానాలకు చేరుకొనే అవకాశం కల్పించారు. వారి ఆశీస్సుల వల్లే హర్భజన్‌సింగ్‌కు కూడా పార్లమెంటులో అడుగుపెట్టే అవకాశం లభించింది. కానీ, ఈ ఏడుగురూ రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారు' అని సంజయ్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యసభలో తమ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డాపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) వేటు వేసి.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఇప్పుడు చడ్డాతో పాటు అశోక్ మిత్తల్ సైతం భాజపాలో చేరుతున్నట్లు ప్రకటించడంతో ఆప్‌నకు భారీ ఎదురు దెబ్బ తగిలిన్లట్లైంది.

## నూతన దిశగా పంచాయితీరాజ్ వ్యవస్థ

### ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్

అమరావతి,ఏప్రిల్24 : ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ నూతన దిశగా ముందుకు వెళ్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం స్పందించారు. గ్రామ స్వరాజ్యం దిశగా ఏపీ వేగంగా అడుగులు వేస్తోందని.. స్వయం ప్రతిపత్తితో ముందుకు సాగుతోందన్నారు. గ్రామ సభలకు పూర్వవైభవం వచ్చిందని తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ సమన్వయంతో గ్రామ సభలు, పల్లె పండుగ 1.0 / 2.0 విజయవంతం అయ్యాయని అన్నారు. స్వచ్ఛ రథాలు, ఎస్ఎల్ఆర్ఎమ్ కార్యక్రమాలు, మ్యాజిక్ డ్రైన్స్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు. ఈ గ్రామ స్వరాజ్యం యాత్రలో భాగస్వాములైన ప్రజలకు, సర్పంచ్‌లకు, వార్డ్ సభ్యులకు, పంచాయతీరాజ్ అధికార యంత్రాంగానికి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.

## లిక్కర్ కేసుల్లో ఇడి సోదాలు

హైదరాబాద్, తిరుపతిల్లో పలువురి నివాసాల్లో తనిఖీలు

అమరావతి,ఏప్రిల్24(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుల నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు శుక్రవారం సోదాలు చేపట్టారు. రాజ్ కసిరెడ్డి, వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, భారతీ సిమెంట్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప, వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి నివాసాల్లో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్, తిరుపతిలోని వారి నివాసాలతోపాటు కార్యాలయాల్లో ఈ తనిఖీలు ఈడీ అధికారులు చేపట్టారు. రూ. వేల కోట్ల ఈ మద్యం కుంభకోణంలో వీరంతా కీలక పాత్ర పోషించినట్లు ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) ఇప్పటికే నిర్ధారించింది. గతంలో వీరంతా అరెస్టయి.. బెయిల్‌పై బయట ఉన్నారు. ఇప్పటికే వీరిని సిట్ విచారించింది. సిట్ నివేదిక ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. వీరి నుంచి గతంలోనే ఈడీ అధికారులు సైతం స్టేట్‌మెంట్ తీసుకున్న విషయం విదితమే. ఈ ఆకస్మిక సోదాల్లో అక్రమ ఆస్తులను గుర్తించేందుకు ఈడీ అధికారులు సమాయత్తమయ్యారు. అందుకోసం ఈ ఐదుగురి నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ ఏకకాలంలో సోదాలు చేపట్టింది.




# లీగల్ వివాదాల్లో దృశ్యం-3

### ఆలస్యం కానున్న విడుదల

మలయాళ వెండితెరపై సంచలనం సృష్టించిన 'దృశ్యం' సిరీస్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో మోహన్ లాల్ హీరోగా వచ్చిన ఈ సిరీస్ సంచలనాలు సృష్టించింది. ఇప్పుడు ఈ సిరీస్‌లో మూడవ భాగం 'దృశ్యం 3' కోసం ప్రేక్షకులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమా విడుదలకు ముందే చట్టపరమైన చిక్కుల్లో పడటం ఇప్పుడు కేరళ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాను నిర్మిస్తున్న ఆశీర్వాద్ సినిమాస్ సంస్థ గతంలో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ అమెజాన్ ప్రైమ్‌తో కుదుర్చుకున్న డిజిటల్ డీల్‌ను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అమెజాన్ ప్రైమ్ సంస్థ ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను విచారించిన ఢిల్లీ హైకోర్టు, డిజిటల్ సంస్థకు అనుకూలంగా కీలక తీర్పునిచ్చింది. మే 15వ తేదీ వరకు 'దృశ్యం 3' సినిమాకు సంబంధించి ఎలాంటి కొత్త డీల్స్ క్షి లేదా ఇతర డిజిటల్ హక్కులు కుదుర్చుకోకూడదని నిర్మాతలకు స్టే ఆర్డర్ జారీ చేసింది. ఈ అనూహ్య పరిణామంతో చిత్ర యూనిట్ డైలమాలో పడింది. వాస్తవానికి ఈ చిత్రాన్ని మే 21న విడుదల చేయాలని నిర్మాతలు భావించారు. అయితే కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిన నేపథ్యంలో సమస్య త్వరగా కొలిక్కి రాకపోతే మే 21న సినిమా ప్రేక్షకుల ముందుకు రావడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. అటు మోహన్ లాల్ అభిమానులు మాత్రం ఈ వివాదం త్వరగా పరిష్కారం కావాలని కోరుకుంటున్నారు.




# యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్న దీపిక

షారుక్‌ఖాన్, సిద్దార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న మూవీ 'కింగ్'. ఈ సినిమాలో షారుక్‌కు జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా జరుగుతోన్న షూటింగ్ షెడ్యూల్‌లో ఆమెపై యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. రెండోసారి తల్లి కానున్నట్లు దీపిక ఇటీవల ప్రకటించారు. దీంతో ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలను తగ్గిస్తారని అంతా అనుకున్నారు. దానికి భిన్నంగా ఏప్రిల్ 21, 22 తేదీల్లో దీపిక భారీ యాక్షన్ సీన్స్ చేశారట. ప్రత్యేకంగా వేసిన సెట్‌లో ఈ పోరాట సన్నివేశాలు రూపొందించినట్లు సమాచారం. త్వరలోనే 8 మందితో కూడిన ÷ట్ సన్నివేశాన్ని కూడా సిద్దార్థ్ ఎ÷-లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇసుకలో ఈ ÷ట్ తీయనున్నారట. షారుక్, దీపిక ఇద్దరూ కలిసి ఈ ÷ట్ చేయనున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మరోవైపు ఈ సినిమా విడుదలను డిసెంబర్ 24కే ఖరారు చేస్తూ టీమ్ తాజాగా కొత్త వీడియోను పంచుకుంది. దీంతో అనుకున్న సమయానికి సినిమా వస్తుందా? రాదా? అనే వార్తలకు చెక్ పడింది. క్రిస్మస్‌కు కింగ్ సందడి షురూ అంటూ అభిమానులు ఆ వీడియోను పంచుకుంటున్నారు.



# సితార పిక్చర్స్‌లో నితిన్

యంగ్ హీరో నితిన్ వరుస ఫ్లాపులతో బాగా వెనుకబడిపోయాడు. భీష్మ తర్వాత సరైన హిట్ లేక సతమతమవుతున్నాడు. దాంతో లాంగ్ గ్యాప్ తీసుకున్న నితిన్ మరొక సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నాడు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం ద్వారా సోము, నర్రి అనే ఇద్దరు డెబ్యూ డైరెక్టర్లు టాలీవుడ్‌కు పరిచయం కాబోతున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా గురించి తాజాగా ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ కొత్త చిత్రం మే 4వ తేదీన లాంఛనంగా ప్రారంభించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా మే 6వ తేదీ నుంచే రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ప్రీ ప్లాన్ షెడ్యూల్ తో కేవలం 55 రోజుల్లోనే ఈ సినిమా పూర్తి షూటింగ్‌ను కంప్లీట్ చేయాలని మేకర్స్ టా÷-గ్గ÷ట్‌గా పెట్టుకున్నారు. అంటే దాదాపు రెండు నెలల లోపే షూటింగ్ పార్ట్ అంతా పూర్తయిపోతుంది. నితిన్ కెరీర్‌లో ఇది వన్ ఆఫ్ ది ఫాస్టెస్ట్ ప్రాజెక్ట్ అని చెప్పవచ్చు. ఈ చిత్రంలో నితిన్ సరసన కథానాయికగా రితికా నాయక్ నటించబోతున్నట్లు సమాచారం. 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాతో మెప్పించిన రితికాకు ఇది నితిన్‌తో ఫస్ట్ మూవీ. ఇక ఈ చిత్రానికి 'విరాటపర్వం' ఫేమ్ సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందించబోతున్నారు. మరో ఎన్నాళ్ళుగానో హిట్ కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నా నితిన్ కు డెబ్యూ డైరెక్టర్స్ హిట్ ఇస్తారో లేదో చూడాలి.








# క్రైమ్ థ్రిల్లర్ కథ...పరమపదసోపానం


అర్జున్ అంబటి, జెనిఫర్ ఇమాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'పరమపద సోపానం'. స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ శిష్యుడు నాగ శివ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కించిన ఈ యాక్షన్ రివెంజ్ డ్రామా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈ సినిమా ఏ మేరకు ఆకట్టుకుందో విశ్లేషణలోకి వెళ్లి తెలుసుకుందాం. హెల్త్ కమిషనర్ సత్యప్రకాష్ (కోటేశ్వరరావు) దారుణ హత్యతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడుతుంది. ఈ హైప్రొ÷ల్ కేసును ఛేదించే బాధ్యతను అశ్వద్ధామ (అజయ్ రత్నం) స్వీకరిస్తాడు. అయితే ఈ కేసులో ప్రధాన సాక్షిగా అర్జున్ (అర్జున్ అంబటి) అనే గేమింగ్ డిజైనర్‌ను గుర్తిస్తారు. అయితే, అర్జున్ ఓ మానసిక సమస్యతో బాధపడుతుంటాడు. తనను ఎవరో చంపాలని ప్రయత్నిస్తున్నారనే భయంలో ఉన్న అర్జున్‌కు రక్షణగా క్రైమ్ బ్రాంచ్ సీఐ నేహా (జెనిఫర్ ఇమాన్యుయేల్) బృందాన్ని నియమిస్తారు. మరోవైపు వరుసగా ప్రభుత్వ అధికారులు హత్యకు గురవుతుంటారు. ఈ హత్యల వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? హెల్త్ మినిస్టర్ పురుషోత్తం రెడ్డి (పిల్లా ప్రసాద్) పాత్ర ఏమిటి? అసలు 'పాలకడలి' అనే గ్రామానికి, ఈ కథకు ఉన్న సంబంధం ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా. దర్శకుడు నాగ శివ తన తొలి ప్రయత్నంలోనే ఒక బలమైన సామాజికాంశాన్ని కమర్షియల్ హంగులతో జోడించి తెరకెక్కించడంలో విజయం సాధించారు. మొదటి భాగం వరుస హత్యలు, సస్పెన్స్ అంశాలతో పాటు మెహబూబ్ బాషా కామెడీతో సరదాగా సాగిపోతుంది. ఇక ఇంటర్వెల్ ట్విస్ట్ సెకండాఫ్ పై ఆసక్తిని పెంచుతుంది. రెండవ సగం కథ వేగం పుంజుకుంటుంది. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ మరియు క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తాయి. కేవలం 1 గంటా 47 నిమిషాల నిడివి ఉండటం సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్. అర్జున్ అంబటి కథకు సరిగ్గా సరిపోయాడు. జెనిఫర్ ఇమాన్యుయేల్ పోలీస్ ఆఫీసర్‌గా ఒక పవర్‌ఫుల్ పాత్రలో మెప్పించింది. చాలా కాలం తర్వాత ఒక బలమైన పాత్రలో కనిపించగా, విలన్ పాత్రలో పిల్లా ప్రసాద్ తన అనుభవాన్ని ప్రదర్శించారు. మెహబూబ్ బాషా కామెడీ రిలీఫ్ ఇచ్చింది.

# మరోమారు వాయిదా దిశగా పెద్ది

## జూన్ 4 నుంచి 24కు మారినట్లు వార్తలు

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం మల్టీ స్పోర్ట్స్ నేపథ్యంతో ప్రత్యేకంగా రూపొందుతోంది. ఇప్పటికే చిత్రీకరణ దాదాపు పూర్తయిందని, ఒక పాట మినహా మిగతా భాగం ముగిసినట్లు చిత్రబృందం తెలిపింది. ప్రస్తుతం ఆ చివరి పాట చిత్రీకరణ కొనసాగుతుండగా, విడుదల తేదీపై కూడా స్పష్టత వస్తోంది. ముందుగా జూన్‌లో సినిమా విడుదల అవుతుందని ప్రకటించిన మేకర్స్, ఖచ్చితమైన తేదీని మాత్రం వెల్లడించలేదు. తాజా సమాచారం ప్రకారం, ఇంకా పూర్తి చేయాల్సిన పనులు ఉండటంతో జూన్ 4న సినిమా విడుదల కష్టమని తెలుస్తోంది. దీంతో జూన్ 25ను విడుదల తేదీగా నిర్ణయించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదే జరిగితే జూన్ 24 రాత్రి నుంచే ప్రీమియర్ ప్రదర్శనలు కూడా ఉండే అవకాశముంది. ఈ విడుదల తేదీపై చిత్రబృందం నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. అభిమానులు మాత్రం ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలతో ఎదురు చూస్తున్నారు. స్పోర్ట్స్ నేపథ్యంలో భావోద్వేగాలను కలిపి రూపొందుతున్న ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని భావిస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తనదైన శైలిలో కథను తెరకెక్కిస్తున్నందున ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారుతోంది. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన 'పహిల్వాన్ గ్లింప్స్'కు తోడు ఏఆర్ రెహమాన్ అందించిన 'చికిరి చికిరి', 'రేయ్ రేయ్ రా' వంటి పాటలు చార్ట్‌బస్టర్లుగా నిలిచాయి. తాజాగా ఈ చిత్రంలో ఉండబోయే హై-వోల్టేజ్ స్పెషల్ సాంగ్ కోసం చిత్ర యూనిట్ గ్లామర్ బ్యూటీ శృతి హాసన్‌ని ÷నైల్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం.






# దిల్ రాజ్ నిర్మాతగా సల్మాన్ మూవీ

### పూజా కార్యక్రమాలతో ప్రారంభం

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా విడుదలైన ప్రత్యేక వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. షూటింగ్ ప్రారంభంపై స్పందించిన సల్మాన్ ఖాన్, ఈ భారీ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌ను వచ్చే ఏడాది ఈద్ పండుగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ నిరాశ చెందవద్దు. మీ అంచనాలకు తగ్గట్టుగానే ఈ సినిమా ఉంటుంది అని అభిమానులకు హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది ఈద్ సందర్భంగా ఆయన సినిమాలు విడుదలై భారీ విజయాలు సాధించడం తెలిసిందే. ఈ సినిమాలో సల్మాన్ సరసన లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com